# చైతన్యం

సంకల్ప బలం

సామాజిక విలువల మాసపత్రిక

జనవరి 2018 Rs. 20




State FiberNet Limited
IP TV | Broadband Services | Wi-Fi | Landline Telephone | Videos on Demand
Surveillance | Virtual Classrooms | FSOC | Drones
to the People of Andhra Pradesh
Dedication
Sri Ram Nath Kovind
Hon'ble President of India
Andhra Pradesh State
IP TV | Broadband Services | Wi-Fi
Surveillance





# చైతన్యం

సంకల్ప బలం

సామాజిక విలువల మాస పత్రిక

సంపుటి -7 జనవరి 2018 సంచిక -4

వ్యవస్థాపక సంపాదకురాలు:

**తీగవరపు శాంతి**

## ఈ సంచికలో

### ధారావాహికములు:


| | |
|---|---|
| బొమ్మలు చెప్పిన బాలల | 11 |
| మోచేతి పొడుపు | 13 |
| రసాయన శాస్త్రం | 14 |
| మిస్ మేఘమాల | 16 |
| కాశీ ఖండం | 21 |
| తెలుగు భాషకు గొడుగు... | 25 |
| సంభాషణ సంస్కృతం | 28 |
| మా ఊరి నందుల కథ | 36 |
| రాశి ఫలాలు | 48 |


### ప్రత్యేక ఆకర్షణలు


| | |
|---|---|
| సంపాదకీయం | 4 |
| ప్రజాభిప్రాయం | 5 |
| సంపద | 6 |
| సంరక్షణ-పోషణతో ఒత్తిడికి దూరం | 9 |
| ప్రపంచ తెలుగు మహాసభలు | 34 |
| ఆచార్య దేవో భవ | 38 |
| దేవునికి కానుక | 40 |
| ప్రహేళిక | 42 |
| కలియుగ వరదుని మకర జ్యోతి దర్శనం | 43 |


రచనలలోని అభిప్రాయాలు రచయితలవి మాత్రమే. పత్రిక యాజమాన్యానికి ఎటువంటి సంబంధమూ లేదు.

# నేటి భారతం

దేశంలో అవినీతి ఆటలో అరటిపండైపోయింది. ఎటువంటి అవినీతి చేసినా మన దేశంలో బయట పడడం వరకే. కాని వారికి ప్రజలలో ఇమేజ్ పెరిగి, వారు రాజకీయ పదవులు పొందే అవకాశం, అదే అర్హతగా మారడం మన భారత దేశంలోనే ఉంది అనడంలో ఎటువంటి సందేహం లేదు.స్పెక్ట్రమ్ కేసు తీసుకుంటే 6 సంవత్సరాలు నలిగిన కేసు నీరు-గారిపోయి, నిర్దోషులుగా బయట పడడంతో , ప్రభుత్వం ఏదో చేస్తుంది అని ఆశపడుతున్న కొద్దిమంది ప్రజలలో అనుమానాలు రేకెత్తుతున్నాయి. ఈ ప్రభుత్వం ఏదో చేస్తుంది అని ఆశపడుతున్న ప్రజలకు ప్రభుత్వం ఏ విధంగా నిరూపించుకుని, మళ్ళీ ఓట్ల కోసం ప్రజల దగ్గరకు వస్తుంది? ఒక పక్క రోడ్డు మీద అడుక్కునే వాడి పరిస్థితిలో మార్పు లేదు, మధ్య తరగతి వారి స్థితిలోనూ మార్పు లేదు, అక్రమంగా ధనాన్ని కూడబెట్టే వారి లోనూ మార్పు లేదు. రాజకీయ నేతలలో నూ మార్పులేదు. చివరికి ఇంత దీన స్థితికి దిగజారి దేశ అభివృద్ధికి బీటలు పడుతున్నా, ప్రజలలో, ముఖ్యంగా ఓట్లు వేయడంలో.... అందులోను అదే రాజకీయ నాయకుల దగ్గర నోట్లు తీసుకుని ఓట్లు వేసి, వారిని అందలం ఎక్కించి, మరలా వారినే మాకు బతుకుతెరువు చూపించండి అని అడుక్కోవడంలోనూ మార్పులేదు. ఇదే నిజంగా మన అత్యంత దీనావస్థ అని చెప్పుకోక తప్పదు. ఇక యువత చాలా దారుణంగా తయారవుతోంది. పూర్వం చిన్నప్పటినుండీ రామాయణ భారతాలు, భగవద్గీత, పురాణ గాథలు, నీతి కథలు వంటివి బోధించి పిల్లలంతా సన్మార్గంలో నడిచి, వారు ఎన్ని తరాలైనా ధర్మం వీడని రీతిలో, ఈ జన్మకే కాక జన్మ జన్మలకీ పుణ్యం సంపాదించే విధంగా వారిని తీర్చిదిద్దేవారు. ఇప్పటి పరిస్థితి అతి భయంకరంగా తయారయ్యింది. నిద్ర లేచింది మొదలు ప్రేమకు సంబం-ధించిన విషయాలు, యువతీయువకులు ఒకరికొకరు ఆకర్షణకు లోనయ్యేవి, తాగి, డ్రగ్స్ కి బానిసయ్యి, ఇష్టారీతిలో తల్లి-తండ్రులు ప్రిస్టేజిగా ఫీలైయ్యి కొని ఇచ్చే ఖరీదైన వాహనాలతో రోడ్లమీద డ్రైవ్ చేసి ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు కొందరు. మరికొందరు యువతీ యువకులు ఆకర్షింపబడే విధంగా ఉండే సినిమాలు ఎక్కువవుతుండడంతో, ప్రసార మా-ధ్యమాలు ఎక్కువవుతుండడంతోను, ఒకరికొకరు ఆకర్షణలమీదే దృష్టి పెట్టి, చివరకు ప్రేమ పేరుతో జీవితాలతో చెలగాట-మాడుతున్నారు. ఒక్కొక్క జీవి చింతగింజంత సైజులో కడుపులో ప్రాణం పోసుకున్న దగ్గర నుండి వారిని పెంచి పెద్ద చేసి, ఒక మనిషిగా తీర్చి దిద్దడం ఎంతకష్టమో, తెలియని ఆ మూర్ఖులను ఏం చెయ్యాలి? అలాంటి వారు ఇంకా ఇంకా రోజు రోజుకీ పెరిగి పోతుంటే ఇటు సమాజంలో తీసుకురావలసిన మార్పుల గురించి గాని, ప్రభుత్వ చట్టాల అమలు పరచడంలో తీసుకో-వలసిన కట్టుదిట్టమైన చర్యల గురించి గాని ప్రభుత్వాధికారులు ఎందుకు ఆలోచించరు? ప్రజల్లో , విద్యార్థులలో, యువతలో, తల్లితండ్రుల్లో ఆత్మపరిశీలన రావాలి. ఉపాధ్యాయులు కూడా నీతి పాఠాలు బోధించవలసిన అవసరం ఎంతైనా ఉంది.

ఇక కుటుంబ సమస్యల గురించి అయితే చెప్పనవసరం లేదు. అప్పో సొప్పో చేసి, పిల్లలను చదివించి, వారికి నచ్చినరీతిలో పెళ్లి చెయ్యడమంటే , ఇప్పటి తల్లితండ్రులకు ఒక జీవిత సవాల్. హమ్మయ్యా ! పెళ్లి చేశాము అనుకుంటే సరిపోయిందా? వారు ఇద్దరూ మానసికంగా ఎంత దగ్గరగా వున్నారు? అన్నదికూడా ప్రశ్నయే. ఎందుకంటే! ఇద్దరూ చదు-వుకున్న వారైతే వారి ఉద్యోగాల్లోనే వారి జీవితాలకు సమయం చాలదు. ఇక వారిద్దరూ సంతోషంగా కలిసిమెలిసి ఉండే సమయం ఎక్కడ? అందుకే చాలామంది కాపురాలు చేస్తున్నా, అంటే ఒకే ఇంట్లో వుంటున్నారుకానీ, వారి మధ్య అన్యో-న్యత కరువైపోయింది అని చెప్పక తప్పదు. ఈ రోజుల్లో ఆడపిల్లల చదువులు ఎందుకొచ్చాయో అనేవారే కాని, ఆ తేడాలు ఎందుకు వస్తున్నాయి? సరిదిద్దాలి అనుకోవడం లేదు. అందుకే ప్రస్తుతం మన దేశంలో కుటుంబ అన్యోన్యతకు సంబం-ధించిన క్లాసులు కూడా చాలా అవసరం. ఇప్పటికే చాలామంది అవగాహనా రాహిత్యంతో చదువుల ప్రాధాన్యత తెలిసినట్టు, కుటుంబ ప్రాధాన్యత తెలియక విడాకులు తీసుకునే వారు ఎక్కువౌతున్నారు. వీటన్నిటికీ త్వరితగతిని పరిష్కార చర్యలు చేపట్టకపోతే కుటుంబవ్యవస్థ చాలా వరకు దెబ్బతింటుంది అనే చెప్పాలి. తొందరగా చర్యలు చేపట్టి కొంతవరకైనా కాపా-డుకుందాం. మరోపక్క తెలంగాణా ప్రభుత్వం "ప్రపంచ తెలుగు మహా సభలు" ఎంతో అంగ రంగ వైభవంగా నిర్వహించిం-ది. ఎంతో గొప్ప ఆశయంతో మొదలుపెట్టింది. కానీ ఆచరణలో లోపాల వల్ల విమర్శలను కూడా ఎదుర్కొంది. ముఖ్యంగా విదేశీ తెలుగువారిని అందలం ఎక్కించారు బానే వుంది కానీ స్వదేశీ పండితులపై మాత్రం శీతకన్ను చూపించారు అనే విమర్శను ఎదుర్కొంది. అన్నిటికన్నా ముఖ్యంగా సభలు అనేక చోట్ల నిర్వహించడంలో అన్నిటినీ అందరం చూడలేక పోయాం అనీ, ప్రపంచ మహాసభలు అన్నీ ఒకే చోట నిర్వహిస్తే, అందరం అన్నీ చూసి ఆనందించే వాళ్ళమనీ ప్రజల అభి-ప్రాయం. ప్రతి సంవత్సరం నిర్వహిస్తామన్నారు కనుక లోపాలను సరిదిద్దుకుని తెలుగు భాషకు పట్టం కడతారని ఆశిద్దాం.

2018 కొత్త సంవత్సరంలో అన్ని లోపాలు తొలగిపోయి ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని కోరుకుంటూ ప్రపంచంలోని ప్రజలందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపు-తోంది మీ చైతన్యం సంకల్పబలం.



తీగవరపు శాంతి

# ప్రజావేదిక

1. భువన చంద్రగారి ఆలోచనా శక్తికి జోహార్లు. వారు ప్రజల కోసం కథ ద్వారా అందించిన వేప చెట్టు ఉపయోగాలు ఎన్నో ఎంతో చక్కగా వివరించారు. ప్రతీ నెల వారి కథలో కొత్తదనం ఉంటోంది. వారికి మా ధన్యవాదాలు .

శిరీష , శ్రీమతి లావణ్య , శ్రీ రమేష్ ---కాకినాడ.
శ్రీమతి అమృత వల్లి, శ్రీమతి లక్ష్మి ---నరసాపురం.

2. శీతాకాలంలో అందరూ ఆరోగ్యంగా ఉండడానికి తీసుకోవలసిన జాగ్రత్తలు, తీసుకోవలసిన పండ్లు, కూరగాయల గురించి చాలా బాగా చెప్పారు.

శ్రీ లోకేష్ , శ్రీమతి అనసూయ --- పూనా .
శ్రీమతి కరుణ, శ్రీమతి జానకి ---పిఠాపురం.

3. పాలెపు బుచ్చిరాజుగారు వ్రాస్తున్న బొమ్మలు చెప్పిన కథలు చాలా ఆసక్తిగా ఉంటున్నాయి. ప్రతీ నెల ఈ కథల కోసం ఎంతో ఎదురుచూస్తున్నాము.

శ్రీమతి సుశీల , శ్రీమతి అనంత లక్ష్మి ----పొద్దుటూరు. శ్రీ కనకారావు , శ్రీమతి లలిత ---బెంగళూరు.

4. డా. కవన శర్మ గారు వ్రాస్తున్న రసాయన శాస్త్రం బుఱ్ఱకి బాగా పదును పెడుతోంది. చాలా ఇంట్రస్ట్ గా ఉంది. భూమి రూపుదిద్దుకోవడం గురించి, విశ్వము ఏర్పడడం గురించి ఎంతో వివరంగా చెప్పి మాకు తెలియని ఎన్నో విషయాలు తెలియ జేశారు.

శ్రీ కమలేష్ , శ్రీ నవీన్ ----ఢిల్లీ . శ్రీమతి కమల పిఠాపురం.

5. మేఘమాల సీరియల్ చాలా బావుంటోంది. ఎంతో ఆసక్తి గా ఉంటోంది.

శ్రీమతి అపర్ణ, శ్రీ రాజశేఖర్ ----- కరీంనగర్.
శ్రీమతి భారతి , శ్రీమతి లావణ్య --- బొంబాయి.

6. 'డీమానిటైజేషన్' గురించి శ్రీకాంత్ గారు బాగా వ్రాసారు.

శ్రీ మురళీ కృష్ణ , శ్రీమతి రవళి ---- నిజామాబాద్.
శ్రీమతి లలిత, శ్రీ రామ మోహన్ --- గుంటూరు.

7. కాశీ క్షేత్రం గురించి ఎంతో అత్యద్భుతంగా అందిస్తున్న మురళీ కృష్ణ గారికి మా హృదయ పూర్వక నమస్సులు. కాశీ విశ్వేశ్వరుడ్ని చూసినంత ఆనందం కలుగుతోంది.

శ్రీ కోటేశ్వర రావు, శ్రీమతి లక్ష్మీ రాజ్యం - హైదరాబాదు. శ్రీమతి సుమిత్ర, శ్రీమతి మానస,- ఏలూరు.

8. తెలుగు భాషకే గొడుగులా పట్టి, గిడుగువారి గురించి ఎంతో చక్కగా వ్రాసారు పోడూరి శ్రీనివాస రావుగారు. ప్రతీ నెలా ఒక్కొక్కరి గురించి ఎంతో అద్భుతంగా అందిస్తున్నారు.

శ్రీ సురేష్, శ్రీ ప్రసాదరావు ----- ఆదిలాబాదు.
శ్రీమతి అఖిల, శ్రీ నరసింహారావు ---సికింద్రాబాదు.

9. సంస్కృత పాఠాలను ఎంతో సులువుగా అర్థమయ్యేటట్టు గా మాకు అందిస్తున్నందుకు మాకు చాలా సంతోషంగా ఉంది. వారికి మా ప్రత్యేక కృతజ్ఞతలు.

శ్రీమతి మాధవి, శ్రీమతి అమల --- వరంగల్ . శ్రీ హనుమంతరావు , శ్రీమతి సావిత్రి --- విజయనగరం

10. వల్లూరి సుబ్రహ్మణ్య శర్మ గారు అందిస్తున్న 'మోచేతి పొడుపు' చాలా బావుంది. సమస్యలు, పరిష్కారాలు రకరకాలుగా బాగా వ్రాసారు.

శ్రీ పురుషోత్తమ రావు, శ్రీ శ్రీనివాసరావు ----- బొంబాయి. శ్రీమతి అపర్ణ --- వరంగల్.

11. 'మాఊరి నందుల కథ' మా పల్లెటూరు విశేషాలను గుర్తుచేస్తూ చాలా బావుంటోంది. ఫోటోలు కూడా బావున్నాయి.

శ్రీ నర్సింహ మూర్తి , శ్రీ జగన్నాథం --- రాజమండ్రి.
శ్రీమతి భారతి --- హైదరాబాదు.

12. లోకాలకు ఆదిగురువు శ్రీ దత్తాత్రేయుడి గురించి చాలా చక్కగా వ్రాసారు రచయిత.

సుబ్బారావు, రాణి - శ్రీకాకుళం

సనాతని సురక్షితం కథ బాగుంది. రాశిఫలాలు మీ పత్రికకే తలమానికం. రచయితలకు నమస్సులు.

రామచంద్రుడు, జానకీబాల - అత్తాపూర్

# భువనచంద్ర



# సంపద

రంభుడిది లజ్జపల్లి గ్రామం. వాడికున్న ఆస్తి ఓ గుడిసె.... రెండు వేప చెట్లు, ఓ గేదె. ఇక ఆధార పడ్డవాళ్లయితే భార్య, ఇద్దరు పిల్లలు. పొద్దున్నే కూలికి పోతాడు. రెక్కలు ముక్కలు చేసుకుని ఆ రోజుకి కావలసింది సంపాయించుకుంటాడు.

వేప చెట్ల కింద నులక మంచం వేసుకుని ' తత్వాలు' పాడుకుంటూ హాయిగా పడుకుంటాడు. భార్య చుక్కమ్మ కూడా అణుకువ కలదీ, పొదుపరీ. పిల్లల్ని 'పాక బడి' లోకి పంపాక పక్కనున్న అడవిలోకి పోయి, ఎండు పుల్లలు, విస్తళ్ళు కుట్టే అడ్డాకులు తెచ్చుకుంటుంది. చీపుళ్లు కుట్టే చీపులు పొదలకి అడవిలో లోటేముందీ! అందుకే వాటిని కొడవలితో కోసి, మూటలు కట్టి తెచ్చి, చక్కని చీపురు కట్ట లాగా కట్టి అమ్ముతుంది. కొబ్బరాకు చీపుళ్లు కూడా తయారు చేస్తుంది. కూలీగా రంభుడి సంపాదన ఎంతో 'చుక్కి' సంపాదన కూడా దాదాపు అంతే. చుక్కి సంపాదన తోటే పిల్లలకి బట్టలు కొద్దో గొప్పో నగలు అమరుతున్నాయి.



వాళ్ళ అదృష్టం ఏమో గానీ చెట్ల నిండా పిట్టలే. కాకి గూళ్ళు, పిచ్చుక గూళ్ళు బోలెడు. అవి కాక వేప కాయలు, పళ్ళు వచ్చేసరికి పచ్చ పచ్చని చిలుకలు గుంపులు గుంపులుగా వాలుతుంటాయి. అన్ని రకాల పక్షుల కిలకిలారావాలతో, అరుపులతో ప్రతి ప్రభాతమూ వాళ్లకి సుప్రభాతమే.

ఉన్నట్టుండి ఓ రోజున వాళ్ళింటికి 'రామ సంపదయ్య' 'కృష్ణ దాసి' అనే దంపతులొచ్చారు. వాళ్లిద్దరూ చుక్కమ్మకి స్వయానా మేనత్త, మేన మామలు.

'సంపదయ్య' కి ఆర్భాటమూ, హడావిడే కాక కాస్త డబ్బున్న వాడినన్న గర్వమూ ఎక్కువే. కృష్ణ దాసికంటే ఆమె అలంకరించుకున్న ఆభరణాల బరువే ఎక్కువ.

ఏమే చుక్కీ ... ఎంత కాలం యీ వెధవ పల్లెటూళ్ళో వుంటారే? ఆ పిచ్చి పాకబడిలో చదివి నీ పిల్లలు ఏం పైకొస్తారూ? వచ్చిన ప్రతి సారీ చెబుతూనే

వున్నాను కదా... హాయిగా మా బస్తీ వొచ్చెయ్యమనీ .!!, ఆ ఇంట్లో వున్నా ఏకైక బెంచీ మీద ఇబ్బందిగా కూర్చుంటూ అన్నది కృష్ణదాసి.

"వచ్చి ఏం చెయ్యం అత్తా? ఆయనకీ కూలిపని తప్ప మరోటి రాదాయె. ఇక నా సంగతంటావా ... అడివి తల్లి దయ వల్ల కొద్దో గొప్పో డబ్బులు దొరుకుతున్నాయి. వున్నవూరు వదిలేసి అక్కడకి వస్తామనుకో, తల దాచుకోవాలన్నా ఆద్దెకి వేలకివేలు పొయ్యాలి కదా! ఇక్కడైతే ఏదో గవర్నమెంటోళ్ల పాకబడి వుంది. ఇహ అక్కడికొస్తే వీళ్ళ చదువులకి డబ్బు కుమ్మరించాల్సిందేగా? అదీ గాక బస్తీ కొస్తే నేనేం చేయాలి? ఈ ఇంట్లోనో ఆ ఇంట్లోనో పాచి పనికి కుదురుకోవాలి. యజమానులనే మాటల్తో పాటు తిట్లనీ భరించాలి. ఇక్కడైతే నేనే రాణీ, నేనే మంత్రి. ఓ పోరూ లేదు, పొత్తూ లేదు", నిశ్చింతగా అన్నది చుక్క.

'మంచిమాటన్నావే అమ్మాయ్! చక్కని మాట. మేం బస్తీలో ఉండి ఏం బావుకుంటున్నాం? ఏదో తలలో ఓ నాలుకుంది గనక దాన్ని ఉపయోగించి లక్షాధికారినయ్యాను. పిల్లలకి ఆయామన్న సంబంధాలు చేసి వాళ్ళకో దారి చూపించాను. ఏ మాటకామాటే చెప్పుకోవాలి. నేను కూడ మా పల్లెటూళ్ళో ఉండిపోతే ఇలా ఉండేవాడినా? అయినా చుక్కమ్మా, మనం ఆలోచించాల్సింది మన గురించి కాదు, మన పిల్లల భవిష్యత్తు గురించి. పోనీ ... మీరు ఇక్కడే హాయిగా ఉండిపోతారనుకుందాం. ... రేపు మీ పిల్లలు కూడా కూలీ నాలీ చేసుకుంటూ, అడవిలో పుల్లలేరుకుంటూ వుంటారా?' ప్రశ్న రేకెత్తించాడు సంపదయ్య.

చుక్కమ్మ ఆలోచనలో పడింది. వాళ్లిద్దరూ చెప్పింది సబబుగానే ఉంది. "మరి బస్తీలో బతికేదెట్టా?" ఓ గంట తరువాత అన్నది. "అట్టా అడుగు, చెబుతాను. రేపట్నుండీ బడి సెలవలే గనుక నువ్వూ పిల్లలూ రండి. నా కూతురు సావిత్రి బంగాళాకి ఔట్ హౌస్ ఉంది. అందులో ఉందురు గాని. ఏదో నీకు పని దొరికేంత వరకూ, సావిత్రి ఆలనా పాలనా చూస్తుండు. దానికీ మొన్నీ మధ్యనే మూడో కానుపయ్యింది. మేమే ఉందుము, కానీ అబ్బాయికీ లేకలేక బిడ్డ పుట్టే వేళ. కోడలికి తొమ్మిదో నెల. కోడలు వాళ్ళది పల్లెటూరు కనుక అన్ని సౌకర్యాలు వుంటాయని మేమే పురుడు పోస్తున్నాం. ఓ నెలా రెండు నెలల్లో నువ్వూ, పిల్లలూ కాస్త బస్తీకి అలవాటు పడతారు. రంభుడ్ని కూడా పిలిపిద్దాము. నువ్వు ఏమాత్రం మొహమాట పడకుండా నెలకి అయిదు వందలు సావిత్రితో ఇప్పిస్తాను. అయినదానివి నువ్వు. అందుకే అడగడానికి వచ్చాం", అన్నాడు సంపదయ్య.

మనసులోనే లెక్కలు వేసుకుంది చుక్క. రోజుకి పది రూపాయలు సంపాదిస్తాడు రంభుడు. నెలకి అయిదు వందలంటే రంభుడి సంపాదన కంటే చాలా ఎక్కువ. భోజనాలు అవీ సావిత్రి ఇంట్లో వెళ్ళిపోతే ఎట్టా చూసినా నెలకి నాలుగు వందలు వెనకేయ్యచ్చు. రంభుడు సంపాదించేది ఇక్కడ ఎలానూ సంపాదిస్తాడు. చుక్కమ్మకి వచ్చిన ఆలోచన ఒక్కటే. రంభుడు ఈ అవకాశాన్ని అంది పుచ్చుకుంటాడా, వదిలెయ్యమంటాడా అనేదే. రంభుడు సాయంత్రానికి వచ్చాడు.

" అది కాదోయ్ అబ్బాయ్ ... ఈ కూలి పని బస్తీలో అయితే రోజుకి కనీసం యాభై వస్తాయి. అంటే నెలకి పదిహేను వందలు. నువ్విక్కడ తెచ్చుకునే దానికన్నా ఐదురెట్లు ఎక్కువ. అదీగాక నీ బిడ్డలు దొర బాబుల్లా పెరుగుతారు. ఈ గేదెని అమ్మేసి, ఆ రెండు చెట్లు అమ్మేసి, వచ్చి దానితో ఓ కొట్టు పెట్టుకుని, ఇక్కడ వున్నా నీ చుట్టుపక్కల వాళ్ళతో విస్తరాకులు కుట్టించీ, చీపుళ్లు కట్టించీ అవన్నీ నీ షాపులో పెట్టుకున్నా ఏడాదికి కనీసం యాభై వేలు సంపాదించగలవు. తోడూ నీడగా మేమూ ఉంటాము", అన్నాడు సంపదయ్య. మధ్య మధ్యలో మాటలు తనూ అందించింది కృష్ణ దాసి.

నెల రోజుల్లోపలే చుక్కమ్మ,

పిల్లలూ సావిత్రి ఇంటి ఔట్ హౌస్ లో దిగారు. పిల్లలకీ ఉత్సాహంగానే ఉంది బస్తీని చూస్తే. సావిత్రి చుక్కమ్మని వరస పెట్టి పిలిచినా, పని దగ్గర మాత్రం యజమానురాలిలాగా ప్రవర్తిస్తోంది. "ఎవరింటిదగ్గరైనా ఒకేలా ఉండాలి. చుట్టాలనుకుని నెత్తికెక్కకూడదు కదా !" అని చుక్కమ్మే సద్దుకుంది.

పెళ్ళాం, పిల్లలు బస్తీలో ఉండడం, తాను ఒంటరిగా ఉండడం రంభుడికి కొత్తగా ఉంది. పొద్దు వాలాక రంభుడికి పొద్దుపోవడం లేదు. అందుకే పొద్దుపోవడం కోసం మిత్రులతో కలిసి బాతాఖానీ వేస్తున్నాడు. కొత్తగా చుట్ట అలవాటైంది. అప్పుడప్పుడు స్నేహితుల బలవంతం మీద 'గుక్క' కూడా వేస్తున్నాడు.

రెండు నెలల తరువాత గాలి మళ్ళి, పిల్లల్ని చూడడానికి బస్తీకి పోయాడు రంభుడు. బస్తీ వన్నె చిన్నెలన్నీ దగ్గరుండి మరీ చూపించాడు సంపదయ్య. పిల్లలూ, చుక్కమ్మ కూడా రంభుడిని చూసి చాలా సంతోషించారు.

బస్తీ నుంచి ఊరికి తిరిగొచ్చిన రంభుడికి ఊళ్ళో ఉండబుద్ధికాలేదు.రెండు చెట్లూ బేరానికి పెట్టాడు, ఇళ్లస్థలం సంగతి తరువాత చూసుకుందామని. ఏభై ఏళ్ల వయసు గల వేపచెట్లు బ్రహ్మాండంగా పెరిగినవి. చెట్టుకి అయిదు వేల ధర పలికింది ,



నరకడానికి చెట్టుకి వెయ్యి ఇస్తామన్నారు బేరగాళ్ళు. ఆ వెయ్యి కలిపితే చెట్టుకి ఆరు వేలు దొరుకుతాయి కదా అని ఆశ పడి, "అయ్యా! నేనే నరికి ఇస్తాను" అని అన్నాడు రంభుడు. చేవ పట్టి ఉండడంతో నరకడం అంత తేలిక కాలేదు. మధ్యాహ్నమయ్యే సరికి ఓ పక్క చెమటలు, మరో పక్క నెప్పులతో రంభుడికి 'చాలి' వచ్చింది. నీడ చూసుకుని చెట్టు మొదలుకి ఆనుకుని సేద తీరుతున్నాడు రంభుడు.

"ఏరా రంభుడూ, చెట్లు అమ్ముతున్నావని విన్నాను. చూత్తే నిజంగానే అమ్మినట్టున్నావు. ఒరే .... ఒక్క పాలి ఆలోచించు . నువ్వీ చెట్టుని నరుకుతున్నా, అది నీకు నీడే యిస్తోంది కాదూ ? బస్తీ మాయలో పడి నువ్వు నరికేది చెట్టుని కాదురా ... నీ బతుకుని. అన్నీ అమ్ముకుని బస్తీకి పోయి నువ్వు బతికే బతుకేంటో తెలుసా? బానిస బతుకు. ఒరే మనిషికి ఏం గావాల్రా? ఎవడ్రా ఈ లోకంలో శాశ్వతం? ఈ చెట్టు నీడ నీది. నీ నీడని నువ్వు నరికేసి పరాయి నీడలో ఎంత కాలం బతుకుతావురా? పిల్లల్ని చదివించు. ఏం? పల్లెటూళ్ళో చదివిన పిల్లలు బస్తీలని ఏలడం లేదా ? బస్తీల్లో లక్షలు పోసి చదివించినోళ్లు పోరంబోకులు కావడం లేదా? ఆలోచించు", రంభుడి ఎదుట కూర్చుని అన్నాడు మల్లయ్య తాత. ఆయనుండేదీ ఆ వీధే.

చేతిలో గొడ్డలి వంకా, చెట్టు వంకా చూసాడు రంభుడు. పొద్దున్నించీ కష్టపడితే కొన్ని అంగుళాలు మాత్రమే తెగింది.

" ఎన్ని దెబ్బ లైనా ఓర్చుకుంటాను... కూలిపోయేదాకా నీకు నీడని ఇస్తూనే ఉంటాను బిడ్డా' అన్నట్టు ఊగాయి చెట్టు కొమ్మలు. పక్షిపిల్లలు కిలకిలలాడాయి చిరుగాలికి.

"కొట్టను తల్లీ ....నిన్ను గొడ్డలితో కొట్టి నరకను. తాతా, నా కళ్ళు తెరిపించావు. చెట్టుకి మించిన చుట్టం లేదు. తృప్తికి మించిన సంపద లేదు. నువ్వు సల్లగా ఉండాల .... చెట్ల నీడన నేను చల్లగా ఉండాల .." లేచి చెట్టుని నిమిరి కళ్ళు తుడుచుకున్నాడు రంభుడు. "రేపెల్లి చుక్కమ్మ నీ, పిల్లలనీ తీసుకురావాల" అనికూడా నిర్ణయించుకున్నాడు.

శుభం.

మళ్ళీ కలుద్దాం

భువన చంద్ర.

# పమ్మి భారతీ శర్మ



## సంరక్షణ-పోషణతో..ఒత్తిడికి దూరం

చైతన్యం పాఠకులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు.

ఈరోజుల్లో పిల్లలు, పెద్దలు ఎక్కువగా వాడే పదం 'స్ట్రెస్' (ఒత్తిడి). పిల్లలైతే పరీక్షలు, ర్యాంకులు, ఎంట్రన్స్ లో, ఇంటా, అటు బయటా ఒత్తిడికి లోనవుతూ, అలసటకు లోనవుతుంటారు. పెద్దలు ఆఫీసు, ఉద్యోగంలో ఒత్తిళ్లు, నడి వయస్సులో కుటుంబ బాధ్యతలు, ఆరోగ్యం ఇల్లా వారికి అన్ని కోణాల్లో... జీవితం ఒత్తిడిమయంగానే అనిపిస్తుంది. అయితే చిన్న చిన్న చిట్కాలతో శారీరక సంరక్షణ, పోషణలతో ఆ ఒత్తిడిని జయించి తిరిగి ఉత్సాహంగా మన పనుల్లో మరింత శక్తివంతంగా మానసిక ఉల్లాసంతో పాల్గొనవచ్చు.

ప్రస్తుతం అంతా ఆర్గానిక్ పదార్థాలు, తైలాలు ఇతర నాచురల్ ఉత్పత్తులపై మొగ్గు చూపుతున్నారు. సహజసిద్ధ పదార్థాల వినియోగం శారీరకంగా, మానసికంగా కూడా ఎంతో మంచిది. ఏ పదార్ధము వాడినా సైడ్ ఎఫెక్ట్ ల భయం ఉండదు. ఇది మనకి పడుతుందా, పడకపోతే వచ్చే పరిణామాల గురించి పెద్దగా ఆలోచించవలసిన పనే ఉండదు. కొద్ది సమయాన్ని మనకోసం కేటాయించుకుంటే ఆనందంగా, ఒత్తిడికి దూరంగా, ప్రశాంతంగా గడపవచ్చు.

ఉదాహరణకు: ఇది శీతాకాలం. చలికాలంలో శరీరం బిగపట్టి, చర్మం పొడిబారినట్లు అవుతుంది. ముఖ్యంగా పాదాలు పొడిబారి, మడమలు పగులుతుంటాయి. సాయంత్రం ఇంటికి చేరగానే కాళ్ళు కడుక్కుని, ఒక వెడల్పు టబ్ లో అయిదారు మగ్గుల వేణ్ణీళ్ళు పోసి అందులో ఉప్పు, గ్లిసరిన్ లేక ఆలివ్ ఆయిల్, కాసిని నిమ్మరసం చుక్కలు వేసి, కాళ్ళు అందులో ఆ నీరు వేడి చల్లారేవరకు ఉంచుకుని, తరువాత బయటకు తీసి సున్నిపిండి, పెరుగుతో బాగా రుద్దాలి. వేళ్ళతో మడమల మధ్యలో మసాజ్ లాగా చేస్తూ, పైకీ క్రిందకి చేతుల్ని పాదాలపై నొక్కుతూ, రుద్ది కడిగి వెయ్యాలి. మెత్తని బట్టతో పాదాలు తుడుచుకుని, గోళ్లు కత్తిరించుకుని, చక్కగా గోళ్ళ చుట్టూ ఉండే మృతకణాలను తీసివేసి, శుభ్రపరచుకోవాలి. ఇప్పుడు మనకు నచ్చిన క్రీము, లేక మాయిశ్చరైజర్ రాసుకోవాలి. ఈ కొద్దిపాటి సంరక్షణ మనకి ఎంతో మానసిక ఉల్లాసాన్ని ఇస్తుంది. ఇక కాళ్లకు చలికాలం కాటన్ సాక్సులు వేసుకోవడం ఎంతో మంచిది. అలాగే ఎత్తు మడమల చెప్పులు ఎప్పుడూ వాడడం మంచిది కాదు. అలాగే టి వి చూస్తూ, కంప్యూటర్ పై పని చేస్తూ కూడా పాదాలను ముందుకు వెనుకకు కదపడం, గుండ్రంగా తిప్పడం, లేచి నిలబడి మునివేళ్లపై పూర్తి బరువు ఆన్చడం, అదే విధంగా మడమలపై వెనక్కి అన్ని బరువు ఆన్చడం చెయ్యడంవల్ల రక్తప్రసరణ బాగా అవుతుంది. మన బరువు మొత్తం మన పాదాలపై ఆధారపడుతుంది కాబట్టి పాదాలకు తరచూ ఇలా పోషణ, సంరక్షణ ఇవ్వడం ద్వారా ఒత్తిడి నుండి రిలీఫ్ అయినట్లు అని-



పిస్తుంది. అలాగే చేతులు: అబ్బా ఇంకో రెండు చేతులు ఉంటే బావుండును అనిపిస్తూ ఉంటుంది ఒక్కోసారి. మన చేతులు చేసే పనులు అన్నీ ఇన్నీ కావు. చపాతీ పిండి పిసకడం, పిల్లలకు జడలు అల్లడం, కీబోర్డ్ మీద నాట్యమే చెయ్యాలి. ఆ చేతులకూ గారాబం అవసరమే. ఒక్క పది నిముషాలు వాటికోసం కేటాయిస్తే మరింత ఉత్సాహంగా మీకోసం చేతులు చాపుతాయి.

గోరువెచ్చని నీటిలో చేతులను ఉంచుకోవడం, వేళ్ళ మధ్యలోంచి కడుక్కోవడం, గోళ్ళ రంగు తీసేసి గోళ్లను కత్తిరించుకోవడం, సున్నిపిండితో చేతిలోకి చేతిని తీసుకుని, మర్దన చేస్తూ అరచేతి భాగం వెనుక, వేళ్ళ సందుల్లో మణికట్టు భాగం క్రిందకు పైకి కదుపుతూ వేళ్ళు మడచి, తెరుస్తూ మర్దన చేసి కడుక్కోవాలి. అటు తరవాత చక్కని క్రీము రాసుకోవాలి.

ఆరోగ్యంగా, మెరుస్తూ కనబడే మీ చేతులు మీలో కొత్త ఉత్సాహాన్ని నింపుతాయి. ముఖానికి, మెడకి ఆవిరిపట్టడం, గంధం పొడి పాలలో కలిపి ముఖానికి, మెడకి రాసుకోవడం, ఆరాక కడిగివేయడం; తలకు గోరు వెచ్చని నూనె మర్దన చేసుకోవడం, తలకి మెంతిపిండి, పెరుగు పెట్టుకుని ఆరాక కడుక్కుని తలంటుకోవడం, మీద నలుపుకి నిమ్మరసం సెనగపిండి మర్దన చేసుకోవడం, చక్కని ఫలరసాలు, కొబ్బరినీళ్లు, మజ్జిగ ఎక్కువగా త్రాగడం, స్నానానికి వాడే నీటిలో గులాబ్ జల్ వేసుకోవడం, ఉడుకులోన్ వేసుకుని స్నానం చేయడం, వీలున్నప్పుడు చెవుల దుద్దులు మార్చడం, మెడలోని నగలను రుద్ది కడుక్కోవడం, చిన్నగా హెయిర్ స్టయిల్ మార్చడం, బొట్టు సైజు మార్చడం; అలాగే మగవారు వారి హెయిర్ కటింగ్ లో మార్పులు చేయడం, సన్నని మీసకట్టు, చిరుగడ్డం ; ఇలా చిన్న చిన్న మార్పులు, స్టైల్ గా అప్ డేట్ గా ఉండడం కూడా మనలో కొత్త ఉత్సాహాన్ని నింపుతుంది. దీనికి తోడు తరగని ఆత్మవిశ్వాసం, మన చిరునవ్వు మనల్ని ఒత్తిడికి దూరంగా ఉంచుతుంది. కొద్ది సమయంలో అతి తక్కువ ఖర్చుతో కొండంత ఆనందాన్ని, ఆహ్లాదాన్ని పొందవచ్చు. మరి వత్తిడికి దూరంగా పోషణకి, సంరక్షణకి దగ్గరగా అడుగులు వేద్దాం పదండి.

చక్కని వ్యాయామం, ఉల్లాసాన్నిచ్చే సంగీతం, ఆత్మీయులతో కాసేపు కబుర్లు, ఇంట్లోని సామాన్లను, ఫర్నిచర్ ను కొద్దిగా అటు ఇటు మార్చి వేరే తీరుగా సర్దుకోవడం ఇలా ఆనందాన్ని మనం వెదికితే ఆనందం మనతోనే ఉంటూ ఉత్సాహంగా ఉండేలా చేస్తుంది. వచ్చే నెలలో మరిన్ని మంచి సంగతులతో మళ్ళీ కలుద్దాం.

నమస్తే

భారతీశర్మ

# పాలెపు బుచ్చిరాజు



## బొమ్మలు చెప్పిన బాలల కథలు

(గత సంచిక తరువాయి)

అప్పుడు కోశాధికారి ఇలా అన్నాడు." మహారాజా! నువ్వు గొప్ప త్యాగశీలివి అన్నమాట నిజమే! కాని ఎప్పటికప్పుడు ధనాగారంలో ఎంత నిలవ ఉంది? ఎంత ఖర్చు అయింది? అన్నది నీకు తెలియజేయడం నా కర్తవ్యం. పోనీ వివరాలు వినకపోయినా, ఆ పండితుడు తీసుకు వెళ్ళిన ఆస్తుల వెల కట్టించగా అది, ఏభై కోట్ల నలభై లక్షలయింది అన్న విషయం నీ చెవిన వేయడం నా ధర్మం. తమ ఆజ్ఞ ప్రకారమే సంపదలో ఏమీ దాచి పెట్టకుండా భట్టు ముందు ఉంచాను. ఆయన తనకి కావలసినవి తీసుకుని సంతోషంగా వెళ్ళిపోయాడు".

***********

మహారాజు అతని సేవా గుణాన్నీ, నిజాయితీనీ మెచ్చి, అతనికి లక్ష దానం ఇచ్చి సత్కరించాడు", అని పూర్తి చేసింది.

భోజరాజు విక్రమార్కుడి దానగుణ సంపదని నెమరు వేస్తూ నగరం వైపు బయలు దేరాడు.



***********

**ముప్ఫయ్యో బొమ్మ కథ**

ఈ సారి ఎలాగైనా గద్దెనెక్కాలనే ఉద్దేశంతో భోజుడు ప్రత్యేకంగా పూజ చేసి, అక్కడికి వచ్చాడు. ఆ బొమ్మ మాత్రం అతడిని చూసి నవ్వుతూ, "రాజా! వస్తావు. పోతావు. కాని ఈ గద్దె నెక్కగల సామర్థ్యాన్ని ఎలా సాధిస్తావో నాకు అర్థం కావడంలేదు. మా రాజుకు ఉన్న సద్గుణాల్లో నూరో వంతు కూడా నీకు లేవు. నిరంతరం దానం చేస్తూ కాలం గడిపే ఆ రాజుకి ఒకసారి ఒక ఆలోచన వచ్చింది. ప్రజల కోసం నేనింత చేస్తున్నాను. కాని, ముక్తిని కోరి దైవకార్యాలేమీ చేయడంలేదు నేను. అయ్యో! అనుకుని మంత్రిని పిలిచి, "ఏం చేద్దాం?" అని అడిగాడు. మంత్రి, రాజు మనసు తెలుసుకుని, "రాజా! నువ్వు అన్నీ మంచిపనులే చేస్తున్నావు. అతిథుల్ని సత్కరిస్తున్నావు. ఆర్తుల్ని రక్షిస్తున్నావు. దానము, సత్యము నీ యందు ఉన్నాయి. ఇక నీకు చింత ఎందుకు? ఇవేమీ చేయని వారు కదా తమ పుట్టగతుల గురించి బాధపడాలి?", అన్నాడు.

ఆ మాటలు విన్నాక రాజు మనసు కుదుట పడింది. పుణ్యం సంపాదించాలని బీదలకి ఇళ్ళు కట్టించాడు. గుళ్ళు, గోపురాలు నిర్మించాడు. తీర్థయాత్రలు చేయాలని,

నర్మదా తీరంలో మాంధాతృపురం వెళ్ళాడు. అక్కడ ఓంకారేశ్వరుడి దర్శనం చేసుకుని తరించాడు. అక్కడ ఉండగానే, రాజ దర్శనం కోరి ఒక వైతాళికుడు వచ్చాడు. అతను మహారాజు దాన గుణాన్ని పొగిడి, 'తాను ప్రదర్శించే విద్యలు చూసి ఆనందించి, తనను సత్కరించ'మని కోరాడు. అందుకు విక్రమార్కుడు వెంటనే ఒప్పుకున్నాడు. "ఇప్పుడే నా తోటివారిని తీసుకు వస్తా"నని చెప్పి అతను బైటికి వెళ్ళాడు.

ఇంతలో అక్కడికి ఒక మహా వీరుడు దుప్పటి ముసుగులో ఉన్న ఒక స్త్రీని వెంటబెట్టుకుని వచ్చాడు. అక్కడున్నవాళ్ళంతా ఆశ్చర్యంలో మునిగి ఉండగా, మంత్రి అతన్ని "నువ్వెవరవు? ఎందుకు వచ్చావు?" అని అడిగాడు. అప్పుడా ఆగంతుకుడు ఇలా చెప్పాడు. " అయ్యా! నేను స్వర్గంలో ఇంద్రుడి సేవకుడిని. నేను చేసిన ఒక తప్పువల్ల ఇంద్రుడు నన్ను సతీ సమేతంగా భూలోకానికి తరిమేశాడు. కాని ఇప్పుడు యుద్ధంలో నా అవసరం వచ్చి, వెంటనే రమ్మని కబురు వచ్చింది. ఉన్నట్టుండి నా భార్యను తీసుకుపోలేను. మీరు నా మీద దయతో, నేను యుద్ధం నుంచి వచ్చేవరకు ఈమెను కన్నవారిలా కాపాడితే మీమేలు మరిచిపోలేను", అని చెప్పి ఆ ముసుగు మనిషిని అక్కడ వదిలి పెట్టి, తాను ఆకాశమార్గాన ఎగిరి పోయాడు.

ఈ వింత నుంచి, కొలువులోని వారు కోలుకోకముందే ఆకాశంలో యుద్ధభేరీలు వినిపించసాగాయి. పెడబొబ్బలు, 'నరకండి, చంపండి' అని అరుపులు వినవచ్చాయి. అందరూ ఆకాశం వైపు చూడసాగారు. కొంతసేపటికి పైకి వెళ్ళిన వీరుడి చేయి ఒకటి నేలమీద పడింది. మరికొంత సేపటికి కత్తితో ఉన్న రెండో చేయి కూడా టపుక్కున కొలువులో పడింది. తరవాత వరసగా కాళ్ళు మొండెము, తలా విడి విడిగా పడ్డాయి. అది చూసిన వారంతా ఆ వీరుడు యుద్ధంలో చచ్చిపోయాడని అనుకున్నారు. ముసుగులో ఉన్న యువతి, ముసుగు తీసేసి, మొగుడి శరీరం మీద పడి ఏడవసాగింది.

రాజు, మంత్రులూ ఎంత చెప్పినా వినకుండా భర్తతో సహగమనం చేస్తానని భీష్మించుకుని కూర్చుంది. తప్పనిసరి పరిస్థితుల్లో అందరి సమక్షంలో ఆమె భర్తతోబాటు చితిలో అగ్నికి ఆహుతి అయింది. ఈ విచారం నుంచి ఇంకా తేరుకోకుండానే మరొక ఆపద వచ్చిపడింది మహారాజుకి.


అదేమిటంటే, యుద్ధానికి వెళ్ళిన వీరుడు, నిండు శరీరంతో తిరిగి వచ్చి, రాజుకి నమస్కరించి, తన భార్యని ఇస్తే తనదారిన పోతానన్నాడు. దేవలోకానికి వెళ్ళినందుకు సాక్ష్యంగా ఒక దివ్యమైన పూలమాలని తెచ్చి రాజుగారికి బహూకరించాడు. ఈ పరిణామానికి విక్రమార్కుడు చాలా భయ పడ్డాడు. ఆయన నోటిలోంచి ఒక్క మాటకూడా రావటంలేదు. కొలువులో అందరూ నిశ్చేష్టులై చూస్తున్నారు. ఆఖరికి మంత్రులలో ఒకరు ,"అదేమిటి? నువ్వు యుద్ధంలో చచ్చిపోయావు. నీతో నీ భార్య కూడా సహగమనం చేసింది కదా!" అన్నారు.

దానికా వీరుడు, "మీరు చెప్పేది చాలా విడ్డూరంగా ఉంది. నిండు ప్రాణాలతో నేను మీ ఎదుట నిలబడి ఉన్నాను. నేను చచ్చిపోయాననడం ధర్మం కాదు. దయచేసి నా భార్యను నాకు తిరిగి ఇవ్వండి. నేను ఇంద్రపురికి వెంటనే వెళ్ళాలి. అయ్యో! ఇంతమంది విజ్ఞులున్న ఈ సభలో నాకు న్యాయం జరగదా!' అని వాపోయాడు.

ఆడినమాట తప్పని మహారాజుకి ఇదంతా అగమ్యగోచరంగా ఉంది. చచ్చిపోయినవాడు తిరిగి వచ్చేడన్న విషయం ఎంతకీ మింగుడు పడడం లేదు. ఏమైతేనేం? ఆ వచ్చిన వాడికి భార్యని అప్పగించడం తన విధి. అని నిశ్చయించుకుని, మార్గాంతరం ఆలోచించసాగాడు. ఆఖరికి ఆమె భర్తతో సహగమనంచేసి స్వర్గానికి కదా!

( ఇంకా వుంది )

# వల్లూరి విశ్వేశ్వర సుబ్రహ్మణ్య శర్మ



## మోచేతి పొడుపు (భాగం – 2)

## (Nudge = a small push, probably

(గత సంచిక తరువాయి)

### బుద్ధి, వివేకం, విచక్షణ

**Are humans rational?** ఈ వాక్యాన్ని తెలుగులో అనువాదం చేయాలని ప్రయత్నిస్తే అసలు సమస్య అర్థమౌతుంది. రేషనల్ అనే ఆంగ్ల పదానికి ఆంధ్రభారతి నిఘంటువు చూదాం. Rational = endowed with reason, జ్ఞానము గల, వివేకము గల, వివేకవిశిష్టమైన, పశుప్రాయము కాని, విచక్షణ గల, బుద్ధిశాలి, యుక్తియుక్త, హేతుబద్ధ...

ఈ వాక్యాన్ని తెలుగులో ఎలా చెప్పాలి? మనుష్యులు బుద్ధిశాలురా? వారికి వివేకము, విచక్షణా జ్ఞానము ఉన్నాయా? హేతుబద్ధమైన ఆలోచనలు వారు చేయగలరా? యుక్తి యుక్తంగా వారు మాటలాడగలరా? ఇదే ప్రశ్న ఎవరికి వారు వేసుకున్నా సమాధానం చెప్పడం కష్టమే? ఎవరికి వారికి "నేను బుద్ధిహీనుడను" అని ఒప్పుకోవడం కష్టమే. అలా అని "నేను మహా మేధావిని" అని చెప్పుకోడం, దానిని నిరూపించుకోవడము ఇంకా కష్టము. 'సగటుమనిషి' కంటే కొంచెం ఎక్కువ అని చెప్పడానికి ప్రయత్నిస్తాము. నిజానికి చాలా మంది ఇలానే ఆలోచిస్తారు, సమాధానం చెబుతారు. ఈ మనస్తత్వ శాస్త్ర ప్రయోగం వలన తెలియవచ్చేదేమంటే మనం మన శక్తియుక్తులను కారణం లేకుండా కొంచెం అధికంగానే అంచనావేసుకుంటాం. సగటు మనిషి కన్న నీ విచక్షణా జ్ఞానం ఎక్కువ అన్న నీ అభిప్రాయం గురించిన నీ నిర్ణయం నీ ఆలోచనా విధానం పై ఆధారపడి ఉంది. ఆ విధానంలో నీ లోపాల గురించిన అంచనా నీకు ఉండదు. నీకు కనిపించిన నీ లోపాలు నీవు దిద్దుకోగలవు. కనిపించనివి మిగిలిపోతాయి. అవి నీ నిర్ణయంపై ప్రభావం చూపుతాయి. ఇదే వాదనతో నీవు ఇతరుల విచక్షణా జ్ఞానాన్ని కూడా సరిగా అంచనా వేయలేవని చెప్పవచ్చును. నిన్ను గురించిన నీ అంచనా నీ నమూనా లోని నీవు గుర్తించని దోషముల వలన సరిగా ఉండదు. ఇతరుల శక్తియుక్తుల అంచనా నీ నమూనాతోనే నీవు చేయగలవు. అందుచేత దానిలోనూ అవే లోపాలు ఉంటాయి .

ఇంతకీ చెప్పవచ్చే దేమంటే Are humans rational ? అనే ప్రశ్నకు హేతుబద్ధమైన సమాధానము లేదు. మరి మనుష్యుడు తన పరిస్థితిలో 'సరియైన' నిర్ణయాలు ఎలా తీసుకోవాలి? కొన్ని శాస్త్రాలలో ఈ ప్రశ్నకు సమాధానం ఉందా? ఈ ప్రశ్ననే అర్థ శాస్త్రవేత్తలు మరో విధంగా ఆలోచిస్తారు. (Limited rationality, bounded rationality) పరిమిత హేతుబద్ధత తో మనిషి తన సమస్యలకు పరిష్కారాలు కనుగొనగలడు. వాటిని యుక్తియుక్తంగా సమర్థించుకోగలడు. ఇది వారి అభిప్రాయం. మనిషికి తన నిర్ణయం సరియైనదా? కాదా? అనే ప్రశ్న అనవసరం..

(ఇంకా వుంది)

# డా.కవన శర్మ



## రసాయన శాస్త్రం

(గత సంచిక తరువాయి)

భూమి వ్యాసార్ధం 6371 కి.మీ. దాని లోపల కేంద్రం నుంచి కొంత వ్యాసార్ధం వరకు 6000 డిగ్రీల C ల ఉష్ణోగ్రత, అధిక ప్రేషణంల వద్ద ఇనుము నికెల్ మదలైన వాటితో ఏర్పడిన గట్టి శిలాపదార్ధం ఉంటుంది. దాని పైన ద్రవరూపం లో 4000 డిగ్రీల C వద్ద ఇదే పదార్ధం ఉంటుంది. ఈ రెండు కలిసి ఒక 700 కి. మీ వ్యాసార్ధం వరకు ఉంటాయ్. భూమి కి అయస్కాంత లక్షణాలని కలిగించే పదార్ధం ఇదే . దీని ద్రవ్య సాంద్రత 12.3 గ్రా / ఘన సెం. మీ. దిని చుట్టూ దీని కంటే తేలికైన, చల్లబడిన రాతి పొర మందంగా తెట్టుకట్టి ఉంటుంది. ఈ పొర ఘనపరిమాణం భూమి ఘనపరిమాణంలో 85 % ఉంటుంది. దీని సాంద్రత అడుగు భాగం లో 12.3 గ్రా /ఘ.సెం మీ. ఉంది పైభాగంలో 3 గ్రా / ఘ.సెం.మీ. ఉంటుంది. ఈ పొరలో సంవహన ( వేడి వలన తిరుగాడే) ప్రవాహాలుంటాయి. ఇవి కింద వేడెక్కి పైకి వచ్చి చల్లబడి కిందకు పోతూ ఉంటాయి. ఇటువంటి రెండు, పక్క పక్క ప్రవాహాలు, ఒక చోట కలిసి కిందకి కలిసి పైకి వెళ్తూ ఉంటాయి. వీటి వలెనే భూకంపాలు, అగ్ని గోపురా (పర్వతా)ల పేలుళ్లు జరుగుతాయి. ఈ పొర ముఖ్యంగా సిలికేట్ రాళ్ళతో ఏర్పడి ఉంటుంది. ఈ పెచ్చు మొదట్లో అంతా కలిసి పాంజియా ( జంబు ద్వీపం?) అనే ద్వీపంగా ఉండి, ఖండాలుగా విడిపోయి కదులుతూ పోతోంది. అటువంటి కదలికలో ఒక సముద్రం నీరు ఒడ్డుబడి హిమాలయాలు ఏర్పడ్డాయి. ఈ తెట్టు పొర పైన గట్టి తేలికైన, 2.7 గ్రా/ఘ. సెం. మీ. సాంద్రత కల పెచ్చుపొర ఉంటుంది ఇది కొన్ని చోట్ల 5 -10 కి.మీ. మందాన ఉంటే కొన్ని చోట్ల 25- 50 కి.మీ. మందాన ఉంటుంది. తక్కు మందాన ఉన్న చోట సముద్రాలు ఏర్పడ్డాయి. ఈ పెచ్చు మీద గాలితో కూడిన వాతావరణం ఉంటుంది. అందులో ముఖ్యంగా నత్రజని, ఆమ్లజని, ఓజోను, కర్బన ద్వి ఆమ్లజని, నీటి ఆవిరి, ఇతర వాయువులు ఉంటాయి. ద్రవరుపంలో ఉన్న రాళ్ళు ఘనీభవించి నిప్పు రాళ్ళు (అగ్నిశిలలు), మడ్డి రాళ్ళు, వేడి, ఒత్తిడుల వలన ఏర్పడే రాళ్ళు భూమి మీద ఏర్పడ్డాయి ఈ ఘనీభవించిన రాళ్ళు, ద్రవ రూపంలో ఉన్న రాళ్ళు, నీరు, గాలి, 109 మూలకాలని కలిగి ఉన్నాయి. వాటి గురించి తెలుసుకుందాము,పై అధ్యాయం లో.

**మూలకాలు**

మన చుట్టూ ఉన్నవన్నీ రమారమి 109 మూలకాలతో నిర్మింపబడి ఉన్నాయి. అందులో సహజంగా సంభవించేవి 90. అయితే మనం మూలకాన్ని ముందు నిర్వచించాలి. మూలకం ఒక ప్రాధమిక పదార్ధం. ఒక పదార్ధాన్ని అంతకంటే సూక్ష్మంగా రసాయనికంగా మార్చటానికి కాని, ముక్కలు చేయటానికి గాని వీలు పడక పోతే దాన్ని మూలకం అంటాం. మూలకాలని ఇంగ్లీష్ అక్షరాలతో సంకేతిస్తారు. అల్లా సంకేతించటం ఒక ఆనాదిగా వస్తున్న ఆచారం. ఆ మూలకానికి మొదట ఏ భాషలో నామకరణం జరిగిందో ఆ అక్షర

క్రమంను బట్టి ఈ సంకేతాలు ఏర్పడ్డాయి. ఇప్పుడు అందరం వాటికి అలవాటు పడిపోయాం మూలకానికి ఒక పరమాణు సంఖ్య, ఒక ద్రవ్యరాశి సంఖ్య ఉంటాయి. ఎలెక్ట్రాన్ ద్రవ్యరాశి, ప్రోటాన్ ద్రవ్యరాశితో పోల్చినప్పుడు ఉపేక్షించ దగినంత అల్పం. అందుకని ఈ సంఖ్యలని నిర్ణయించటానికి ప్రోటాన్ ల సంఖ్యనే లెక్కలోకి తీసుకుంటారు. పరమాణు సంఖ్యకి కేవలం, కేంద్రంలో ఉన్న ప్రోటాన్ లనే లెక్కిస్తారు. ద్రవ్యరాశి సంఖ్యకి కేంద్రంలో ఉన్న న్యూట్రాన్ లలో ఎలెక్ట్రాన్ లతో కలిసి విద్యుదావేశం విషయంలో తటస్థంగా ఉన్న ప్రోటాన్ లను కుడా లెక్కించాలి, ఉదాహరణకి ఉదజనిని తీసుకుంటే దాని పరమాణు సంఖ్య 1, ద్రవ్యరాశి సంఖ్య 1. అదే హీలియం విషయం లో పరమాణు సంఖ్య 2, ద్రవ్యరాశి సంఖ్య 4. ఎందుకంటే దాని కేంద్రం లో 2 ప్రోటాన్ లతో పాటు 2 న్యూట్రాన్ లు ఉన్నాయి కదా. కేంద్రం లో ఉన్న ప్రోటాన్ లు ఎన్ని ఉన్నాయో అన్ని ఎలెక్ట్రాన్ లు వాటి చుట్టూ కేంద్రానికి కొంచెం దూరం లో తిరుగుతూ ఉంటాయి

| మూలకం | సంకేతం | ప్రోటాన్ లు | న్యూట్రాన్ లు | పరమాణు సంఖ్య | ద్రవ్యరాశి సంఖ్య |
|---|---|---|---|---|---|
| ఉదజని | H | 1 | 0 | 1 | 1 |
| హీలియం | He | 2 | 2 | 2 | 4 |
| ఆమ్లజని | O | 8 | 8 | 8 | 16 |
| కార్బన్ ( బొగ్గు) | C | 6 | 6 | 6 | 12 |
| సోడియం | Na | 11 | 12 | 11 | 23 |
| కాల్షియమ్ | Ca | 20 | 20 | 20 | 40 |
| బంగారం | Au | 79 | 118 | 79 | 197 |
| పాదరసం | Hg | 80 | 120 | 80 | 200 |
| యురేనియం | U | 92 | 146 | 92 | 238 |

పాదరసం బంగారానికి ఎంత దగ్గరగా ఉందో గమనించారా? ఒక ప్రోటాన్ దానితో పాటు ఒక ఎలెక్ట్రాన్. అదే చేత్తో రెండు న్యూట్రాన్ లు తీసేస్తే పాదరసం బంగారం అయి పోతుంది. యోగి వేమన కథ, వెనకాతలి కథ ఇది. రస విద్య సిద్ధిస్తుంది. కాని అది అంత సులభం కాదు. బంగారం కొనుక్కోవటమే చవక. ఇంతకు ముందు మనం 90 మూలకాలు సహజంగా సంభవిస్తాయని చెప్పుకున్నాము కదా . మిగతావి అణు రసాయనిక శాస్త్రజ్ఞులు పరిశోధనాలయం లో అధిక శక్తి త్వరనాలతో పుట్టించారు. వీటి సంఖ్య పెరుగుతోంది.

(ఇంకా వుంది)

# నండూరి సరోజాదేవి




శీర్షిక

## మిస్ మేఘమాల IAS

(గత సంచిక తరువాయి)




“ఎంతో పెద్ద కలెక్టర్ హోదాలో వుండి కూడా.. నీలో ఉన్న ఇంతటి మర్యాద, ప్రేమాభిమానాలు, ఒద్దికతనం చూస్తుంటే నాకు చాలా సంతోషంగా అనిపిస్తోందమ్మా? అసలు ఇవన్నీ ఇంతలా నేర్పిన శ్రీనివాసరావు గారిని ముందు మెచ్చుకు తీరాల్సిందే!” కృష్ణమూర్తిగారు, ఆయన్ని చూస్తూ మనఃస్ఫూర్తిగా చెప్పారు.

ఆయన అలా అంటుంటే.. శ్రీనివాసరావు గారికి తండ్రి ప్రేమ మరింత ఉప్పొంగి, కూతురి వైపు గర్వంగా చూసుకున్నారు!

లక్ష్మి అందరితో పాటు శ్రీనివాస రావు గారికి కూడా మరొకసారి చెప్పేసి,తండ్రి వెనుక బయటకి నడిచింది!

ఇంటిల్లిపాదీ వాళ్ళని సాగనంపడానికి, బంగ్లా మెట్ల వరకు వచ్చేశారు!

"శాస్త్రీ!కాస్త మీరు కూడా వెళ్ళి, కార్లో మావయ్యగారు వాళ్ళని దింపేసి రండి” అని అతనికి పురమాయించింది మేఘమాల.

“తప్పకుండా వెడతాను!” అంటూ శాస్త్రి తనూ, వాళ్ళతో కారు ఎక్కేశాడు.

"ఏమ్మా, మేఘా! ఈ రోజు ఆఫీస్ కి వెళ్ళాలన్నావు కదా?”,శ్రీనివాసరావు గారు కూతుర్ని అడిగారు.

“మనందరం కొన్ని విషయాలపై డిస్కస్ చేసుకున్నాక, వెడతాను డాడీ!” చెప్పింది మేఘమాల.

“సరే, మీరు మాట్లాడుతూ ఉండండీ. నేను కాసేపు నడుం వాల్చుకుని మళ్ళీ వస్తాను” అంటూ శ్రీనివాసరావు గారు తన గదిలోకి వెళ్ళిపోయేరు.

“అవేంటో నువ్వు చెప్పు మేఘమాలా?”అని వినోద్ అడుగుతూ సోఫాలో కూర్చున్నాడు.

మేఘమాల కూడా తల్లితో పాటు కూర్చుంటూ..

"వినోద్! మనం ఇంక ఒక త్రీ డేస్ లో అయితే బయలుదేరి ఊరికి వెళ్లొచ్చు, శ్రీధర్ గారితో అన్నీ మాట్లాడేను. వెళ్ళేలోపు నేను కొన్ని ప్రోగ్రామ్స్ కి ఎలాగూ అటెండ్ అవుతాను. మిగిలిన వాటిని వేరే వాళ్ళు చూసుకునేలా శ్రీధర్ ఆరెంజ్ చేసేస్తానన్నారు”, మేఘమాల చెప్పింది.

“ఇంకేం,నువ్వెలా చెప్తే అలాగే జరుగుతుంది. ఈ రోజే మనం వస్తున్న విషయం, మావయ్యకి తెలిసే ఏర్పాటు చేస్తాను” సంతోషంగా అన్నాడతను.

“ఏర్పాటు చేయడం ఏమిటీ? నాన్నగారికి డైరెక్టుగా చెప్పవా?”

దానికి వినోద్ నవ్వేస్తూ "అది గ్రామమే అయినా, కాలానుగుణంగా వచ్చిన మార్పుల వల్ల చాలా మంది ఇళ్లల్లో ఫోనులు వాడుతున్నా.. ఈ ఫోన్ సిస్టం అంటే మావయ్య ఇష్టపడని కారణంగా, ఇప్పటివరకూ ఇంట్లో ఫోన్ అన్నదే లేకుండా గడిచిపోయింది.

ఎక్కడికైనా ఇంకా ఉత్తరాల ద్వారానే, క్షేమ సమాచారాలు తెలుపుకోవడం అవుతోందీ... ఏదైనా అత్యవసరమైతే, ఇంటి పక్కవాళ్ళ ఫోన్ వాడుకోవడం జరుగుతోంది!" అంటూ చెప్పడం ఆపేడు.

"బాగుంది వినోద్, నువ్వు చెప్పేది వింటూంటే నాకు చాలా ఆశ్చర్యంగా కూడా వుంది కానీ.. పోనీలే పాపం, ఈ ఫోన్ల పద్ధతికి నాన్నగారిని లాగొద్దూ. మీరే సెల్ ఫోన్ కొనుక్కుంటే, అవసరానికి కొంతైనా ఇబ్బంది లేకుండా ఉపయోగపడుతుంది కదా?" అని సలహా కూడా ఇచ్చింది.

"తప్పకుండా ఇక కొని తీరతాను.. అయినా,ఈ కలెక్టర్ కూతుర్ని చూసుకునైనా మావయ్య మోడ్రన్ గా మారిపోవచ్చునేమో కూడా!" అని వినోద్ వేళాకోళ మాడుతోంటే..

అన్నపూర్ణమ్మగారు,మాలతిచిన్నగా నవ్వేశారు!

"ఇంతకీ, మనం 'రాజావోలు' ఊరికి ఎలా వెడదాం వినోద్? రెండు కార్లలో బయలుదేరి వెళ్లిపోదామా? అమ్మ అసలు అంతసేపు కూర్చుని జర్నీ చేయకలుగుతుందంటావా? లేక ట్రైన్ టిక్కెట్స్ బుక్ చేయించేసుకుందామంటావా?" మేఘమాల తనకున్న సంశయాలను, సలహాలను కూడా అతని ముందుంచింది.

"నాకు,మాలతికీ ఎలా అయినా పరవాలేదు.. ఇక అత్తయ్య గురించీ, అంకుల్ గురించీ అయితే కాస్త ఆలోచిస్తేనే మంచిది!" అన్నాడు వినోదు.

"ఏమ్మా! మన ప్రయాణం 8 గంటల పైనే ఉంటుందీ, మరి నువ్వు కార్లో రాగలుగుతావా?" తల్లిని కూడా అడిగింది మేఘమాల.

"తల్లీ! నీకు ఎలా వీలో అది ఆలోచించుకో ముందూ?" అన్నపూర్ణమ్మగారు వెంటనే చెప్పిందీ.

"మేఘా! అలా కార్ల ప్రయాణంతో, ఆవిడని అసలు ఇబ్బంది పెట్టద్దు. ట్రైన్ కే టిక్కట్లు తీయించేయి అమ్మా" అక్కడికి వచ్చిన శ్రీనివాసరావు గారు ఖచ్చితంగా కూతురికి చెప్పేశారు.

"ఇంక మనకి వేరే ఆలోచన ఎందుకూ? అంకుల్ చెప్పినట్టు రైల్లోనే వెళ్ళిపోదాం మేఘమాలా"వినోద్ కూడా అది క్లియర్ చేసేసాడు.

"సరే అయితే,ఆఫీస్ కి వెళ్ళాక టిక్కట్లు బుక్ చేయించేస్తాను.. డేట్ తో సహా, అన్ని డీటెయిల్స్ని కాస్త నాకు రాసివ్వు వినోద్"అని అతనితో చెప్పేసి..

"అమ్మా! నేను పైకి వెళ్లి, రెడీ అయ్యి వస్తాను..ఇంక ఆఫీస్ కి కూడా వెళ్లిపోవాలి" అంటూ లోపలికి వెళ్ళిపోయింది మేఘమాల.

oooooooooooooo

మేఘమాల కలెక్టర్ ఆఫీసుకి వెళ్ళిపోయాక- వినోద్ భార్యకి చెప్పేసి, వెంటనే బయటికి వెళ్లి.. ఊరిలో తమ ఇంటి పక్కన వుండే రాముకి ఫోన్ చేశాడు!

"రామూ! నేను వినోద్ ని మాట్లాడుతున్నాను"

"వినోద్! నిజంగా నువ్వేనా? ఇంకా ఇక్కడకి రాలేదేంటీ? ఎలా ఉన్నావ్? అత్తయ్య గారు, మాలతీ బాగున్నారా?" రామూ సంతోషంగా ప్రశ్నలు వేసేశాడు.

"అంతా బాగానే ఉన్నాం కానీ.. రామూ! నువ్వు, మా మావయ్య దగ్గరికి వెళ్లి అర్జెంటుగా ఒక విషయం చెప్పాలి?"

"ఏంటది, చెప్పు వినోద్?"

"మేం, ఈ గురువారం బయలుదేరి అక్కడకి వస్తున్నామని.. ముఖ్యంగా మేఘమాలని మా కూడా తీసుకు వస్తున్నామని మర్చిపోకుండా మావయ్యకి చెప్పాలి!"

"మేఘమాల ఎవరు వినోద్?" గొంతులో కుతూహలాన్ని కనబరుస్తూ, రాము అడిగాడు.

"మా మావయ్యకి ఇంకో కూతు-

రుందిలే, ఆమె గురించే!"

"ఇంకో కూతురా? నాకు ఇదివరకెప్పుడూ చెప్పలేదే?" రాము మరింత ఆశ్చర్యంగా అడిగాడు.

"అక్కడికి వచ్చాక, నీకు అన్నీ వివరంగా చెప్తానులే. అప్పటి వరకూ మాత్రం ఆ అమ్మాయి విషయం రహస్యంగా ఉంచాలి, తెలిసిందా?" అంటూ రాముని హెచ్చరించాడు వినోద్.

"ఆ విషయం ఎవ్వరికీ చెప్పనూ.. మావయ్యగారికి మాత్రం మీరు వస్తున్నారని తెలియచేస్తా, సరేనా?" రాముకి చిన్నప్పటి నుండీ వినోద్ అన్నా... అతని మాటన్నా ఎంతో గురీ, ఇష్టం కూడా.

"గుడ్,నువ్వు చాలా మంచోడివిరా.. మావయ్యకి ఈ రెండు రోజుల్లో, ఏదైనా హెల్ప్ కావాలేమో అడిగి కాస్త చేసిపెట్టు!"

"మేఘమాల కూడా వస్తోందంటే..మావయ్య సంతోషంతో ఎంత హడావిడి చేస్తాడో, వినోద్ ఊహించగలడు. అందుకే రాముకి అలా చెప్పాడు!"

"మావయ్యగారికి ఏ అవసరం కావలసి వచ్చినా, నేను తప్పకుండా చేస్తాను వినోద్. ఈ ఫోన్ పెట్టెయ్యగానే, వెళ్లి అక్కడుంటాను. మాలతి అక్కని అడిగానని చెప్పు!" రాము చాల నమ్మకంగా, వినోద్ కి మాట ఇచ్చాడు.

"థాంక్స్ రా రాము..ఇక గురువారం కలుద్దాం, ఉంటాను మరీ!" అంటూ వినోద్ ఫోన్ పెట్టేశాడు.

oooooooooooooooo

వినోద్ బంగ్లాకి వెళ్ళగానే, తిన్నగా శ్రీనివాసరావుగారి దగ్గరకే వెళ్ళాడు!

"వినోద్! ఎక్కడికి వెళ్ళావ్? మేఘమాల,నీ కోసం ఫోన్ చేసింది."

"మనం వస్తున్నామని మావయ్యకి తెలపడానికి, బయటికి వెళ్లి ఫోన్ చేసి వస్తున్నాను!"

"ఫోన్ చేయడానికి, బయటకి ఎందుకు వెళ్లడం? ఇక్కడే చేయొచ్చు కదా?"

"ఇక్కడ నుండి అయితే, డైరెక్ట్ గా ఉండదేమో అనీ?" నసుగుతూ నెమ్మదిగా చెప్పాడు వినోద్

"భలేవాడివే, నువ్వింకా ఇలా మొహమాటపడితే ఎలాగా? నాకు చెప్పినా, అక్కడికి డైరెక్ట్ STD కనెక్షన్ ఇప్పించే వాడిని కదా? లేకపోతే నా సెల్ ఫోన్ అయినా, నీకు ఇచ్చే వాడినీ!" అంటూ శ్రీనివాసరావుగారు మందలించారు.

"సారీ అంకుల్ !"

"ఊ, సర్లే! నువ్వింక వెళ్లి భోజనం చెయ్యి.... మాలతి నీ కోసం తినకుండా వుండిపోయింది", శ్రీనివాసరావుగారు వినోదుకి చెప్పారు.

"అంకుల్! 'రాజావోలులో' మా పక్కింటివాళ్ళ అబ్బాయికి ఫోన్ చేసి .. మావయ్యకీమన విషయం చెప్పమన్నాను!" ఆయనతో మళ్ళీ అన్నాడు వినోద్.

"ముందుగా తెలియచేసి,చాలా మంచిపని చేసావ్ వినోద్. వాడూ ఆనందపడితే, నాకు అంతే చాలూ!"

"అన్నట్టు,మేఘమాల ఎందుకు ఫోన్ చేసింది అంకుల్?"

"ఓ! అది చెప్పడం మర్చిపోయాను కదూ? ఏంలేదు.. నిన్ను, మాలతినీ కార్లో ఈ చుట్టు పక్కలున్న ఇంపార్టెంట్ ప్లేసెస్ కి వెళ్ళి, చూసి రమ్మంది. ఈ రెండు రోజులూ నీ భార్యని తీసుకుని హాయిగా తిప్పి, అన్నీ చూపించూ!" చెప్పారు శ్రీనివాసరావుగారు.

"దాని కోసం చేసిందా? మేఘమాలకి చాలా పద్ధతి నేర్పారు అంకుల్?"

"అంకుల్! మేం,ఈ ఊరిలో తిరగక్కరలేదు కానీ..ఒక్క కలెక్టర్ ఆఫీసుకి తీసుకెళ్ళి నా భార్యకి చూపించేస్తే, నా జన్మ ధన్యమైపోతుంది" వినోద్ నవ్వుతూ చెప్పేడు.

"అదేంటి,అలా అంటున్నావ్?" శ్రీనివాసరావుగారు అర్ధంకాక అడిగారు.

"ఏం లేదు, అంకుల్! మాలతికి I.A.S చదువంటే చాలా ఇష్టము. అది తల్చుకుంటుంటేనే చాలు, గొప్పగా ఫీల్ అయిపోతూ ఉంటుంది".

"అదా విషయం? అంత ఇంట్రెస్ట్ వుంటే, చక్కగా ఆ చదువు చెప్పించాల్సిందేమోను?"

"అందరికీ,అన్నీ సాధ్యపడవ్ కదండీ..దానికి సాయం,మావయ్య మాకు తొందర గానే పెళ్లి చేసేశారు కూడా!"

"అయినా! అదేం వింతో కానీ,-వీళ్ళిద్దరూ 'కవల పిల్లలు' అయినందుకు..మాలతి కుండే ఆ చదువు కోరిక, మేఘమాల ద్వారా తీరుతోందేమో?అని నాకే చాలా సార్లు అనిపిస్తూ వుంటుందీ." వినోద్ వివరంగా చెప్పాడు.

"నువ్వు చెప్పిందీ కరక్టే అయ్యుంటుంది వినోద్? 'కవల పిల్లలు'అన్నవాళ్ళకి.. ఇంచుమించు స్వభావాలు, నడవడి, పోలికలు ఒకేలాగా వుంటాయి అంటారు కదా? మాలతిని తప్పకుండా మేఘమాల ఆఫీసుకి తీసుకెళ్లి చూపించూ,చాల తృప్తి పడుతుంది." శ్రీనివాసరావుగారు కూడా ఆ మాట చెప్పారు.

అంకుల్!"మేఘమాలకి ఈ రోజు ఆఫీసులోనే ఉండీ,తనకి ఏదైనా-ఖాళీ సమయం వుంటే కనుక.. మాలతిని ఒకసారి తీసికెళ్ళి చూపించేస్తాను.మీరు కాస్త కనుక్కుని, మా విషయం చెప్తారా?"అని శ్రీనివాసరావుగారిని అనడిగాడు వినోద్.

"తప్పకుండా కనుక్కుంటాను,ఈలోగా నువ్వెళ్ళి భోజనం చేసేయ్ అమ్మా!" అంటూ ఆయన,వినోద్ ని లోపలి పంపారు.

కూతురు ఆఫీస్ మీటింగ్ లో ఉందని తెలియడంతో.. శ్రీనివాసరావు గారు,శ్రీధర్ తో మాట్లాడారు!

"వినోద్,మాలతి కలెక్టర్ ఆఫీస్ వచ్చే విషయం కూడా..ఆయన శ్రీధర్ కి తెలియ చెప్పేసి"వెంటనే వినోద్ వాళ్ళ దగ్గరకి వెళ్లారు!

వినోద్!"మేఘమాల ప్రస్తుతం మీటింగ్ లో వుందిట,4గంటలకి కాస్త ఫ్రీ అవుతుం దిటా.ఆ టైం లో మీ ఇద్దరిని రమ్మని శ్రీధర్ గారు చెప్పారు."

"మీరు మూడున్నరకి బయలు దేరి వెళ్లిపోండి..నేను డ్రైవర్ కి కూడా చెప్పమం టాను!"అంటూ శ్రీనివాసరావుగారు సెక్యూరిటీ రూమ్ దగ్గరకి వెళ్లారు.

అనుకున్న సమయానికి మాలతి,వినోద్ రెడీ అయిపోయి..కార్లో మేఘమాల ఆఫీస్ దగ్గరకి వెళ్లిపోయారు!

oooooooooooooooo

'పూర్తిగా కలెక్టర్ అమ్మ పోలికలో ఉండీ..లోపలకి వస్తున్న మాలతిని' అక్కడి ప్రాంగణంలో ఉన్న అందరు ఆశ్చర్యపోతూ-,కళ్లప్పగించి మరీ చూడసాగేరు!

వాళ్ళు రావడం గమనించిన శ్రీధరుగారు మాత్రం,వాళ్లకి ఎదురు వెళ్ళి ..

"రండి వినోద్. రండి మేడం-!"అంటూ వాళ్ళిద్దరినీ,మేఘమాల రూమ్లోకి తీసుకు వెళ్లి కూర్చోపెట్టి ఆయన వెళ్ళిపోయేరు"

సరిగ్గా 4 గంటలు అయ్యేటప్పటికి తన రూమ్ లోకి వచ్చిన మేఘమాల.. మాలతిని, వినోద్ ని అక్కడ చూస్తూనే చాలా ఆశ్చర్యపోవడమే కాకా..వెంటనే మాలతిని ఆనందంగా కౌగాలిచేసుకుంది కూడా!

"ఏంటి,వినోద్! సడెన్ గా ఇలా వచ్చారేంటీ?"అని అడుగుతూనే వెళ్లి తన సీట్లో కూర్చుంది.

"నీకు తెలుసు కదా.మాలతికి 'ఈ కలెక్టర్ చదువు,కలెక్టర్ ఉద్యోగం-,హోదా అంటే ఎంత ఇష్టమో? నువ్వు ఉండగా, మీ ఆఫీస్ కూడా ఒకసారి చూపించేస్తే.. సంతోష పడుతుందని,అంకుల్ తో చెప్పించి ఇలా వచ్చేశాము!"

"వచ్చినప్పటి నుండీ నేను పూర్తి బిజీలో ఉన్నానులే,అందుకే శ్రీధర్ నాకు చెప్పడం అవ్వలేదనుకుంటా?"అంటూ మేఘమాల ఇంకా ఏదో అనబోయింది.

ఈలోగా! శ్రీధర్ తో పాటుగా, ఒక ఇద్దరు ఆ రూమ్ లో కి వచ్చి .."నమస్తే మేడం" అంటు మేఘమాలకి విష్ చేశారు.

వాళ్ళని చూడగానే వినోద్ వాళ్ళు ఒక్కసారిగా లేచారు!

"పర్వాలేదు,మీరు కూర్చోండి వినోద్!" అంటూ శ్రీధర్ వాళ్లకి వారింపుగా తెలియ చెప్పాడు.

మేడం!"ఎక్కువ టైం తీసుకోం,కొద్దిగా మాట్లాడి వెళ్ళిపోతాం అంతే "అన్నారు వాళ్ళు.

"నో ప్రాబ్లమ్,అలా కూర్చోండి-!"అంటూ కుర్చీలు చూపించింది మేఘమాల.

"మేడం! వ్యవసాయ రైతుల వర్క్ షాప్స్ ఏర్పాటుపై... ముందు ఒక సమావేశం మీ ద్వారా జరిపించాలనుకుంటున్నాము. వారం క్రితం శ్రీధర్ గారిని కూడా కలిసి వెళ్ళాం!"

"అది కూడా మీతో డిస్కస్ చేసాను,మేడం!"గుర్తు చేసాడు శ్రీధర్.

"అవును!"అన్నట్టు తల ఊపింది మేఘమాల.

"మేడం! ఆ కాన్ఫరెన్స్ కి ఎల్లుండి డేట్ ఫిక్స్ చేద్దాం అనుకుంటున్నాం.. మీరు అంగీకరిస్తే, మేం M.L.A గారిని కూడా ఆహ్వానించుకుంటాము" చాలా వినమ్రతతో వాళ్ళు, మేఘమాలని అడిగారు.

"శ్రీధర్! ఎల్లుండి మనకి కుదురుతుందా? కాలేజీ యానివర్సరీకి వెళ్లాలేమో కదా? దాని విషయం చూసి.. రేపు వీరికి ప్రాబ్లమ్ లేదంటే, టైం ఫిక్స్ చేసేయండీ" అసిస్టెంట్ కి చెప్పింది మేఘమాల.

"ఓ.కే మేడం!"అంటూ శ్రీధర్ లేచి నిలబడ్డారు.

"థాంక్స్, మేడం!మీరు మాకు అటెండ్ అయితే అంతే చాలు" మిగిలిన ఇద్దరు కూడా కృతజ్ఞత తెలుపుతూ కుర్చీల్లోంచి లేచారు.

"థాంక్స్, మీక్కూడా" వాళ్ళతో అంది మేఘమాల.

మాలతి అయితే.. మొహం ఆనందంగా పెట్టుకుని, ఎంతో ఉత్సాహంగా వాళ్ళ మధ్య మాటలన్నీ వింటూ కూర్చుంది!

ఆ వచ్చిన వాళ్ళు... 'కలెక్టరుగా ఉన్న మేఘమాలని ఎంతో గౌరవిస్తూ మాట్లాడడం, తనని అంతగా ఆహ్వానం పలకడం అన్నవి చూసి' ఆమె మరింత మురిసిపోయింది కూడా!

వచ్చిన ఆ రైతు సంఘాల పెద్దలు వెళ్ళిపోగానే, మేఘమాల ఊపిరి పీల్చుకుంటూ..

"వినోద్! వెరీ సారీ, మిమ్మల్ని చాలాసేపు ఊరికే కూర్చోపెట్టేశాను. మీతో ఈ కాస్సేపైనా ఎంతో హాయిగా, తీరికగా గడుపుదాం అనుకున్నాను. ఈలోగా వీళ్ళు తయారై పోయారు" కొద్దిగా విసుగు ధ్వనించిన గొంతుతో చెప్పింది ఆమె.

ఎంత గొప్ప చదువు చదివినా, ఎంత హోదాలో ఉన్నా, "తన సంబంధీకులు, తన ఇంటివాళ్ల దగ్గర మాత్రం" సాధారణమైన ఆడవాళ్ళల్లాగా, ఏ అరమరికలు లేకుండా ..ఇంత స్వేచ్ఛగా మాట్లాడేస్తారన్నమాటా?" అనుకుంటూ వినోద్, మేఘమాలని చూసి చిన్నగా నవ్వుకున్నాడు.

"ఏంటి, ఆలోచిస్తున్నావు వినోద్? ఇక్కడ ఈ హడావిడికి, మీ ఆవిడ శాటిస్ఫై అవుతోందో? లేదో అనుకుంటున్నావా?" మేఘమాల ఏడిపిస్తున్నట్టు అడిగింది.

"ఏమిటీ! ఆవిడగారు శాటిస్ ఫై కాకపోడమా?అసలు ఇక్కడ నుండి వెనక్కి వస్తుందో, లేదో కూడా అనుమానమే?.. ఇప్పుడు వచ్చిన వాళ్ళు, నువ్వు మాట్లాడుకుంటుంటే ఆ మాటలు ఎంత ఇంట్రెస్టింగా ఆలకించిందో చెప్పలేను" అంటూ మాలతి గురించి, వినోద్ కూడా తమాషాగా చెప్పాడు.

వినోద్!నువ్వు ఎంత వేళాకోళమాడినా, మాలతి ఇలా రావడం నాకు చాలా సంతోషం కలిగిస్తోంది".

"మాలతీ! నన్ను, ఈ ఆఫీసునీ చూడ్డంతో .. నా దగ్గరికి వచ్చే వాళ్ళ డిస్కషన్స్ వినడం వల్ల నీ కోరిక తీరిపోతే ఎలా? .. ఒకసారి ఈ సీట్లో కూడా నిన్ను కూర్చోబెడితేనే, నాక్కూడా ఇంకెంతో సంతృప్తిగా వుంటుందీ!" అంటూ మేఘమాల లేచి, మాలతి చెయ్యి పట్టుకుని మరీ .. తాను ఎప్పుడు కూర్చుండే కుషన్ చైర్ లో కూర్చోపెట్టబోయింది!

దాంతో, మాలతి కంగారు పడిపోతూ.."బాబోయ్! వద్దు, వద్దు" అంటూ, ఆ కలెక్టర్ కుర్చీలో కూర్చోవడానికి నిరాకరించేసింది.

"వద్దులే,మేఘమాలా!ఎవరైనా అలా చూసినా బాగుండదేమోనూ?" వినోద్ కూడా అడ్డు చెప్పాడు.

"ఏం,పర్వాలేదులే! నా సిస్టర్ నే కదా, నేను కూర్చోపెట్టేదీ?.. అయినా, మేము ఇద్దరం ఒక్కలాగే వుంటాం కనుక, ఎవ్వరు తేడా తెలుసుకోలేకపోవచ్చు" అని నవ్వుతూ మేఘమాల బలవంతాన.. మాలతిని, తన కుర్చీలో కూర్చోపెట్టింది.

(ఇంకా వుంది)

# శ్రీనాధుని కాశీ ఖండం

## (వచనానుసరణం)



పోచినపెద్ది మురళీ కృష్ణ

### ముందు మాట

కాశీ క్షేత్రంతో భారతీయులకు ఎంతో విడదీయరాని అనుబంధం ఉంది.. జన్మించినా, మరణించినా కాశీ క్షేత్రంలోనే జరగాలని భారతీయులు భావిస్తారు. అంతటి పవిత్ర క్షేత్ర వైభవాన్ని వర్ణించని భారతీయ సాహిత్యం లేదు. స్కాంద పురాణంలో వ్యాసుడు కాశీ వైభవాన్ని విస్తృతంగా వర్ణించాడు. తెలుగు సాహిత్యంలో శ్రీనాధుడు ప్రప్రధమంగా ప్రబంధ రీతిలో కాశీ క్షేత్రాన్ని వర్ణించాడు. ఈ కాశీ ఖండాన్ని మా పాఠకులకు పరిచయం చేయడానికి డా. పోచినపెద్ది వెంకట మురళీ కృష్ణ గారిచే సరళ వ్యావహారిక భాషలో, యధా మూలానుసారంగా అనుసరించిన కాశీ ఖండాన్ని, నెలనెలా అందిస్తున్నాము.

ఈ వ్యాస పరంపర ఆధ్యాత్మిక వేత్తలకు భక్తీ తత్వాన్ని, విద్యార్థులకు శ్రీనాధుని తత్వాన్ని అందించగలదని భావిస్తున్నాము.

- సంపాదకురాలు.

.

విష్ణు దేవుడు దివోదాసుని అనేక ఉపాయాలతో కాశీ నగరంనుంచి పంపించి వేసి ఆ వార్తను బంగారు లేఖతో మందర పర్వతంపై ఉన్న పరమేశ్వరునికి పంపించాడు. మీ ఆజ్ఞతో నేను, విఘ్నేశ్వరుడు, లక్ష్మీదేవి చేసిన ప్రయత్నంవలన సకల కార్యాలు సిద్ధించాయి." అని వార్తను పంపించాడు. ఆ వార్తను తీసుకొని గరుత్మంతుడు శీఘ్రముగా లవణ, ఇక్షు, రస సముద్రాలు దాటుకొని కుశద్వీపాన్ని చేరుకున్నాడు.

మందర పర్వతాని సమీపించాడు. పరమేశ్వరుడు కాశీ నగరం గూర్చి చింతిస్తూ ఉన్నాడు. గరుత్మంతుడు కిందకి దిగి వస్తున్నప్పుడు రెక్కలు ఆడించే విధానంలోనే విజయాన్ని సూచించాడు. పరమేశ్వరుని సమీపించి సాష్టాంగ నమస్కారం చేసాడు. సందేశ పత్రికను నందీశ్వరునికి ఇచ్చాడు. నమస్కరించి నిలబడి ఉన్నాడు. పరమేశ్వరుడు దివోదాసుని వృత్తాంతాన్ని తెలుసుకొని ఆనందించి కాశీ నగరానికి ప్రయాణమయ్యాడు.

ఆ ప్రయాణం ఒక మహోత్సాహంలాగ ఉంది. ధ్వజాలు, గొడుగులు ఎత్తిపట్టుకున్నారు. శంఖ, కాహళాల ధ్వని ఆకాశవీధి నిండిపోయింది. కొమ్ము బూరాలు, పిల్లంగ్రోవులు ఊదుతున్నారు. దుందుభులు వాయిస్తున్నారు.

ఎనిమిది ఏనుగులు, ఎనిమిది గుఱ్ఱాలు, ఎనిమిది సింహాలు వాహనములుగా, గంగా యమునా నదులు ఏడి కోలలు. ఉదయాస్తమయములు రధచక్రాలు. ఆకాశము గొడుగు. నక్షత్రాలు చీలలు. ఓంకారము చేర్కోల. గాయత్రి పాదపీఠము. వేదములు రక్షణ కవచము. సూర్య చంద్రులు ద్వారపాలకులు. సంప్రదాయము మార్గము. ఈవిధంగా రధాని తయారుచేసి నందీశ్వరుడు పరమేశ్వరుని ఎదుట ఉంచాడు.

విశ్వేశ్వరుడు అలంకరించుకొని భవాని సహితుడై ఆ దివ్య రధాన్ని ఎక్కాడు. ముప్పది మూడు కోట్లమంది దేవతలు, ఇరవైవేల కోట్లమంది ప్రమధ

గణాలు, తొమ్మిది కోట్లమంది దుర్గలు, కోటిమంది భైరవులు, కోటిమంది కుమారస్వాములు, ఏడు కోట్లమంది వినాయకులు, ఎనభైఆరువేలమందిమునులు, ఎనభై ఆరు వేలమంది గృహస్తులు, మూడు కోట్లమంది పాతాళ వాసులు, రెండు కోట్లమంది దైత్య దానవులు, కోటి యాభై లక్షలమంది రాక్షసులు, పదివేలమంది విద్యాధరులు, అరవై వేలమంది అప్సరసలు, ఎనిమిలక్షల గోమాతలు, తొమ్మిది లక్షల ఇరవై వేలమంది దేవతలు, ఏడు సముద్రాలు, ఎనిమిది వేల కొండలు, మూడువందల వనస్పతులు, కొలుస్తూ ఉండగా పరమేశ్వరుడు వాయు వేగంతో పన్నెండు క్షణముల కాలంలో ఆకాశ మార్గంలో కాశీ నగరానికి చేరుకున్నాడు.

ఆ సమయంలో గోమాతలు పాలధారలు వర్షించాయి. జైగీషవ్యుడు పరమేశ్వరుని స్తుతించాడు. పరమేశ్వరుడు జ్యేష్టమాసం, శుక్ల పక్షం, చతుర్దశి నాడు కాశీ నగరంలో తిరిగి ప్రవేశించాడు. ఆ రోజున జ్యేష్టస్థానము అను పేరుగల తీర్థము, జైగీషవ్య తీర్థం ఏర్పడ్డాయి. గోవులు క్షీరధారలు కురియడంవలన క్షీరోద తీర్థం ఏర్పడింది. బ్రహ్మ, విష్ణువు పరమేశ్వరునికి పట్టాభిషేకం చేసారు. పార్వతీ పరమేశ్వరులు కొలువుతీరి ఉన్నారు.

ఆ సమయంలో కొంతమంది



బ్రాహ్మణులు అక్కడకి వచ్చి, నీల కంఠుని `ఋగ్వేద మంత్రాల' తో స్తుతించారు. కొందఱు కృష్ణ యజుర్వేద మంత్రాలతో స్తుతించారు. మరికొంతమంది భక్తి పారవశ్యంతో సప్త సామములతో ప్రస్తుతించారు. కొందఱు అధర్వ వేద మంత్రాలతో స్తుతించారు. కరుణా సముద్రుడైన పరమేశ్వరుడు వారినందరిని కరుణాసమగ్రమైన భావంతో చూసాడు.

"వేద విదులారా! క్షేమంగా ఉన్నారా! ఆరోగ్యంగా ఉన్నారా!, మీకు కుశలమేకదా!" అని పరమేశ్వరుడు వారిని పలుకరించాడు. విశ్వేశ్వరుని కుశల ప్రశ్నలువిని, మందాకిని తీర్థం, హంసతీర్థం, మత్స్యోదరీ తీర్థం, కపాలమోక్ష తీర్థం, మొదలయిన తీర్థాలనుండి వచ్చిన బ్రాహ్మణులు మృత్యుంజయునికి నమస్కరించి ఈ విధంగా విన్నవించారు.

"పరమేశా ! అసి, వరుణ గంగా నది కలసిన సంగమస్థలం నుండి మేమందరము వచ్చాము. మేమందరము తొంభై ఐదువేల ఐదు వందల ఏభై ఐదు మంది కుటుంబాల వారము అక్కడ ఉంటున్నాము. మా పూర్వీకులు అక్కడే ఉండేవారు" అని చెప్పి అక్షింతలు చల్లి, " మహాదేవా! మీ కరుణా కటాక్షం వలన కుశలమేగాని, అనారోగ్యము ఎలా కలుగుతుంది. గంగాజలములు అమృత ప్రవాహము. ఆ జలములు సంసారమనెడి విషజ్వరమువలన కలిగిన సంతాపాన్ని పోగొడతాయి." అని బ్రాహ్మణులు పరమేశ్వరునికి విన్నవించుకున్నారు. వారి మాటలు విని పరమేశ్వరుడు కాశీ వైభవాన్ని ఈ విధంగా వివరించి చెప్పాడు "కాశీ అను పేరులోని రెండక్షరములు కర్ణామృతము. అక్కడి ధూళి సర్వాంగములను రక్షిస్తుంది. సర్వకాలసర్వావస్థలయందుకాశీనామస్మరణ పాపాలనుపోగొ-



డుతుంది. బ్రహ్మాండములోని తీ-ర్థాలన్ని కాశీలోనే ఉన్నాయి. కాశీ మోక్షమాణిక్య గని. మోక్ష లక్ష్మీ ని-వాసమైన పద్మము, సంసార బీ-జాంకురములకు ఎడారి." అని చెప్పి పరమేశ్వరుడు అంతర్ధా-నమయ్యాడు. బ్రాహ్మణులు ఆ జ్యోతిర్లింగము దగ్గర ఇష్టాగోష్టి జరిపి తమ నివాసములకు వెళ్ళి-పోయారు. ఈ వృషభధ్వజావిర్భా-వము అను ఉపాఖ్యానము భోగ, మోక్ష ప్రదాయకము.

జ్యేష్టనాథ తీర్థంలో ఐదువేల శివలింగాలు ఉన్నాయి. ఆదిత్య-లింగం, పరాశరేశ్వర లిగం, మాం-డవ్యేశ్వర లింగం, మంకణేశ్వర లింగం, జానుకేశ్వర లింగం, సు-మంతీశ్వర లింగం, భారద్వాజేశ్వర లింగం, వాజపేయేశ్వర లింగం, అగ్ని వర్ణేశ్వర లింగం, ధృవేశ్వర లింగం, వత్సేశ్వర లింగం, కు-క్కుటేశ్వర లింగం, పర్ణాదేశ్వర లింగం, సక్తుప్రస్థేశ్వర లింగం, మాండూకేశ్వర లింగం, భాభ్ర-వేయేశ్వర లింగం, చ్యవనేశ్వర లింగం, కలిందమేశ్వర లింగం, అక్రోధనేశ్వర లింగం, కంకేశ్వర లింగం, కుంతలేశ్వర లింగం, కంఠేశ్వర లింగం, తుంబురు నారదేశ్వర లింగం, జతుకర్ణేశ్వర లింగం, జంబుకేశ్వర లింగం, చారుధీశ్వర లింగం, కాళేశ్వర, గాలవేశ్వర లింగం మొదలయిన మహాలింగాలు ఎన్నో ఉన్నాయి.

**కందుకేశ్వర వ్యాఘ్రేశ్వర సంభవము**

ఒకనాడు పార్వతీదే-వి విలాసార్ధము నల్లని గుడ్డతో తయారుచేయబడిన బంతితో ఆడుతోంది. ఆ సమయంలో ఇద్దరు రాక్షసులు ప్రమథవేషా-న్ని ధరించి అక్కడికి వచ్చారు. ఆ విషయాన్ని గ్రహించిన పర-మేశ్వరుడు కనుసన్న చేసాడు. పార్వతి విషయాన్ని గ్రహించి అదే బంతితో రాక్షసుల రొమ్ము-పైకొట్టిచంపింది. ఆ కందుకము-[బంతి] కాశీ క్షేత్రములో కందు-కేశ్వరుడు అను పేర వెలిసింది.

దండఖాతము అను తీర్థ-మునందు "దుందుభినిర్హ్రాదుడ-ను రాక్షసుడు[ప్రహ్లాదుని మామ] దేవతలకు కీడు చేయాలనే తలంపుతో బ్రాహ్మణులను చం-పుతున్నాడు. కాశీ నగరంలో ఒక బ్రాహ్మణుడు శివుని పూజిస్తూం-డగా రాక్షసుడు పులి వేషము ధరించి అక్కడకి వచ్చాడు. పర-మేశ్వరుడు ఆ రాక్షసుని చంకలో పెట్టుకొని చంపేసాడు. అందువ-లన పరమేశ్వరునికి వ్యాఘ్రేశ్వరు-డు అని పేరు వచ్చింది. శివుడు వ్యాఘ్రేశ్వరుడు అను పేర కాశీక్షే-త్రములో వెలిసాడు.

జ్యేష్టేశ్వర లింగానికి సమీపంలో కుక్కుటేశ్వరలిం-గం, పితామహేశ్వర లింగం, గదా ధరేశ్వరలింగం, వాసుకీశ్వర లింగం, కపాలభైరవేశ్వర లింగం, మహాతుండేశ్వర లింగం, సా-గరేశ్వర లింగం, కర్కోటకేశ్వర లింగం, సుప్రతీకేశ్వర లింగం, హుండనేశ్వర లింగం, ముం-

డనేశ్వర లింగం ఉన్నాయి. ఈ లింగాలను సేవించిన వారికి భుక్తి, ముక్తి లభిస్తుంది.

**శైలేశ్వరరత్నేశ్వర ప్రాదుర్భావము.**

ఒకరోజున హిమవంతుని భార్య అయిన మేనక తన కుమార్తెను తలచుకొని విచారిస్తూ "బిడ్డది పేద బ్రతుకు అయిపోయింది. కాశీ నగరంలో ఆమె ఎలాగుందో? మీది రాతి గుండె. పుట్టింటివారు పట్టించుకొనకపోయినచో పిల్ల హడిలిపోదా?" అని పోరు పెట్టింది. హిమవంతుడు ధనరాసులు తీసుకొని కాశీ నగరానికి వచ్చాడు. ఆ నగర శోభను చూసి, కుమార్తె స్థితిని చూసి సంతృప్తి చెంది, అక్కడ శివలింగాని ప్రతిష్టించాలని అనుకున్నాడు. హిమవంతుడు ప్రతిష్టించిన లింగానికి శైలేశ్వర లింగమని పేరు.

హిమవంతుడు పార్వతికి ఇద్దామని తీసుకు వచ్చిన ధనరాసులనన్నిటిని పోగుగా పోసి రత్నేశ్వర లింగాన్ని ప్రతిష్టించాడు. ఆలింగము నేటికి ఉదయం, మధ్యాహ్న సమయాలలో ఇంద్ర ధనస్సులను ప్రసరిస్తూ ఉంటుంది.

కాశీ నగరంలో 'కర్పూర తిలక' అను వేశ్య ఉండేది. ఆమె రత్నేశ్వరుని ఆస్థాన మండపమందు నాట్యము చేస్తూ ఉండేది. ఒక రోజున ఆమె కార్యాంతరమున దేశాంతరము వెళ్ళి అక్కడ మరణించింది.

వెనుకటి జన్మలో శివార్చనా పుణ్య ఫలము వలన గంధ మాధన పర్వతమునందు 'వసుభూతి' అను గంధర్వరాజునకు కుమార్తెగా జన్మించింది. కాశీ నగరంలో రత్నేశ్వరుని నిత్యం సేవిస్తూ ఉండేది. ఆమె సేవకు మెచ్చుకొని పరమేశ్వరుడు తన సేవకుడైన పాతాళరాజు కుమారుడైన రత్నచూడుని పేరున తీర్థాన్ని ఏర్పాటు చేసాడు.

**కృత్తివాస తీర్థ మహాత్మ్యము.**

ఒకరోజున కాశీనగరము బహిః ప్రదేశమునందు గంభీరమైన ధ్వని వినబడింది. ఆధ్వని విని కాశీలోని చాతక పక్షులు, మయూరములు ఉల్లాసము పొందుతున్నాయి. కడిమి పూల సువాసనవంటి వాసన గల మదజల మదిరా సౌరభము నాలుగు దిక్కులకు ప్రసరిస్తున్నాయి. ఆకాశమునందలి జలధారలు ఆకాశ గంగాప్రవాహమునకు వీడ్కోలువుచున్నట్లుగా ఉన్నాయి. భూమిని అదిమి పెట్టడం వలన వరాహము, కూర్మము, ఫణి రాజు కిందకి వంగిపోవుచున్నట్లుగ మేఘములు నాలుగు దిక్కులకి పారిపోతున్నట్లుగా ఉన్నాయి. కర్ణ తాళ, దుంధుభి ధ్వనులతో కులపర్వతాలు ప్రతిధ్వనిస్తున్నాయి. శిఖరములు అనెడి బురుజులు కదులుతున్నాయి. ఆ విధంగా గజాసురుడు కాశీ నగరంలో ప్రవేశించి పంచకోశ పరిమితిలోని మేడలను, బురుజులను ధ్వంసం చేస్తున్నాడు. ఆ గజాసురుడు కాశీ నగరములోని భారభూతేశ్వరుని ప్రాకార గోపురములదగ్గర మదజలాన్ని వర్షిస్తున్నాడు. ఖఖోలాదిత్య భవనందగ్గర ఉన్న వృక్షాన్ని గండస్థలముతో ఒరపిడి చేస్తున్నాడు. ధృమి చండేశ్వర లింగంపై తన తొండంతో నీళ్ళు పోస్తున్నాడు. శంకు కర్ణేశ్వర లింగంయొక్క వేదికమీద ఆటలాడుకుంటున్నాడు. ప్రమథగణాలను తరిమి కొడుతున్నాడు. ఈ విధంగా గజాసురుడు కాశీ నగరంలోని ప్రజలను బాధిస్తూ ఉండగా తామరాకుమీది నీటి బిందువులాగ అల్లల్లాడిపోతున్నారు. గజాసురుడు కన్నులుకానక, మదగర్వంతో విశ్వనాథుని చేరాడు. పరమేశ్వరుడు చిరునవ్వు నవ్వుతూ రాక్షస సేనపై త్రిశూలాని విసిరాడు. కోటి సూర్య సమానమైన తేజస్సుగల ఆ త్రిశూలము గజాసురుని గుండెలో గుచ్చుకుంది. గజాసురుని శరీరమునుండి రక్తము కారుతోంది. ఆ రక్తముతోపాటు గజాసురుని పాపాలుకూడా నశించి పోయాయి. నిర్మలమైన మనస్సు కలవాడై గజాశురుడు శివుని ప్రార్థించాడు.

(ఇంకావుంది)

# పోడూరి శ్రీనివాసరావు



## తెలుగు భాషకు గొడుగు - శ్రీ గిడుగు

(గత సంచిక తరువాయి)

1911 లో శ్రీ గిడుగు రామ్మూర్తిగారు 30 ఏళ్ల సర్వీస్ పూర్తి కాగానే, అధ్యాపక పదవి నుండి స్వచ్ఛంద పదవీ విరమణ చేశారు. అంతకు కొద్ది సంవత్సరాల ముందే ఆధునికాంధ్ర భాషా సంస్కరణపై వారి దృష్టి మళ్లింది. శ్రీ రామమూర్తి గారికి చిన్నప్పటి నుంచి విద్యాసక్తి, కార్యదీక్ష, సత్యాన్వేషణ ప్రధాన లక్షణాలు. సవరలు, హరిజనులు అంటరానివాళ్ళని అప్పటి సంఘంలో అంటుండే, ఆ కాలంలోనే ఆయన సవర విద్యార్థులకు తన ఇంట్లోనే బస ఏర్పరచి భోజనాలు పెట్టేవారు.

1930 లో ఒరిస్సా రాష్ట్రం ఏర్పడానికి పూర్వమే, పర్లాకిమిడి రాజా, తన పర్లాకిమిడి తాలూకా అంతటినీ, ఒరిస్సా రాష్ట్రంలో చేర్చటానికి ప్రయత్నించినపుడు, అలా చేయటంవల్ల తెలుగువారికి అన్యాయం జరుగుతుందని భావించి, తెలుగువారికి నాయకుడిగా నిలిచి ప్రతిఘటించారు. పర్లాకిమిడి పట్టణాన్ని అక్రమంగా ఒరిస్సాలో కలపడంపట్ల నిరసన వ్యక్తం చేస్తూ, 1936 లో ఒరిస్సా రాష్ట్రం ప్రారంభోత్సవం జరిగే రోజునే, ఆ ఉదయమే పర్లాకిమిడిలో ఉండడానికి ఇష్టపడక రాజమహేంద్రవరం వచ్చి, అక్కడే తన శేష జీవితాన్ని గడిపారు. అది వారిలో గల పట్టుదలకు నిదర్శనం.



1907 లో జె ఏ యేట్స్ అనే ఇంగ్లీష్ దొర ఉత్తర కోస్తా జిల్లాలకు స్కూళ్ల ఇన్స్పెక్టర్ గా వచ్చాడు. ప్రాథమిక తరగతుల్లో తెలుగు పండితులు చెప్పే పద్ధతి ఆ దొరకు అర్థం కాలేదు. అతని ముఖ్య సమస్య, సందేహం ఏమిటంటే - ప్రజల వాడుక భాష, పుస్తకాల భాష మధ్య తేడా ఎందుకుంది? అన్నది. ఇదే సమస్య తమిళ దేశంలోనూ

ఆయనకు ఎదురయింది. విశాఖపట్నం లోని Mrs. A V కాలేజ్ ప్రిన్సిపాల్ గారైన శ్రీ పి టి శ్రీనివాస అయ్యంగార్ గారిని అడిగితే గురజాడ, గిడుగులు మాత్రమే నీ సందేహం తీర్చగలరని చెప్పారు. ఆ విషయంలో తెలుగు విద్యావిధానంలో తేడా జరుగుతోందని గుర్తించాడు. ఆ విధంగా - గురజాడ, గిడుగు, శ్రీనివాస అయ్యంగార్, యేట్స్ - ఈ నలుగురియొక్క ఆలోచనలవల్ల వ్యావహారిక భాషోద్యమం ఆరంభమయింది.

1906 నుండి 1940 వరకు శ్రీ గిడుగు రామ్మూర్తి గారి కృషి అంతా తెలుగుభాషా సేవకే. యేట్స్ ప్రోత్సాహంతో వ్యావహారిక తెలుగుభాషను గ్రంథ రచనకు అనువైనదిగా చేయడానికి అత్యంత కృషి చేసి కృతకృత్యుడయ్యాడు. వీరికి శ్రీ వీరేశలింగం గారి ఊతం కూడా లభించింది. 1919 - 1920 ల మధ్య వ్యావహారిక భాషోద్యమ ప్రచారం కొరకు 'తెలుగు' అనే మాసపత్రికను నడిపారు. 1925 లో తణుకులో వ్యావహారిక భాషను ప్రతిఘటించిన 'ఆంధ్ర సాహిత్య పరిషత్తు' సభలో నాలుగు గంటలపాటు ప్రసంగించి, గంధాల్లోని ప్రయోగాల్ని ఎత్తిచూపి, తన వాదానికి అనుకూలంగా సమితిని తీర్మానింపచేసారు. సాహితీ సమితి, నవ్యసాహిత్య పరిషత్తు మొదలైన సంస్థలకూడా శ్రీ గిడుగు రామ్మూర్తి వాదాన్ని బలపరచాయి.



1912 - 1913 లో స్కూల్ ఫైనల్ వ్యాసరచన కావ్యభాషలో గాని, ఆధునిక భాషలో గానీ వ్రాయవచ్చుని స్కూల్ ఫైనల్ బోర్డు కార్యదర్శి ఒక G .O ఇచ్చారు. ఆధునిక భాషకు లక్ష్యంగా బ్రౌన్ తెలుగు రీడర్ ను, ఏనుగుల వీరాస్వామయ్య కాశీయాత్ర చరిత్రను ఉదహరించారు. ఈ మార్పులవల్ల తెలుగు సాహిత్యానికి అపకారం కలుగుతుందని పండితుల్లో అలజడి ఏర్పడింది. మద్రాసులో జయంతి రామయ్య గారి అధ్యక్షతని 'ఆంధ్ర సాహిత్య పరిషత్తు' ఏర్పడింది. వావికొలను సుబ్బారావు, వేదు వెంకటశాస్త్రి మొదలుగా గల పండితులు జయంతి రామయ్య వాదాన్ని బలపరిచారు. దేశం అంతటా సభలు పెట్టి పెద్ద ఉద్యమాన్ని లేవనెత్తారు.

ఆ విధంగా గిడుగు రామ్మూర్తిగారు ప్రారంభించిన వ్యవహారిక భాషోద్యమం, అనేకమంది సానుభూతిపరుల, సాహితీవేత్తల జోక్యంతో సమర్థనలతో ఉద్ధృతి నందుకుంది.

స్కూల్, కాలేజ్ పుస్తకాల్లో గ్రాంథిక భాషే పాతుకుపోయింది. కొన్నిటిలో వీరేశలింగం గారు ప్రతిపాదించిన సరళ గ్రాంధికం కూడా వచ్చింది. గిడుగు రామ్మూర్తిగారు ఊరూరా ఉపన్యసిస్తూ, గ్రాంథికంలో ఏ రచయితా, నిర్దుష్టంగా వ్రాయలేడని నిరూపించారు. 1919 లో గిడుగు 'తెలుగు' అనే మాసపత్రికను స్థాపించి, తన శాస్త్రీయ వ్యాసాలతో, ఉపన్యాస పాఠాలతో అవిశ్రాంత పోరాటం కొనసాగించారు. కానీ, ఆ పత్రిక ఒక ఏడాది మాత్రమే ప్రచురించబడింది. చెళ్ళపిళ్ళ వేంకటశాస్త్రి, తల్లావఝ్ఝుల శివశంకరశాస్త్రి, వీరేశలింగం, పంచాగ్నుల ఆదినారాయణశాస్త్రి, వఝ్ఝుల చిన సీతారామశాస్త్రి మొదలైన కవులు, పండితులు వ్యవహారిక భాషావాదం వైపు మొగ్గు చూపారు. 1919 ఫిబ్రవరి 28 న రాజమహేంద్రవరములో కందుకూరి వీరేశలింగం అధ్యక్షుడిగా, గిడుగు కార్యదర్శిగా 'వర్ధమానాంధ్ర భాషా ప్రవర్తక సమాజం' స్థాపింపబడింది. 1933 లో గిడుగు రామమూర్తి సప్తతి మహోత్సవం ఆయన అభిమానులు, శిష్యులు రాజమహేంద్రవరం లో బ్రహ్మాండంగా జరిపారు. తెలికచెర్ల

వెంకటరత్నం సంపాదకుడిగా ప్రపంచం నలుమూలల నుంచి 46 పరిశోధక వ్యాసాలతో 'వ్యాస సంగ్రహం' అనే ఉద్గ్రంథాన్ని గిడుగు రామ్మూర్తిగారికి సమర్పించారు. 1924 లో కాకినాడ లోని ఆంధ్రసాహిత్య పరిషత్తు అధికారికంగా వ్యవహారిక భాషా నిషేధాన్ని ఎత్తివేసింది. 1936 లో 'నవ్య సాహితీ పరిషత్తు' అనే సంస్థను ఆధునికులు స్థాపించి సృజనాత్మక రచనల్లో శిష్ట వ్యావహారికాన్ని ప్రోత్సహించే 'ప్రతిభ' అనే సాహిత్య పత్రికను ప్రచురించారు. 1937 లో తాపీ ధర్మారావు సంపాదకుడిగా 'జనవాణి' అనే పత్రిక కేవలం ఆధునిక ప్రమాణ భాషలోనే వార్తలు, సంపాదకీయాలు వ్రాయడం మొదలుపెట్టింది. ఇలా గిడుగు రామ్మూర్తి పంతులుగారు మొదలుపెట్టిన వ్యవహారిక భాషోద్యమం - అనేక పత్రికల స్థాపనకు, అనేకమంది కవులను,పండితులను,రచయితలనూ ఈ ఆధునిక వ్యావహారిక భాషోద్యమం వైపుకు ఆకర్షితులను చేయడమే గాక, ఈ భాషోద్యమంలో పాలు పంచుకునేలా, ప్రముఖపాత్ర పోషించేలా చేసింది.

గిడుగు రామ్మూర్తిగారు 1940 జనవరి 15 వ తేదీన ప్రజామిత్ర కార్యాలయంలో పత్రికా సంపాదకులు సంబోధిస్తూ చేసిన తన తుది విన్నపంలో - వ్యావహారిక భాషాభివృద్ధికి చాలా సంతృప్తి పొందారు. కానీ ప్రభుత్వ విద్యాశాఖావారు విశ్వవిద్యాలయ గ్రాంథికాన్ని వదలిపెట్టక పోవడం పట్ల చాలా బాధపడ్డారు.

గిడుగు రామ్మూర్తిగారు, జనవరి 22, 1940 వ తేదీన, తన 77 వ ఏట కన్నుమూశారు. ఆయన పుట్టిన రోజైన ఆగస్టు 29 వ తేదీని 'తెలుగు భాషా దినోత్సవంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పరిగణిస్తోంది.

గిడుగు రామ్మూర్తిగారి తనయుడైన గిడుగు సీతాపతి కూడా తెలుగు సాహిత్య వినీలాకాశంలో చందమామలా ప్రకాశించారు. తండ్రికి తగ్గ తనయుడిగా సాహితీ ప్రపంహంలో కీర్తి ప్రతిష్టలను సముపార్జించాడు. ఆంధ్ర విశ్వవిద్యాలయం నుండి డాక్టరేట్, కళాప్రపూర్ణ బిరుదు పొందిన తండ్రీ కొడుకులు వీళ్లిద్దరే!

శ్రీ గిడుగు రామ్మూర్తిగారి గురించి సాహిత్య ప్రముఖులు ఈవిధంగా ప్రశంసించారు:

"ఏమైనా అభిమానమంటూ మిగిలిన ఏ పండితుడైనా, తన బిరుదులూ, పతకాలూ అన్నీ రామ్మూర్తి పంతులుగారికి దోసిలొగ్గి సమర్పించుకుని, మళ్ళీ ఆయన అనుగ్రహించి ఇస్తే పుచ్చుకోవలసిందే!" - శ్రీ చెళ్ళపిళ్ళ వేంకటశాస్త్రి

"రామ్మూర్తి పంతులు తెలుగు సరస్వతి నోములపంట"

"రామ్మూర్తి పంతులు వాదాన్ని అర్థం చేసుకోక, దురార్థం కలిగించి తెలుగువాళ్లుఎంతో నష్టపోయారు"

- శ్రీ విశ్వనాథ సత్యనారాయణ

గ్రాంథికమ్ము నెత్తిన
పిడుగు గిడుగువ్యావహారిక
భాషోద్యమ ఘనుడు గిడుగు
తేట తేనియల తెల్లని పాల-
మీగడ గిడుగు కూరి తెలుగు
భాషకు గొడుగు గిడుగు

-పులిదిండి మహేశ్వర్

శ్రీ గిడుగు రామ్మూర్తిగారు ఈ దిగువ తెలిపిన పురస్కారాలు, ప్రశంసలు పొందారు: 1913 లో 'రావు సాహెబ్ 1934 లో కైజర్ - ఎ - హింద్ 1938 లో కళాప్రపూర్ణ (ఆంధ్ర విశ్వవిద్యాలయంచే) రామూర్తి గారి పుట్టిన రోజైన ఆగస్టు 29 న మనం జరుపుకుంటున్న తెలుగు భాషాదినోత్సవం, తెలుగు భాషా దినోత్సవం కాదనీ, వ్యావహారిక భాషా దినోత్సవంగా మాత్రమే జరుపుకోవాలననీ, ఆ రోజుకు బదులుగా ఫిబ్రవరి 21 వ తేదీని తెలుగు భాషా దినోత్సవంగా జరుపుకోవాలని కొందరి భావన / వాదన. ఏది ఏమైనా గిడుగువారి పుట్టినరోజును ఒక ఉత్సవంలా బ్రహ్మాండంగా జరుపుకోవడం ఎంతో ఆనందదాయయకం. ఈ రోజూ ఇలా తేట తెలుగును వ్యావహారిక భాషగా వ్రాసుకుంటున్నామంటే ఆ భాగ్యం గిడుగు రామ్మూర్తిగారి చలవే కదా! ఆ మహనీయుడి చొరవ, చలవ వల్లనే కదా నేడు మనకీ భాగ్యం!

(వికీపీడియా వారికి కృతజ్ఞలతో)

- పోడూరి శ్రీనివాసరావు

# చిలకమర్తి దుర్గా ప్రసాదరావు



+91 9897959425




# SPOKEN SANSKRIT

## (సంభాషణ సంస్కృతం -13)

**పాఠం -- Lesson-13**

**Unit-1.**

एक: - एका - एकम्

**సంస్కృతభాషలో ఒక నియమం ఉంది . నామ వాచకం ఏ లింగం, ఏ వచనం, ఏ విభక్తిలో ఉంటుందో విశేషణం కూడ అదే లింగం, అదే వచనం, అదే విభక్తిలో ఉండాలి .**

यल्लिङ्गं यद्वचनं या च विभक्ति: विषेष्यस्य तल्लिङ्गं तद्वचनं सा च विभक्ति: विशेषणस्यापि.

**ఈ నియమం సంఖ్యా వాచకాలకు కూడ వర్తిస్తుంది . సంస్కృతంలో 1,2,3,4 సంఖ్యలను తెలిపే** एकं **(one),** दवे **(two),** त्रीणि **(three),** चत्वारि **(four) పదాలు మూడు లింగాలలోను వేర్వేరుగా ఉంటాయి. 5 నుంచి ఒకే విధంగా ఉంటాయి .**

| पुंलिङ्ग: | स्त्रीलिङ्ग: | नपुंसकलिङ्ग: |
|---|---|---|
| एक: | एका | एकम् |
| एक: बालक: | एका बालिका | एकं पुस्तकम् |
| एक: वृक्ष: | एका लता | एकं पुष्पम् |
| एक: चमस: | एका दर्वी (గరిటె) | एकं पत्रम् |
| एक: पुरुष: | एका महिला | एकं मन्दिरम् |
| एक: समुद्र: | एका नदी | एकं सर: |
| द्वौ -- | द्वे -- | द्वे |
| द्वौ बालकौ | द्वे बालिके | द्वे पुस्तके |
| द्वौ वृक्षौ | द्वे लते | द्वे पत्रे |
| द्वौ पुरुषौ | द्वे महिले | द्वे वाहने |

| | | |
|---|---|---|
| त्रय: | तिस्र: | त्रीणि |
| त्रय: पुरुषा: | तिस्र: - वनिता: | त्रीणि पुस्तकानि |
| त्रय: वृक्षा: | तिस्र: लता: | त्रीणि पत्राणि |
| त्रय: क्रीडाकारा: | तिस्र: क्रीडाकारिण्य: | त्रीणि दिनानि |
| चत्वार: | चतस्र: | चत्वारि |
| चत्वार: पुरुषा: | चतस्र: महिला: | चत्वारि फलानि |
| चत्वार: बालका: | चतस्र: बालिका: | चत्वारि पुस्तकानि |
| | | |

**SOME EXAMPLES:**

**1.** एक: बालक: एका बालिका एकं पुस्तकं गृहीत्वा पठत:

**ఒక బాలుడు ఒక బాలిక ఒక పుస్తకము తీసుకొని చదువుచున్నారు**

**2.** द्वौ बालकौ द्वे बालिके द्वे कन्दुके गृहित्वा क्रीडन्ति

**ఇద్దరు బాలురు ఇద్దరు బాలికలు రెండు బంతులను తీసుకొని ఆడుచున్నారు**

**3.** त्रय: युवका: तिस्र: युवतय: त्रीणि पुस्तकानि गृहित्वा पाठशालां गच्छन्ति

**ముగ్గురు యువకులు, ముగ్గురు యువతులు, మూడు పుస్తకములను పుచ్చుకొని బడికి వెళ్ళుచున్నారు .**

**4.** चत्वार: पुरुषा: चतस्र: महिला: चत्वारि फलानि स्वीकृत्य देवालयं गच्छन्ति

**నలుగురు పురుషులు , నలుగురు స్త్రీలు నాలుగు పండ్లను తీసుకొని గుడికి వెళ్ళు చున్నారు .**

**5 నుండి సంఖ్యావాచక పదాలు అన్ని లింగములయందు ఒకే విధంగా ఉంటాయి.**

**From five it is common for all genders**

पञ्च बालका: -- पञ्च बालिका: - पञ्च फलानि .

पञ्चबालका: पञ्चबालिका: च पञ्चपुष्पै: देवं पूजयन्ति

**ఐదుగురు బాలురు ఐదుగురు బాలికలు ఐదు పువ్వులతో దేవుని పూజించుచున్నారు .**

## Unit 2.

भोजनसंबन्धिशब्दा:

अन्नम् (**అన్నము**) सूप: (**పప్పు**) सार:(**చారు**) शाक: (**కూర**) तक्रम् (**మజ్జిగ**) दधि ( **పెరుగు**)
घृतम् (**నెయ్యి**) अवलेह: (**ఊరగాయ**) क्वथितम् (**సాంబారు**), **etc**

अहं भोजनप्रिय: || मम माता अन्नं परिवेषयति || अनन्तरं सूपं परिवेषयति, तत: शाकं, ततोऽनन्तरं , सारं क्वथितं, मध्ये मध्ये यथावसरं घृतम् , अवलेहं, पेयजलं च परिवेषयति || अन्तत: दधि परिवेषयति || भोजनानन्तरं तक्रम् अपि पानार्थं ददाति ||

**నేను భోజనప్రియుణ్ణి. మా అమ్మ నాకు ముందుగా అన్నం వడ్డిస్తుంది . ఆ తరువాత పప్పు వడ్డిస్తుంది . ఆ తరువాత కూర, ఆపై చారు , సాంబారు , మధ్యలో నేయి , ఊరగాయ, మంచినీరు ఆఖరులో పెరుగు**

వడ్డిస్తుంది . భోజనం అయ్యాక త్రాగడానికి మజ్జిగ ఇస్తుంది .

కొన్ని ఖాద్య పదార్థాల పేర్లు :

1. |मुद्गः = Green gram = పెసలు (मूंग)
2. माषः = Black gram = మినుములు (उड़द)
3. तुवरिदलः = Red Gram = కందులు (अरहर)
4. सर्षपः = Black mustered=ఆవాలు (राई-सरसों)
5. मरीचकम् = Black pepper = మిరియాలు (काली मिर्च)
6. धनीयकः = Coriander seeds = ధనియాలు (धनिया)
7. जीरकः = Cumin seeds = జీలకర్ర (जीरा)
8.हिंगुः = Asafetida = ఇంగువ (हिंग)
9.जातिकोशः = Mace = జాపత్రి
10.एला= Cardamom = యాలకులు (इलायची)
11. (मेंथी) = Fenugreek = మెంతులు
12. वरांगः = Cinnamon = దాల్చిన చెక్క
13. सर्जः = Pearl millet = సజ్జలు
14. जूर्णः = Great millet = జొన్నలు
15. लशुनम् = Garlic = వెల్లుల్లి
16. पलाण्डुः = Onion = ఉల్లి
17. घुसृणम् /काश्मिर्यम् = Saffron = కుంకుమపువ్వు
18. भल्लातकी = Cashew nut = జీడిపప్పు
19. अर्द्रकः/शृंगबेरः = Ginger = అల్లం
20.हरिद्रः = Turmeric = పసుపు
21. आम्रार्द्रकः = Mango ginger = మామిడి అల్లం
22. कटिजः/ शिखालुः = Corn = మొక్కజొన్న
23. कूष्माण्ड = Ash gourd = బూడిదగుమ్మడి
24. जम्बू = Jam bun fruit = నేరేడు
25. चणकः = Bengal gram = సెనగలు
26. दाडिमी = Pomegranate = దానిమ్మ
27. सीताफलम् = Custard apple = సీతాఫలం
28. रामाफलम् = Bullock's heart= రామాఫలం
29. गोजिह्वः = Lady's finger = బెండకాయ
30. पटोलिका = Snake guard = పొట్లకాయ
31.कारवेल्लम् = Bitter guard = కాకరకాయ
32. कोशातकी = Ribbed guard = బీరకాయ

33. उर्वारुक = **Cucumber** = **దోసకాయ**

34. कर्कारुक: /कालिंग: / कृष्णबीज: = **Watermelon** = **పుచ్చకాయ**

35. आलुक: /म्लेच्छ कन्द: = **Potato** = **బంగాళాదుంప**

36. वार्ताक: = **Brinjal/egg plant** = **వంకాయ**

37. बृहन्मरीच: /रक्तमरीच: = **Red pepper** = **మిరపకాయ**

38. कपित्थ: = **Elephant apple** = **వెలగపండు**

39. कर्पूर: = **Camphor** = **కర్పూరం**

40. गुग्गुल: = **Guggul** = **గుగ్గిలం**

41. एरण्ड = **Caster** = **ఆముదం**

42. तैलम् = **oil** = **నూనె**

43. घृतम् = **ghee** = **నేయి**

44. पनसफलम् = **Jackfruit** = **పనస పండు**

45. तालफलम् = **Toddy nut** = **తాటికాయ**

46. शिग्रु: = **Drumsticks** = **ములగ కాడ**

47. कर्तारि: = **Radish** = **ముల్లంగి**

48. आमलक: = **Indian gooseberry** = **ఉసిరి**

49. द्राक्षाफलम् = **Grapes** = **ద్రాక్ష**

50. खर्जूरं: = **Date fruit** = **ఖర్జూరం**

51. तिन्त्रिणीफलम् = **Tamarind** = **చింతపండు**

52. लवङ्ग: = **Cloves** = **లవంగాలు**

## Unit-3

### तृतीयाविभक्ति: తృతీయా విభక్తి (instrumental case)

**Note: The main instrument used in every activity is expressed through** तृतीयाविभक्ति || **ప్రతి పనియందు ఏ వస్తువు సాధనముగా చెప్పబడునో అది తృతీయావిభక్తి ద్వారా వ్యక్తం చెయ్యబడును**

**1.** बालक: चमसेन अन्नं खादति

**బాలుడు చెంచాతో అన్నం తింటున్నాడు**

**(The boy is eating food with a spoon)**

अध्यापक: सुधाखण्डेन लिखति

**అధ్యాపకుడు సుద్దముక్కతో వ్రాయుచున్నాడు**

**(The teacher is writing with a piece of chalk)**

**3.** रक्षकभट: दण्डेन ताडयति

**రక్షక భటుడు లాఠీతో కొట్టుచున్నాడు**

**(The police man is beating with a stick)**

4. अहं नेत्राभ्यां पश्यामि
**నేను (నా) రెండు కళ్ళతో చూచుచున్నాను.**
**( I am seeing with my two eyes)**
5. बालक: कन्दुकेन क्रीडति
**బాలుడు బంతితో ఆడుచున్నాడు .**
**(The boy is playing with a ball)**
6. भवान् दन्तकूर्चेन दन्तधावनं करोतु
**నీవు పళ్ళ పొడితో పళ్ళు తోముకొనుము.**
**( You clean your teeth with a tooth brush)**
नरसिंह: नखै: हिरण्यकशिपं विदारयति
**నరసింహస్వామి గోళ్ళతో హిరణ్యకశిపుని చీల్చుచున్నాడు.**
**(Lord Narasimha tears Hiranyakashipa with nails)**

## Unit - 4.

सह = **(తో /కలసి) along with/with**

1. रामेण सह सीता वनं गतवती
**రామునితో బాటుగా సీత అడవికి వెళ్ళెను.**
**Sita went to forest along with Rama.**
2. अहं मम मित्रेण सह संभाषणं करोमि
**నేను నా మిత్రునితో మాట్లాడు చున్నాను.**
**I am speaking to my friend.**
3. पिता पुत्रेण सह क्रीडति
**తండ్రి కుమారునితో ఆడుచున్నాడు.**
**Father is playing with his son.**
राजा सेवकेन सह मन्दिरं प्रविशति
**రాజు సేవకునితో మందిరంలో ప్రవేశిస్తున్నాడు.**
**A king is entering in to temple along with his servant.**
पाण्डवा: पत्न्या सह वनं गतवन्त:||
**పాండవులు భార్యతో సహా అడవికి వెళ్ళిరి.**
**Pandavas went to forest along with their wife.**

## Unit -5

विना **(లేకుండా ) = with out**

1. रामेण विना सीता न जीवति

**రాముడు లేనిచో సీత బ్రతుక లేదు.**

**Sita can not live without Rama.**

2. जलेन विना जीवनं नास्ति

**నీరు లేనిచో జీవితమే లేదు.**

**There is no life with out water.**

3. विद्यया विना जीवनं फलवन्तं न भवति

**విద్య లేనిచో జీవితం సఫలం కాదు.**

**Life is not worth while /fruitful without education.**

चक्रै: विना वाहनं न चलति

**చక్రములు లేకుండా వాహనము నడవదు.**

**A vehicle does not move without wheels**

5. अध्यापकेन विना पाठनं नास्ति

**అధ్యాపకుడు లేకుండా బోధన జరుగదు.**

**There is no teaching without teacher.**

6. मुखेन विना भाषणं न प्रचलति

**నోరు లేకుండా మాట్లాడలేము.**

**There is no speech without mouth.**

**A Sanskrit Sloka for fun: 13.**

चितां प्रज्वलितां दृष्ट्वा वैद्यो विस्मयमागत:
नाऽहं गतो न मे भ्राता कस्येदं हस्तलाघवम् ?

**చితాం ప్రజ్వలితాం దృష్ట్వా వైద్యో విస్మయమాగత:**
**నాఽహం గత: న మే భ్రాతా కస్యేదం హస్తలాఘవం?**

**ఒక చోట చితిపై ఒక శవం కాలుతోంది. అది చూచి ఒక వైద్యుడు ఇలా అనుకుంటున్నాడు. ఇతనికి నేను గాని మా అన్నయ్య గాని వైద్యం చెయ్యలేదు. ఇది ఎవరి హస్త లాఘవం అయ్యుంటుంది ?**

**On seeing a dead body being burnt on a pyre, a doctor exclaimed and thought for himself "neither I nor my brother treated him. Whose marvelous act it is"?**

****************

తుమ్మూరి రాంమోహన్ రావు



# ప్రపంచ తెలుగు మహాసభలు

తెలంగాణా ప్రభుత్వం, తెలంగాణా సాహిత్య అకాడమీ ప్రతిష్ఠాత్మకంగా తలపెట్టిన ప్రపంచ తెలుగు మహాసభలు డిసెంబరు 15న మొదలై 19 వరకు వైభవంగా జరిగాయి. లాల్ బహదూర్ స్టేడియం ప్రధాన వేదికగా, రవీంద్ర భారతి, తెలుగు విశ్వవిద్యాలయం, ఇందిరా ప్రియదర్శిని హాలు, లలిత కళా తోరణం, తెలంగాణా సారస్వత పరిషత్తులు పలు ఇతర సాహిత్య కార్యక్రమాల వేదికలుగా ఏర్పాట్లు జరిగాయి. అన్నింటికి ప్రముఖ సాహితీ వేత్తల పేర్లమీదుగా ప్రాంగణాలు, వేదికలు నిర్మించారు.

యల్.బి.స్టేడియం లోని ప్రాంగణానికి పాల్కురికి సోమన ప్రాంగణమని, ప్రధాన వేదికకు బమ్మెర పోతనవేదిక అని పేరు పెట్టారు. అలాగే తెలుగు విశ్వవిద్యాలయంలో బిరుదురాజు రామరాజు ప్రాంగణం, సామల సదాశివ వేదిక, ఇందిరా ప్రియదర్శిని ఆడిటోరియంను అలిశెట్టి ప్రభాకర్ ప్రాంగణం, వానమామలై వేదిక, రవీంద్రభారతి సమావేశ మందిరాన్ని గుమ్మన్నగారి లక్ష్మీ నృసింహ శర్మ ప్రాంగణం, ఇరివెంటి కృష్ణమూర్తి వేదిక,రవీంద్ర భారతికి యశోదారెడ్డి ప్రాంగణం, బండారు అచ్చమాంబ వేదిక,సారస్వత పరిషత్తుకు మరింగంటి సింగరాచార్యుల ప్రాంగణం, కోరుట్ల కృష్ణమాచార్యుల వేదిక అని పేర్లు పెట్టారు సారస్వత పరిషత్తులో నాలుగురోజులు శతావధానం, ఇందిరా ప్రియదర్శిని హాల్లో నాలుగు రోజుల పాటు బృహత్ కవిసమ్మేళనం జరిగాయి.మిగతా వేదికలపై తెలంగాణా పద్య కవితాసౌరభం, వచనకవితా వికాసం, కథ, నవల, విమర్శ మొదలగు అంశాలమీద సదస్సులు, అష్టావధాన, నేత్రావధాన, గణితావధాన ప్రక్రియలు, పద్యకవి సమ్మేళనం, బాలసాహిత్యం వంటి వివిధకార్యక్రమాలు జరిగాయి. కాని వేదికలన్నీ వేరువేరు చోట్ల ఉండటంతో అందరికీ అన్ని కాక్యక్రమాలు తిలకించే అవకాశం లేకపోయింది. అన్ని చోట్లకు ఉచిత రవాణాసౌకర్యం ఏర్పాటు చేసినా అది అంతగా ఉపకరించలేదు.

భాగ్యనగర వీధులన్నిటా, ప్రముఖంగా తెలంగాణాకు చెందిన కవులు సాహితీ వేత్తల పేర్లమీదుగా తోరణాలు ఏర్పాటు చేశారు. దాదాపు నలభై దేశాలు, పదిహేడు రాష్ట్రాలలో ఉన్న ప్రవాస తెలుగు సాహితీవేత్తలను, ప్రతినిధులను ఆహ్వానించి వారికి సకల సదుపాయాలు కల్పించారు.అంతేగాక రెండు తెలుగు రాష్ట్రాలనుండి హాజరైన సాహితీవేత్తలకు, కవి పండితులకు కూడా వసతి భోజన సౌకర్యం ఏర్పాట్లు ఘనంగా ఉన్నాయని పలువురు ప్రశంసించారు. తెలంగాణా ప్రత్యేక వంటకాలతో అయిదు రోజుల పాటు నిరంతరాయంగా భోజనశాలలు నిర్వహించటం అభినందించాల్సిన విషయమే.

తొలి రోజు సమావేశానికి ముఖ్య అతిథిగా తెలుగు వారైన భారత ఉపరాష్ట్రపతి శ్రీ వెంకయ్యానాయడు హాజరై సభలను లాంఛనంగా ప్రారంభించారు. ముఖ్యమంత్రి శ్రీ కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు భావోద్వేగంతో తన సాహితీ అభినివేశంతో కూడిన ప్రసంగంలో సందర్భోచితంగా పలు పద్యాలను పాటలను ఉట్టంకించి శ్రోతలను ఆకట్టుకున్నారు. తెలంగాణాలో తెలుగు భాష మూలాలను ఆయన ప్రస్తావించారు. అదేగాక సభలోని




కి రాగానే తనకు చిన్నప్పుడు చదువు చెప్పిన గురువుగారు శ్రీ మృత్యుంజయశర్మ గారికి పాదాభివందనం చేయడం ప్రేక్షకులను విపరీతంగా ఆకట్టుకుంది. శ్రీ వెంకయ్యనాయుడుగారు సుదీర్ఘ ప్రసంగంలో తెలుగు భాషకు సేవలందించిన అనేక మంది సాహితీ వేత్తలను సంస్మరించారు. తెలుగు భాషను ఇంటర్మీడియేట్ దాకా కంపల్సరీ చేయటం చాలా మంచి నిర్ణయమని కేసీఆర్ ను అభినందించారు.

సభానంతరం మిరుమిట్లుగొలిపే కాంతులతో పావుగంట సేపు బాణాసంచా కాల్చి సంబరాలను అంబరానికి చేర్చటం ప్రేక్షకులకు కనువిందు కలిగించింది. అయిదు రోజులపాటు మంత్రులు, శాసన సభ్యులు, రాజ్యసభ సభ్యులు అందరూ ఉత్సాహంగా పాల్గొనటంలో ముఖ్యమంత్రి కార్యదీక్ష వెన్నంటి ఉందనేది కాదనలేని సత్యం.

ఇక పలు వేదికల మీద నిర్వహించబడిన సాహిత్యకార్యక్రమాలపై కొన్ని భిన్నాభిప్రాయాలున్నా, మొత్తానికి చాలామందే కవులు, పండితులు పాల్గొని శాలువా, జ్ఞాపిక, నగదు పారితోషికాలతో సన్మాన సత్కారాలు పొందారు. ఇలాంటి బృహత్కార్యక్రమాల్లో కొన్ని అవకతవకలు జరగటం సాధారణమే ఐనా అందవలసినవారికి పిలుపులందకపోవటం, నాటకం, పాట లేక గేయాన్ని పట్టించుకోకపోవటం, పద్యకవి సమ్మేళనానికి ఈయవలసినంత ప్రాధాన్యత ఇవ్వక పోవటం, వచన కవిత్వానికి పెద్దపీట వేయటం వెనుక కొందరి దృక్పథాల ప్రాధాన్యత ఉందేమోననే అనుమానం కలుగకపోదు. ఇంకో విషయం 'కిట్ల' పంపిణీ. ప్రపంచతెలుగు మహాసభలకై ప్రత్యేకంగా తయారు చేయించిన జూట్ బ్యాగులో పెన్ను, ప్యాడ్, 'తెలంగాణా వైభవం' పుస్తకం, పోతన పద్యాల మీద నారాయణరెడ్డి రాసిన వ్యాఖ్య 'మందారమకరందాలు' ఇరివెంటి కృష్ణమూర్తి రాసిన 'వాగ్భూషణం భూషణం' పుస్తకాలు ఒక ప్రశంసాపత్రం, మెడలో వేసుకునే మహాసభల లోగో కల్గిన ట్యాగు పెట్టి ఇచ్చారు. మెడలో ట్యాగు ఉన్న వారికి ప్రత్యేక ద్వారాల గుండా ప్రవేశ అనుమతి ఉండటంతో చాలామంది దానికై ఎగబడటం జరిగింది.ఇది కొంత అసౌకర్యం కలిగించిన మాట వాస్తవం. సరియైన దిశా నిర్దేశాలు లేక పడిగాపులు,-తోపులాటలు జరిగి సభల్లో పాల్గొనే అమూల్య సమయం వ్యర్థంగా అక్కడే గడచిపోవటం నిర్వహణా లోపమని చెప్పాలి.

ఈ ప్రపంచ తెలుగు మహాసభలలో విదేశాల నుండి వచ్చిన వారికి మాత్రం సంతృప్తికరమైన ఏర్పాటు జరగడం విశేషం. అందరినీ పేరు పేరునా సత్కరించే బాధ్యత ముఖ్యమంత్రిగారి కుమార్తె రాజ్యసభ సభ్యురాలు శ్రీమతి కవిత గారు తీసుకున్నారు.. వారినుద్దేశించి 'తెలుగు భాష పుట్టుపూర్వోత్తరాల' గురించి గంటసేపు ఆమె చేసిన సోదాహరణ ప్రసంగం మహా సభలకు హైలైట్ అని చెప్పవచ్చు.

అలాగేముఖ్యమంత్రి గారి తనయుడు కే.టి.ఆర్. సినిమా ప్రముఖులను సత్కరించే బాధ్యతను గైకొన్నారు.

(41 వ పేజీ చూడండి )

# నందుల ప్రభాకర శాస్త్రి



## మా ఊరి నందుల ఆత్మీయ కథ

(గత సంచిక తరువాయి)

మూడవ బహుమతి 'సబ్బు పెట్టె' నందుల సుబ్బయ్య గారి ఎద్దుకని ప్రకటించారు. మారు మాట లేకుండా పై బహుమతి తీసుకోకొండానే వెనుదిరిగారు నందుల సుబ్బయ్య గారు.

ఈ పని పలుగురాళ్ళపల్లె రాజకీయ ముఖచిత్రాన్ని మార్చేసింది. పలుగురాళ్ళపల్లె జిల్లా పరిషత్ హైస్కూల్ కు 'కార్పస్ ఫండ్' కొరకు మూడు వేల రూపాయలు ఎవరు చెల్లిస్తే వారికే ఈసారి 'సర్పంచ్' పదవి అంటూ ప్రచారం జరిగింది. ఎన్నోరోజుల నుండి అవకాశం కొరకు ఎదురుచూస్తున్న ఔత్సాహికుల్లో 'చితాంబరామయ్య' ఆ మూడు వేలు చెల్లించాడు. అంటే అందరు కలిసి ఆయనను సర్పంచ్ పదవి వరించేటట్లు చేశారు.

### స్త్రీ వాది

పెద్దనాయన తెచ్చిన ఎద్దుల్లో ఇది ప్రత్యేకం. వచ్చిన రోజునుండి మేత తినలేదు. నీళ్లు తాగలేదు. మామూలుగా ఏ ఎద్దులైనా ఒకటి రెండు రోజులు ఇలా బెంగ పెట్టుకుంటాయి. ఎందుకంటే వీటిని నేరుగా ఆవులదొడ్డి నుండి తెస్తే వాటి మంద నుండి వేరైనందుకు, స్థలమార్పిడి జరిగినందుకు, మనుష్యులు అలవాటు లేనందుకు ఒకటి రెండు రోజులు బెంగపెట్టుకుని తరవాత మెల్లగా అలవాటు పడిపోతాయి.

ఈ ఎద్దు మాత్రం వారం రోజులైనా దారికి రాలేదు. మా నాయన ఎన్నిరకాల ప్రయత్నించినా ప్రయోజనం లేకపోయింది. పెద్దనాయన బెంగపెట్టుకున్నాడు. ఎద్దు పాల బిర్రు తగ్గిపోతూ ఉందని. ఒక రోజు అమ్మ పాలు పిండడానికి బర్రెం గుంజకు కట్టేసి వీపు నిమిరి పాలు పితుకుతూ వుంది. అమ్మ వైపు ఈ ఎద్దు చూస్తూ చెవులు అల్లాడిస్తూ, మోర ఊపుతూ వుంది. ఇది గమనించిన అమ్మ పాలు పిండడం అయిన తరువాత దాని దగ్గరకు వెళ్లి వీపు చరిచింది. అమ్మకు అప్పుడప్పుడు ఎద్దులకు మేత వెయ్యటం, నీళ్లు పెట్టడం అలవాటే. అమ్మ వీపు చరచగానే అది మహదానందపడి అమ్మను నాకటం ప్రారంభించింది. ఇది గమనించిన మా నాయన తొట్టితో నీళ్లు తెచ్చి పట్టాడు. అమ్మ తొట్టిలో నీళ్లు కలుపుతూ ఉంటే కడుపారా తాగింది.

అపుడు గుర్తొచ్చింది పెద్దనాన్నకు, ఈ ఎద్దును కొన్న ఆవుల దొడ్డిని సంరక్షించేది ఒక స్త్రీ అని. సాధారణంగా వేరేవారిని చూసే అవకాశం వీటికి ఉండదు.





అందుకే పుట్టినప్పటినుంచి స్త్రీవాది గానే ఉండిపోయింది. ఆ తరువాత కొంతకాలానికి దీన్ని అమ్మటం జరిగింది. యధావిధిగా బేండు మేళాలు, తప్పెట తాళాలతో సాగనంపారు. వెంట అందరూ ఉన్నంతవరకూ బాగానే వుండింది. ఊరి పొలిమేరలు దాటిన తరువాత దానికి అర్ధమైనట్లుంది తనను ఎక్కడికో తీసుకుని వెళ్తున్నారని. అంతే, తిరగబడింది. ఆగ్రహోదగ్రుడై లేచింది. కొన్న ఆసామి ముళ్ళ కర్రతో ఒకటి ఇచ్చినట్టున్నాడు. బడికి వెళ్లే పిల్లవాడు మొండికేసి తిరగబడ్డట్టు తిరగబడి తాళ్లు తెంచుకుని ఇంటివైపు పరుగు-తీసింది. తోక పైకి లేపి, చెవులు నిక్కరించి, మోర పైకెత్తి పరుగు తీస్తుంటే.... అపర నందీశ్వరుని లాగా కనిపించింది. ఒక్క ఉదుటున ఇంటి తలవాకిట్లో వాలిపోయింది.

అప్పుడే వాకిట్లో నుండి బయటికి వెళ్ళడానికి వస్తున్న బూబమ్మ ఈ చెలరేగిన నందిని చూసి వాకిట్లో తెలివితప్పి పడిపోయింది. అంత ఆవేశంలో కూడా ఆమెకు ఏ హానీ కలగకుండా ఆమెను దాటి ఇంట్లోకి వచ్చింది.

కొన్నవాళ్ళు వచ్చి బలవంతంగా తీసుకెళతామంటున్నారు. పెద్దనాయన సర్దిచెప్పి సాయంకాలం వరకు ఉండమన్నాడు. అమ్మ దానికి మేత, నీళ్లు పెట్టి, శాంతపరచి సాయంత్రం వాళ్లకి అప్పగిస్తే మారాం చెయ్యకుండా బుద్ధిగా వెళ్ళిపోయింది. ఎవరో ఉండి, కొన్నవాళ్ళతో,"తాడు తెంచుకుని పారిపోయే దాన్నెందుకు మళ్ళీ తీసుకెళ్లుతున్నారని, వదిలివేయచ్చుగా" అని అంటే, 'అది తాడు తెంచుకుని తిరగబడింది మాపై కోపంతో కాదు... సాకినవారిపై ప్రేమతో. రేపు మా ఇంటిమీద కూడా ఇదే ప్రేమ చూపిస్తుంది. దీనిని వదలం... ఎలాగైనా మచ్చిక చేసుకుంటాం' అన్నారు.

(ఇంకా వుంది)

.

# ఎలక్ట్రాన్

## ఆచార్యదేవోభవ



ఆకాశం చిల్లు పడేటట్లుగా అకాల వర్షం రెండు రోజులనుంచి కురుస్తోంది. ఆరేళ్లక్రితం కట్టిన ఆ కొత్త సాంకేతికకళాశాలలో పై అంతస్తుల తరగతి గదుల్లో నిర్మాణ కౌశలం లేని కారణంగా, ఆశ్రద్ధ కారణంగా, లేదా అవినీతికి నిదర్శనంగా గోడలమీద జలచిత్రాలు రూపొందాయి. పై కప్పు కాంక్రీటు చర్మంలోంచి వాన నీరు స్వేద బిందువుల్లా దిగజారి చాలాచోట్ల బల్లల్నీ, కుర్చీలనీ తడుపుతోంది. కళాశాల పాలనాధికారి కోదండం భాగస్వాములలో ఒకరు. "వర్షాలు తగ్గనీయండి, బాగులు చేయించే ఏర్పాట్లు చూస్తాను. భవనం కట్టినవారు మా బంధువర్గం లోని వారే! అందుకని గొంతుకలు చించుకొని అరిచే అవకాశమూ లేదు! ప్రయోజనమూ లేదు. మీరే ఎలాగో విద్యార్థులకి నచ్చచెప్పి కోర్సులు పూర్తిచేయించండి!" అని బాధ్యతను కళాశాల ప్రధానాచార్యణి సులోచన నెత్తిమీద పెట్టేశాడు. ఏడాదిలో ద్వితీయార్ధభాగపు పరీక్షలు నెలరోజుల్లో జరగాల్సి ఉంది. విద్యార్థినీ, విద్యార్థుల వసతిగృహాలు కళాశాల ప్రాంగణంలోనే ఉన్నా, హాజరు మట్టుకు కుండబోత వర్షాల సాకు మూలంగా పల్చబడిపోయింది. పాఠ్యాంశాలు పూర్తి కావడానికి ఇంకా పక్షం రోజులు అధమం కావాలి. పరీక్షల తయారీ కోసం విద్యార్థులు ఆనవాయితీగా కనీసం పది రోజులు తరగతులకు అనధికారమైన సెలవు తీసేసుకొంటారు. పై అంతస్థులో పది తరగతి గదులున్నాయి. వాటిలో కనీసం మూడు వందల మందికి తరగతులు జరుగుతాయి. సులోచన తరగతుల్ని సమావేశ మందిరాలకీ, ప్రయోగశాలలకీ, ఆచార్యుల గదులకీ తక్షణం మార్పించి, వసతి గృహాలకి తానే స్వయంగా వెళ్ళి విద్యార్థులను తరగతులకి హాజరు కమ్మని హితవు పలికింది. వసతి గృహాల పై అంతస్తుల్లోని గదుల్లోనూ కుండపోత వర్షం కారణంగా అదే పరిస్థితి. దిగువ అంతస్తుల గదుల్లోని వారిని పై గదుల్లోని వారికి ఆశ్రయం కల్పించవలసిందిగా కోరింది. ఆస్ట్రేలియానుంచి వచ్చి ఈ ఉద్యోగాన్ని స్వీకరించిన సులోచన రెండుసంవత్సరాల లోపుగానే కళాశాల విద్యాస్థాయీ ప్రమాణాలని ఎంతగానో అభివృద్ధి పరిచిన కారణంగా, విద్యార్థులకు ఆమె మాటమీద ఎంతో గౌరవం. అటు వసతి గృహాల్లో విద్యార్థులు సద్దుకొన్నారు. ఇటు తరగతుల హాజరు ఒక్కసారిగా పుంజుకొంది.

కళాశాల ప్రధానాచార్యణి సులోచన ఆలోచనలో పడిపోయింది. ప్రభుత్వ భవననిర్మాణాల్లో, వసతి నిర్మాణాల్లో, ప్రాజెక్టుల నిర్మాణాల్లో అవినీతి భాగోతాలు పునాదులతోబాటు పైపైకి లేస్తూనే ఉంటాయి! ఈ కళాశాల ప్రైవేటు పెట్టుబడిదారులది. నిర్మాణం స్వంతదారులది. అయినా భవన నిర్మాణంలో గుత్తేదారు హస్తం తన వాటం చూపించింది. స్వర్ణకారుడు తల్లి మంగళ సూత్రాలలో కూడా తరుగు చూపిస్తాడన్న అర్యోక్తి ఉండనే ఉంది! ఆమె ఆలోచనలకు భంగం కలిగిస్తూ, కాలేజీలో తరగతి గదుల శుభ్రతను పర్యవేక్షించే చిరుద్యోగి జోగిరాజు ప్రవేశించాడు. ఆయన ప్రాంగణంలో ఉన్న మొక్కల పెంపకం పట్లకూడా ఎనలేని శ్రద్ధ వహిస్తాడు. గతంలో ఆయన ఆ కళాశాల ప్రాంతంలోనే ఉన్న ఓ ప్రాథమిక పాఠశాలకి ప్రధానోపాధ్యాయు-

డిగా పనిచేసి పదవీ విరమణ చేశాడు. ప్రస్తుతం అరవైలు దాటిన మనిషి. సులోచనకి ఆయనంటే ఎనలేని గౌరవం. కళాశాల అభివృద్ధి విషయంలో తనకెన్నో సలహాల్నిచ్చాడు.

"కూర్చోండి. పైకప్పుల్లోంచి వర్షపు నీరు కురుస్తోందన్న సంగతిని సాధ్యమైనంతవరకూ ప్రచారం కాకుండా చూడమని కోదండంగారు అన్యాపదేశంగా చెప్పారు. మీ అధ్వర్యంలో తాత్కాలికంగా తరగతి గదుల ఏర్పాటు చక్కగా జరిగి పోయింది. గుండెబరువు తగ్గింది. ధన్యవాదాలు! వానకూడా తగ్గు మొహం పట్టింది."

"చూడమ్మా! నేనిప్పుడు పనికట్టుకొని వచ్చింది మీ గుండె బరువుని పెంచడానికే! ఎలా చెప్పాలో, ఏం చెప్పాలో తెలియటల్లేదు!" అన్నాడు జోగిరాజు.

"చెప్పండి! నేనీ కళాశాలలో అడుగుపెట్టిన రోజు నుండీ, చేపట్టిన అనేక మార్పులకు ఉపన్యాసకులను మించి మీరు చేదోడు వాదోడుగా ఉన్నారు. నిస్సంకోచంగా చెప్పండి."

"భవనాల పైకప్పుల్లోంచి నీళ్లుకారితే ఏ కొత్తరకం సిమెంట్ తోనో, లేకతారుతోనో పులిమేసి పని కానిచ్చేస్తారు! కానీ విద్యార్థుల మెదళ్లు పగుళ్లు తీస్తే ఏం చెయ్యాలి?"

"మళ్ళీ కాపీల వ్యవహారం కొత్తరూపులు కాని సంతరించుకొంటోందా?"

"మీరు తీసుకొన్న చర్యల వల్ల కాపీల భూతం వదిలిందనే అనుకోవాలి. కానీ కొత్తభూతం ప్రాంగణంలో చాపకింద నీరులా అడుగు పెట్టిందన్న సంగతి-విద్యార్థులు వసతిగృహంలో గదుల సర్దుబాటు జరుగుతున్న సమయంలో కొంత లోపాయికారిగా తెలిసింది. రెండు మూడు చిన్న జగడాలు జరిగినా వాళ్ళలో వాళ్ళే సర్దుకుపోయారు!"

"అంతకంటే మనకు కావల్సిందేముంది? బుర్రలు బద్దలుకొట్టుకోకుండా ఉంటే చాలు! లేకపోతే మన తలలు వాచిపోతాయి!"అంది సులోచన నవ్వుతూ.

"కానీ ఆ జగడాలకి మూల కారణం మాదకద్రవ్యాలు సులోచనమ్మా? కింది గదుల్లో ఉన్న యిద్దరి బల్లసొరుగుల్లోంచి కొన్ని పొట్లాలు మాయమైపోయాయి. దాని విషయమై ఘర్షణ జరిగింది. తర్వాత వాళ్ళలో వాళ్ళే సర్దుకు పోయారు. ఈ సంగతి నాకు ఓ బుద్ధిమంతుడైన విద్యార్థి ద్వారా తెలిసింది. వాళ్ళ ఘర్షణలో తలెత్తిన మరో విషయమేమిటంటే శాంతి అని మూడోసంవత్సరం చదివే విద్యార్థిని నెల తప్పి మూడు నెలలైంది. ప్రణవకుమార్ అనే నాలుగో సంవత్సరం సివిల్ విద్యార్థి దానికి కారకుడు. మాదకద్రవ్యాల మజా చేస్తున్న వారిలో అతనూ ఒకడు. రాజమండ్రిలోని ఓ ఇసుక వ్యాపారి కొడుకు. ఈ మాదక భూతాన్ని తుదముట్టించలేకపోతే కళాశాల పరువు గంగలో కలిసిపోతుంది."

"కళాశాల పరువు పోతుందన్నది ఒక విషయమైతే, అంతకు మించినది పలువురి విద్యార్థుల జీవితాలు నాశనమైపోతాయి. సిమెంటు పూతలతో, తారు పూతలతో కుదిరే తెగులు కాదిది! మహమ్మారి! ఏం చెయ్యాలి?"

నాలుగో సంవత్సరం పరీక్షలైపోగానే శాంతి విషయమై ఈ ప్రబుద్ధుడి నిర్ణయం ఎటువైపు తిరుగుతుందో చెప్పడం కూడా కష్టం. వివాహానికి దారి తీస్తే పర్వాలేదు కానీ, అతగాడు ఒకసారి అడుగు బయటకి పెట్టే కప్పదాటు వేస్తే, ఈమె ఏ అఘాయిత్యానికైనా తలపెట్టితే, తల్లిదండ్రులదగ్గర్నుంచీ, వార్తా, ప్రసార మాధ్యమాలవరకూ వేలెత్తి చూపేది కళాశాల వైపే! అందునా ఇటీవలి కాలంలో ఆత్మహత్యలకి విద్యాప్రాంగణాలు చాలా అనువైన ప్రాంతాలుగా మారిపోయాయి."

"రెచ్చగొట్టే చలనచిత్రాలతో, అందుబాటులో ఉన్న అంతర్జాలంలోని నీలి నడకలతో యువత మితిమీరిన వ్యామోహంతో తప్పటడుగులు వేయడం-నిర్భయచట్టం కింద ఉరి శిక్షలు వేసినా బలాత్కారాలు, అత్యాచారాలూ జరుగుతూనే ఉండడం నైతికవిలువల పతనానికి నిదర్శనంగా నిలుస్తున్నాయి. ప్రేమమైకంలో లేదా భ్రాంతిలో కొన్ని నెలలు లేదా

47 వ పేజీ చూడండి

# ఆదూరి హైమవతి



## దేవునికి కానుక

విదేశాలోల ఉంటున్న మనవడు వివేక్ తాతగారిని చూడాలని భారతదేశానికి వచ్చాడు. తాత సదానందం లో ఉత్సాహం ఉరకలు వేస్తున్నది. సంతోషంతో ఉబ్బితబ్బిబ్బవుతున్నాడు.

మనవడు వివేక్ కి పద మూడేళ్ళు. విదేశంలోనే పుట్టినా తెలుగుదనాన్ని పుణికి పుచ్చుకున్నవాడు. దేశ మంటే ప్రేమ, పెద్దలంటే గౌరవం, తాత అంటే అభిమానం, చక్కని చదువు- ఏ తాతకైనా అంతకంటే ఏం కావాలి? అందుకే, మనవడి పుట్టిన రోజునాడు వాడి పేరిట తమ ఊరిలో ఉన్న అన్ని ఆలయాలోలనూ పూజలు చేయించాలని సంకల్పించాడు సదానందం. వంటవాళ్ళను పిలిపించి పది రకాల 'తీపులు' చేయించాడు; పదిరకాల పండ్లు తెప్పించాడు; కంచినుండి పట్టుచీరలు, పట్టుపంచలు తెప్పించి, అన్ని ఆలయాలలోనూ దేవుళ్ళకు సమర్పించాలని నిశ్చయించాడు. అన్నీ కార్లో సర్దుకుని బయలుదేరాడు మనవడితో కల్సి.

"నాయనా! వివేక్ ! ఎంతో కాలంగా అనుకుంటూ ఉన్నానురా, నీ పుట్టిన రోజునాడు మన ఊర్లో ఉన్న అన్ని దేవాలయాలలోనూ అర్చన చేయించాలని. కానీ మీరేమో అక్కడెక్కడో ఉంటిరి! ఇన్నాళ్లకు నా కోరిక తీర్చుతున్నావు- సంతోషంగా ఉందిరా! ముందుగా మనం వెంకటరమణుని ఆలయానికి వెళ్లి అర్చన చేయిద్దాం. ఆ తర్వాత మిగిలిన ఆలయాలకు వెళ్దాం" అంటూ తమ ఊళ్ళో ఉన్న గుడుల విశేషాలు చెప్పసాగాడు సదానందం.

ఊళ్ళో జనాలందరూ రోడ్డు మీదే ఉన్నట్టున్నారు, కారు మెల్ల మెల్లగా పోతున్నది. చలి వణికిస్తున్నది. ఉదయం పదిగంటలైనా ఇంకా మంచు పూర్తిగా వదలనే లేదు. అంతలో ఒక ముసలి వాడెవరో కారుకు అడ్డం వచ్చాడు లాగుంది, డ్రైవరు అకస్మాత్తుగా బ్రేక్ వేశాడు. ముసలాయనాకి చొక్కా లేదు. చినిగిపోయిన పాత పంచ ఒకటి కట్టుకుని ఉన్నాడు. చలికి వణుకుతున్నాడు."క్షమించండిబాబూ, చూసుకోలేదు" అంటూ రోడ్డు ఆవతలికి నడిచి పోతున్నాడు. అప్పుడు చూశాడు వివేక్. చాలా మంది ముసలివాళ్ళు, ముతక వాళ్ళు రోడ్డుమీద అక్కడక్కడ కూర్చుని ఉన్నారు- కొందరు ఏవేవో చిన్న చిన్న సామానులు అమ్ముతున్నారు. కొందరు ఊరికే అడుకుంటున్నారు. ఎవ్వరికీ ఒంటిమీద సరైన బట్టలు లేవు. చలికి అందరూ వణుకుతున్నారు. అయినా ఎవరి పనిలో వాళ్ళున్నారు. "తాతయ్యా, ఇక్కడ చాలామంది తాతలు ఉన్నట్టున్నారే, కానీ ఎవ్వరికీ చలి పుడుతున్నట్టు లేదు?" అడిగాడు వాడు, తాతయ్యని.

సదానందం అన్నాడు- "కాదురా, వాళ్లని చూసుకునేందుకు ఎవ్వరూ లేరు. అందులోనూ ముసలివాళ్ళు కదా, బరువు పనులేవీ చేయలేరు. ఏదో ఇట్లా బ్రతుకుతున్నారంతే. వాళ్ల కున్న కష్టాల ముందు ఈ చలి ఏపాటి?" అని.

వివేక్ ఏమీ అనలేదు. కాసేపటికి "తాతగారూ! కారు ఆపించండి, ఓసారి" అని చెప్పడంతో డ్రైవర్ కారు ఆపాడు. వివేక్ గబగబా కారుదిగి, డిక్కీలో ఉన్న పళ్ళ బుట్ట, కొత్త బట్టలు

ఉంచిన సంచీ చేత పట్టుకుని వెనక్కి నడవటం మొదలుపెట్టాడు. వీధి వరకు ఉన్న ముసలి వాళ్లందరికీ ఆ కొత్త చీరలు, పళ్ళు, బుట్టలో ఉన్న పళ్ళ పంచి ఇవ్వటం మొదలు పెట్టాడు!

సదానందం కారులోనే కూర్చుని,మనవడిని చూస్తూఉండిపోయాడు.

అక్కడ ముసలి వాళ్లంతా విస్తుపోతున్నారు; కంగారు పడుతున్నారు-.

"బాబూ ! తమరెవరు? ఇంత ఖరీదైన బట్టలు మాకు ఇస్తున్నారే, మీ పెద్దవాళ్ళు కోపగించుకుంటారేమో! మాతో పోట్లాడతారేమో! ఇంతకీ తమరెవరు బాబూ?" అని భయం భయంగా అడుగుతున్నారు వాళ్ళు.

"నేను సదానందంగారి మనవడిని. మా తాతగారు చాలా మంచి వారు. మీకు ఇవన్నీ ఇచ్చినందుకు ఏమీ కోపగించుకోరు. దేవునికి చాలా బట్టలుంటాయి. ఆయనకు కావాలనగానే ఇచ్చేవాళ్ళు కూడా చాలా మందే ఉన్నారు. 'అయినా వీళ్లంతా ఇక్కడ చలికి వణుకుతూ ఉంటే, నాకు మాత్రం కొత్త బట్టలు తెచ్చావేంటి?' అని దేవుడు నన్ను తిడతాడు- ఎందుకు, అట్లా అవ్వటం? ఇంద తీసుకోండి, ఈ తీపులన్నీ తినండి చక్కగా" అంటూ తను తెచ్చిన తీపులన్నిటినీ పూర్తిగా ముసలి -ముతకలకు పంచేశాడు వివేక్ .

అన్నీ పంచాక, ఖాళీ బుట్టలు-సంచులతో వచ్చి కార్లో కూర్చుని "తాతగారూ ! మీకు కోపం రాలేదు కదా, నన్ను క్షమిస్తారా ? మిమ్మల్ని అడక్కుం డానే అన్నీ ఇట్లా పంచేశాను- పాపం వాళ్లని చూస్తే జాలి వేసింది మరి" అని అడిగాడు వివేక్.

అప్పటివరకూమనవడు చేసిన పని గురించే ఆలోచిస్తున్న సదానందం సంతోషంగా నవ్వాడు- "నువ్వు చేసిన పని చాలా గొప్పదిరా! నాకు కోపం ఎందుకు వస్తుంది?! సంపదలు ఉన్నా, లేకున్నా మనం అందరం ఆ భగవంతుని బిడ్డలమే. అవసరంలో ఉన్న తన బిడ్డలకు సాయంగా ఇవన్నీ అందించినందుకు కరుణామయుడైన ఆ భగవంతుడు చాలా సంతోషించి ఉంటాడు. మనని దీవిస్తాడు. నిజం! అయితే నాకు కాస్త చిన్నతనంగా ఉందిరా- '13 ఏళ్ళున్న నీకు తట్టిందే, ఈ విషయం - అది ఇన్నేళ్ళుగా నాకు ఎందుకు తట్టలేదు?' అని సిగ్గుగా ఉంది. పద, ఇక ఆ భగవంతుని దర్శిద్దాం. నీ మంచి మనసు ఇప్పుడు చేసిందే'అర్చన'. అది ఈ మధ్యకాలంలో ఆయనకు చాలా సంతోషాన్నిచ్చే కానుక అయిఉంటుంది!" అంటూ కారును ముందుకు పోనిమ్మని చెప్పాడు సదానందం.

## ప్రపంచ తెలుగు మహాసభలు

(35 వ పేజీ తరువాయి)

ముగింపు సమావేశానికి దేశ రాష్ట్రపతి రాంనాథ్ కోవింద్ ముఖ్య అతిథిగా వచ్చారు, తెలుగు భాష ప్రాశస్త్యాన్ని కొనియాడారు. అటు ప్రారంభ సమావేశంలో, ఇటు ముగింపు సమావేశలో రాష్ట్ర గవర్నర్ తెలుగులో ప్రసంగించగా ముఖ్య సలహాదారు కే.వి. రమణాచారి వ్యాఖ్యాతగా వ్యవహరించారు. ఇటీవలే తెలంగాణా సాహిత్య అకాడమీ ఛైర్మన్ గా ఎన్నుకోబడిన శ్రీనందిని సిద్ధారెడ్డి ఆధ్వర్యంలో ప్రపంచ తెలుగు మహాసభలు నిర్వహించబడ్డాయి. అలాగే గ్రంధాలయ పరిషత్ ఛైర్మన్ శ్రీ అయాచితం శ్రీధర్ గారు, పలువురు కవులు నిర్వహణ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొన్నారు. ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి, స్పీకర్ మధుసూదనాచారి, దేవాదాయ శాఖ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి ఇంకా పలు శాఖల మంత్రులు ముఖ్యమంత్రి శ్రీ కేసీఆర్ తలపెట్టిన బృహత్ కార్యక్రమాన్ని సఫలీకృతం చెయ్యడానికి తమ శాయశక్తులా కృషిచేశారు. కొన్ని లోటుపాట్లను పక్కన పెడితే తెలంగాణా ఖ్యాతిని నిలబెట్టేందుకు ఏర్పాటు చేయబడిన సభలు ఘనంగానే జరిగాయని చెప్పవచ్చు.

'వాధూలస'

9701522234

# ప్రహేళిక

## జవాబు చెప్పగలరా?

ఈ క్రింది వాక్యములోని ప్రతి అక్షరము, అసలు అక్షరమునకు బదులు వేరే అక్షరము వాడబడినది. ఉదాహరణకు, 'క' అనే అసలు అక్షరం బదులు 'ర' అనే అక్షరం వాడారని మీరు అనుకుంటే, వాక్యంలో ఎక్కడ 'క' వచ్చినా అది 'ర' అక్షరం మాత్రమే అవుతుంది. వత్తులు, గుణింతాలు అన్నీ అన్వయిస్తాయి.

మీరు చెయ్యవలసినదల్లా అసలు వాక్యాన్ని కనుక్కోవడమే. ప్రయత్నించండి.

ఈ రా లం కు జ జుం యి లం ఖు జి లి గం కంపుంయి లీ దా ష్గి చు

ల్డో రం కై జ మి టా ష్గి జుంయి ఖు హి ఖూ డో రం కు జం పుం యి శ

ఛ్దో రాం ఖో ఫి క శో ఫి జుం యి త హ జాం ఫో డో ర టుం వేగె నం

నా రూ డం ర ఛ త్రె ద్రు ఖంనుడు హి హే ర ఖ్గచ్క చం తా ద టు డ్

( ఆధారం : యు = డ )

(మీ జవాబు teega51@ gmail. com కి పంపించండి.)

**గతవారం జవాబు :**

కమలములు నీట బాసిన కమలాప్తుని రశ్మి సోకి కమలిన భంగిన్ తమతమ
నెలవులు దప్పిన తమ మిత్రులె శత్రులౌట తధ్యము సుమతీ

పంపిన వారు : శ్రీ వేమూరి వేంకటేశ్వరరావు , USA

# కొత్త రామానందం

విశ్రాంత బ్యాంకు ఉన్నతాధి కారి




# కలియుగ వరదుని మకరజ్యోతి దర్శనం

అయ్యప్ప స్వామి దర్శనం అద్భుత దర్శనం. నలభై రోజుల కఠోర దీక్షతో మనసునూ, తనువునూ పరిశుద్ధం చేసుకుని అయ్యప్పను దర్శిస్తే కలిగే ఆధ్యాత్మిక అనుభూతి అపురూపం - అమోఘం. నలభై రోజులు సర్వసంగ పరిత్యాగియై దీక్ష చేసి స్వామి పాదాలను శరణన్న భక్తులను అనుగ్రహించి తన వద్దకు రప్పించుకుని ఆశీర్వదించి పంపే హరిహర సుతుడు.

తిరువాన్కూర్ దేవస్థానం యాజమాన్యం క్రింద ఉన్న శబరిమల ఆలయంలో మండల పూజ, మకర విళక్కు, విషు, ఓణం అన్నవి విశేషమైన పూజాదినాలు. మండలపూజ 16 వ తేదీ నుండి డిసెంబరు 26 వ తేదీ వరకు జరుగుతుంది. మకర సంక్రాంతి (జనవరి 14) నాడు మకరవిళక్కు అంటే మకరజ్యోతి దర్శనం. ఏప్రిల్ నెలలో విషు, సెప్టెంబర్ లో ఓణం నాడు ప్రత్యేక పూజలుంటాయి.

అయ్యప్ప చరితం కొంత పౌరాణికం, కొంత చారిత్రకం. అత్రి మహర్షికి, అనసూయాదేవికి పుట్టినవాడు దత్తాత్రేయ మహర్షి. దత్తుడు త్రిశక్తుల అంశతో జన్మించిన లీలావతిని వివాహం చేసుకున్నాడు. లీలావతి, తనకు ఇంకా ఇహలోకపు సుఖాలమీద మనసు తీరలేదని, మానవరూపంలోనే ఉండిపోతానని భర్తతో చెప్పగా, 'నువ్వు మహిషివి అయిపోతావు' అని దత్తాత్రేయులవారు భార్యకు శాపం ఇచ్చాడు. మహిషిగా మారాక లీలావతి గతం అంతా మరచిపోయి పరమ దుర్మార్గంగా ప్రవర్తించడం మొదలుపెట్టి దేవతలను బాధపెట్టసాగింది. మహిషి, బ్రహ్మకి ఘోరమైన తపస్సు చేసి, తనకు చావు లేనట్టుగా వరాన్ని కోరుకున్నది. అలా కుదరదన్నాడు బ్రహ్మ. పోనీ శివుడికి, విష్ణువుకి పుట్టే బిడ్డ ద్వారా మాత్రమే తనకు మరణం సంభవించేలా వరమివ్వమంది. ఇద్దరు పురుషులకు బిడ్డ పుట్టడం అసంభవమని ఆమె భావన. బ్రహ్మ తథాస్తు అన్నాడు.

దితి బిడ్డలయిన దానవులూ, అతిది బిడ్డలయిన దేవతలూ కలిసి మందర పర్వతాన్ని కవ్వంగా, వాసుకి అనే మహాసర్పాన్ని తాడుగా చేసుకుని సాగర మథనం మొదలుపెట్టారు. హాలాహలం, కల్పవృక్షం, కామధేనువు, ఐరావతం మొదలైనవి పుట్టుకొచ్చాయి. చివరగా అమృతం వచ్చింది. దితి బిడ్డలు అన్యాయంగా అమృత భాండాన్ని చేజిక్కించుకున్నారు. అది తిరిగి దేవతలకు దక్కేందుకు విష్ణువు ఓ పథకాన్ని రచించాడు. మోహినీ అవతారాన్ని ధరించి రాక్షసుల మధ్య కలహాన్ని సృష్టించాడు. రాక్షసులు మోహినీ మాయలో పడిపోగా దేవతలకు అమృతం దక్కింది.

ఈ విషయం గురించి విన్న పరమశివుడు మోహినిని చూడాలని ఉత్సుకత చూపించాడు. విష్ణువుని మోహినిగా చూసిన పరమశివుడు మోహావేశ పరవశుడయ్యాడు. అందుకు ఫలితమన్నట్టు ఓ మగబిడ్డ. ఆ బిడ్డడి మెడలో

ఓ మణిమాలను తగిలించాడు పరమశివుడు. హరిహరులు ఆ బిడ్డను పంబా నది తీరంలో వదిలి వెళ్లారు. ఆ బిడ్డ ఎవరికోసమో ఎదురుచూస్తున్నట్టుగా ఉంది.

వేటకోసమై పంబానదీ తీరానికి పందళరాజు రాజశేఖర పాండ్య వచ్చాడు. అలా నదీతీరంలో వెడుతున్న పందళరాజుకు పసిబిడ్డ ఏడుపు వినిపించింది. వెంటనే ఆ ఏడుపు వస్తున్న దిక్కుకి వెళ్లి, అక్కడ ముద్దులొలికే పాపడిని తన చేతులతో ఎత్తుకుని ముద్దాడాడు. తన హృదయానికి హత్తుకున్నాడు.

ఒక మునీశ్వరుడు ఆ రాజుగారి ఎదుట ప్రత్యక్షమయి, "రాజా! నీకు సంతానం లేదన్న విచారాన్ని పోగొట్టేందుకే ఈ బిడ్డ ప్రత్యక్షమయ్యాడు. ఈతని మెడలో మణిమాల ఉండడం వల్ల మణికంఠుడని పేరు పెట్టి పెంచుకో. ఈ బిడ్డడికి పన్నెండేళ్ళు వచ్చినపుడు ఇతడు ఎవరన్న సంగతి నీకు తెలుస్తుంది" అని చెప్పి, మునీశ్వరుడు అదృశ్యమయ్యాడు. తనకు దైవమిచ్చిన వరపుత్రునిగా భావించి తన రాజమందిరానికి తీసుకుపోయి మణికంఠుడు అని నామకరణం చేసి అల్లారు ముద్దుగా పెంచుకున్నాడు రాజు.

మణికంఠుడికి పన్నెండేళ్ళు రాగానే అతనికి యువరాజుగా పట్టాభిషేకం జరపాలని నిర్ణయించాడు. రాణికి ఈ తంతు నచ్చలేదు. కన్నకొడుకు ఉండగా, అడవిలో దొరికినవాడికి పట్టాభిషేకమా? అంటూ ఆ మహోత్సవాన్ని ఎలాగైనా అడ్డుకోవాలన్న ప్రయత్నం మొదలెట్టింది. ఆమె ఆలోచనలకి మంత్రి కూడా తోడయ్యాడు. రాణితో కలిసి మంత్రాంగం నడిపి, తలనొప్పి వచ్చినట్టుగా నటించమని ఆమెతో చెప్పాడు. ఆమె తలనొప్పి ఎన్ని రకాల వైద్యాలకూ లొంగలేదు. మంత్రి చేతిలో కీలుబొమ్మ అయిన ఆస్థాన వైద్యుడు, 'రాణీగారి తలపై పులి పాలను పూస్తే జబ్బు నయమవుతుంది అని చెప్పాడు. నేను పులిపాలను తీసుకువస్తాను అని మణికంఠుడు చెప్పాడు.

మణికంఠుడు తలపై పూజాద్రవ్యాలు ఒక ముడిలోనూ, ఆహార పదార్థాలు మరో ముడిలోనూ కట్టుకుని ఇరుముడిని తలపై పెట్టుకుని కాలినడకన పులి పాలకోసం అడవికి బయలుదేరాడు. లోకకల్యాణ సమయం ఆసన్నమయింది. దేవతలు మణికంఠుని ప్రార్థించారు. మణికంఠుడు మహిషితో యుద్ధానికి తలపడ్డాడు. ఆమెను శరాఘాతాలతో, ముష్టియుద్ధ నైపుణ్యంతో ఎదిరించి చివరకు పీక నులిమి క్రింద పడేశాడు. క్రింద పడిన మహిషి అళదామేడు పర్వతంగా మారి క్షణక్షణానికి పెరిగిపోవటం మొదలెట్టింది. దానిపై ఒక బండ పడవేసి దానిపై తాండవమాడి మణికంఠుడు ఆ రక్కసిని చంపేశాడు. వెంటనే ఆమె రాక్షస రూపం పోయి, అందమైన కన్యగా మారిపోయింది. 'మీ పాదధూళి నాపై పడినందువల్లనే, నేను ధన్యురాలి నయ్యాను. మీరు నన్ను పెళ్లి చెసుకోవాలి అని చెప్పి నమస్కరించింది.

ఇది ధర్మశాస్త్ర అవతారమనీ , ఈ అవతారంలో తాను బ్రహ్మచర్య దీక్షను ఆజన్మాంతం పాటిస్తానని అన్నాడు మణికంఠుడు. ఆమె వినలేదు. అప్పుడు మణికంఠుడు 'నువ్వు ఇక్కడే మాళికాపురోత్తమ్మ అనే దేవతగా నాతోబాటు పూజలు అందుకుంటావు. నాకోసం ప్రతి సంవత్సరం దీక్షలో ఉన్న భక్తులు వస్తూవుంటారు. మొదటిసారి దీక్షలో వచ్చే భక్తులను కన్నెసాములు అంటారు. ఏదైనా సంవత్సరంలో ఏ ఒక్క సామీ నా దర్శనానికి రాకపోతే అప్పుడు నిన్ను నేను పెళ్లిచేసుకుంటాను' అని అంటాడు అయ్యప్ప (మణికంఠుడు). కన్నెసాములు, అయ్యప్ప దర్శనం తర్వాత తాము వచ్చినట్టుగా సూచిస్తూ, కొబ్బరికాయలను మాళీకా పురో త్తమ్మ గుడి చుట్టూ దొర్లిస్తారు. 'ఈ సంవత్సరం కూడా ఇంతసంఖ్యలో కొత్త భక్తులు వచ్చారే' అని ఆమె నిరాశ పడుతుంది.

మహిషి సంహారం తర్వాత మణికంఠుడు పులిపాలకోసం

చూసాడు. దేవతలు పులుల రూపంలో వచ్చారు. ఇంద్రుడు ఒక పులిగా, ఆ పులిమీదే సవారి చేస్తూ మణికంఠుడు పందళనగ-రానికి తిరిగి వచ్చాడు. అందరూ ఆనందభరితులయ్యారు. రాణి, మంత్రి పశ్చాత్తాపబడ్డా-రు. మణికంఠుడికి పన్నెండే-ళ్ళు నిండడంతో దైవ నిర్ణయాన్ని అనుసరించి అతని జన్మవృ-త్తాంతం ఏమిటో అందరికీ వెల్ల-డయింది. తనకు రాజ్యాధికారం మీద మమకారం లేదని చెప్పాడు మణికంఠుడు. ఒక బాణం వదిలి, అది ఎక్కడ పడితే, అక్కడ తనకు గుడి కట్టించాలని చెప్పాడు. బాణం శబరిమలలో పడింది. అక్కడే పందళరాజు కట్టించిన గుడిలో మణికంఠుడు తపోము-ద్రలో ఆసీనుడై భక్తుల పాలిట కల్పతరువైనాడు. సుమారు అర్ధ శతాబ్దం క్రితం ఆ గుడికి మరమ్మ-త్తులు చేశారు. ఇప్పుడు గుడికి బంగారు తాపడం కూడా చేశారు.

శబరిమలలో వంశ పారం-పర్య ముఖ్య పూజారిని తాంత్రి అని పిలుస్తారు. వీరిని పరశు-రాముడు పూజకొరకు ఆంధ్రా లోని కృష్ణా జిల్లా నుండి తీసు కెళ్లారని చెబుతారు. శబరి-మల దేవాలయంలో పూజలు జరిపించడానికి మోవిశాంతి-ని (పూజారి) ప్రతి సంవత్సరం లాటరీ ద్వారా ఎన్నుకుంటారు.

అయ్యప్ప దీక్షలో ఉన్నవాళ్ళం-దరూ అయ్యప్పతో సమానమే అన్న భావన అందరికీ ఉండాలి. అయ్యప్ప నామాన్ని సతతం మననం చేసుకుంటూ అతి పవిత్రంగా ఉండాలి. అయ్యప్ప తత్వంలో అన్ని మతాల బోధలూ అంతర్లీనంగా ఉన్నాయి. 41 రో-జులపాటు కఠోర మైన నియమ నిష్టలను పాటించాలి. వినాయక గుడి లేదా అయ్యప్ప గుడిలోనో గురుస్వామి ద్వారా దీక్ష తీసుకో-వాలి. రుద్రాక్షలతో గానీ, తులసి పూసలతో గానీ చేసిన మాలను గురుస్వామి ధరింపజేస్తారు. దీక్ష తీసుకున్నవారు నల్లని దుస్తుల-నే ధరించాలి. అయ్యప్ప భక్తు-లకు శని బాధ ఉండదు. దీక్ష సమయంలో సత్యమే పలకాలి. శాంతంగా ఉండాలి. బ్రహ్మచ-ర్యాన్ని పాటించాలి. శాఖాహా-రాన్ని తీసుకోవాలి. ఒక్క పూటే భోజనం చేయాలి. రాత్రి పూట పండ్లు, ఫలహారాలు మాత్రమే భుజించాలి. దీక్ష తీసుకున్నవారు తెల్లవారుఝామున, సూర్యాస్త-మయం తర్వాత స్నానమాచరిం-చాలి అన్నది మరొక నియమం. తాంబూల సేవనం చెయ్యకూ-డదు. పాదరక్షలు ధరించరా-దు. నేలమీద, పరుపు, దిళ్లు లేకుండా చాపపై నిదురించా-లి. ప్రతివారిని స్వామి అని, బా-లికల్ని, స్త్రీలను 'మాత' అని, భార్యని మాళికాపు రత్తమ్మ అని సంబోధించాలి. దీక్షలో ఉన్న అయ్యప్ప భక్తులు తమ శక్తి కొద్దీ అయ్యప్పలకు భిక్ష పెట్టాలి.

దీక్షలో ఉన్న భక్తులు ఎప్పుడూ విభూతి, చందనం, కుంకుమ బొట్టు ధరించాలి. ఇళ్లల్లో మృతాశౌచం వస్తే, భక్తులు అక్కడికి వెళ్ళరాదు. ఒకవేళ వెళ్ళవలసివస్తే, గురుస్వామి చేత మాలను తీయించి స్వామి పటానికి వెయ్యాలి. ఆ సంవత్స-రం శబరీ యాత్ర చేయకూడదు. దీక్షలో ఉన్నపుడు పగలు ఎంత-మాత్రం నిద్రించకూడదు.

ఈ నియమాలను శ్రద్ధ-గా పాటించి దీక్ష చేయడం వలన భక్తుల శారీరక మానసిక మాలి-న్యాలు తొలగిపోతాయి. మండల రోజులు అహంకార మమకారాలు వదిలి ఒక యోగిలా జీవించడం వల్ల ఎంతో మానసిక ప్రశాంతత కలుగుతుంది.

శబరిమలై యాత్రకు ముందుగా 'కిట్టునీర' అనే తంతు ఉంటుంది. అంటే ఇరుముడి నెత్తిమీద పెట్టుకుని యాత్రకు బయలుదేరడం. స్వామి వారు పులిపాలకై అడవికి బయ-లుదేరినప్పుడు, స్వామి తండ్రి అతనికి పూజాద్రవ్యాలు, దారిలో తినుటకు అవసరమైన తిను-బండారాలు రెండు భాగాలుగా ఉన్న మూటగా కట్టి ఇచ్చాడు. అయ్యప్ప భక్తులు కూడా అదే-విధంగా ఇరుముడి కట్టుకు-ని తలమీద పెట్టుకు వెడతారు.

అయ్యప్పలు శబరియాత్ర రెండు విధాలుగా చేస్తారు. 1) పెదపాదం 2) చినపాదం. పెదపాదం అంటే

80 కి.మీ. అరణ్యమార్గాన్ని కాలి నడకన ప్రయాణించి పంబ చేరుకోవడం, అక్కడనుంచి సన్నిధానానికి 7 కి.మీ. కాలిబాట ఉంది. పంబ నదిలో స్నానం చేసి ఇరుముడిని తలపై ఉంచుకుని, సన్నిధానానికి పయనమవుతారు. నీలిమలై ఎక్కి శబరిపీఠం చేరుకుంటారు. 7 కి.మీ. నడచి శరమ్ కుత్తి అనే ప్రదేశంలో తమతో తెచ్చుకున్న బాణం గుచ్చుతారు. అక్కడినుంచి ఒక కి.మీ. దూరంలో సన్నిధానం ఉంటుంది.

40 రోజులు దీక్ష చేసి ఇరుముడి ధరించినవారికి మాత్రమే పదనెట్టాంబడి (18 మెట్లు) ఎక్కే అర్హత ఉంటుంది. ఇరుముడి లేనివారిని ఎక్కనియ్యరు. ఇక్కడ చాలా రద్దీగా ఉంటుంది. తొక్కిసలాటలో పడిపోయే అవకాశం ఉంది. మెట్లు ఎక్కిన తరువాత సన్నిధానానికి ప్రదక్షణ లాగా కట్టిన వరుసను దాటి స్వామివారిని దర్శించుకోవచ్చును. భక్తుల రద్దీ ఎక్కువగా ఉంటుంది కనక రెప్పపాటు కాలం మాత్రమే స్వామిని దర్శించుకోగలం. ఆ బాలకంఠుని దివ్య మంగళ రూపాన్ని దర్శించుకున్న ఆ క్షణం అమూల్యం! అద్భుతం! అపూర్వం! పక్కనే ఉన్న మాలికాపురత్తమ్మ ఆలయానికి వచ్చి అక్కడ కొబ్బరికాయలను గుడి చుట్టూ దొర్లించుతారు. అమ్మవారికి పసుపు కుంకుమ, రవికల గుడ్డ సమర్పించి, వాటినే ప్రసాదంగా తిరిగి తెచ్చుకునే సంప్రదాయం ఉంది. ఇక గురుస్వామి అందరి ఇరుముడులను విప్పి నేతితో నింపిన కొబ్బరికాయలలో ఉన్న ఆవు నెయ్యి వేసి, ఒక గిన్నెలో పోసి స్వామివారిని అభిషేకించడానికి రుసుము చెల్లించి అభిషేకం చేయించి మనకు ఇచ్చిన నేతిని, చిన్న స్టీలు డబ్బాలో వేసి ప్రతి అయ్యప్పకు గురుస్వామి ఇస్తారు. దానిని ప్రసాదంగా ఇంటికి తెచ్చుకుంటాం.

**మకరజ్యోతి దర్శనం**

శబరిమలలో యాత్రికుల దీక్షకు ముగింపుకు సూచనగా రెండు ముఖ్య సంఘటనలు జరుగుతాయి. జనవరి 14వ తేదీ నాడు స్వామివారి ఆభరణాలు పందళ సంస్థానం నుంచి శబరిమల చేరుకుంటాయి. మూడు పెట్టెలలో పండలం నుండి 84 కి.మీ. అడవులలో నడుచుకుని మోసుకువస్తారు. ఈ ఆభరణాలు తేవడానికి పందళంలో భాస్కరన్ పిళ్ళై వారి కుటుంబం ఉంది. వీరు మొత్తం 11 మంది 65 రోజులు దీక్షలో ఉండి తిరువాభరణాలను శబరిమలకు మోసుకువస్తారు. ఆభరణాల వెంట పందళరాజు వారసులతో పెద్దవాడు కత్తి పెట్టుకుని నీలిమలై వరకు వచ్చి అక్కడ విశ్రమిస్తారు. వీరందరూ పదనెట్టాంబడి ఎక్కి తంత్రికి అప్పగిస్తారు. ఇరుముడి లేకుండా ఎక్కుతారు. ఎక్కవచ్చు.

సాయంత్రం ఆరున్నర ప్రాంతంలో ఆకాశంలో నక్షత్రాలు కనబడగానే 'స్వామియే శరణం అయ్యప్ప' అంటూ శరణుఘోష పెడుతుండగా, దూరంగా ఉన్న పొన్నాంబలమెట్టులో మకరజ్యోతి దర్శనం ప్రారంభమవుతుంది. కాంతిమల శిఖరంపై ఉన్న స్వర్ణమందిరం నుండి స్వామి జ్యోతిరూపంలో సాక్షాత్కరిస్తారు. ముందుగా ఆకాశంలో ఉత్తర నక్షత్రంగా ప్రకాశిస్తూ కొంచెం కొంచెంగా పెద్దదై జ్వాలగా వెలిగి కొద్ది సమయములోనే అదృశ్యమౌతుంది. మనకు ఒక సంవత్సరం అంటే దేవతలకు ఒక రోజుతో సమానం. కనుక దేవతలు ప్రతిరోజూ ఇచ్చే సంధ్యాహారతి మనకు సంవత్సరానికి ఒకరోజు మకరజ్యోతి లాగా దర్శనమిస్తూ ఉన్నట్టు పండితుల అభిప్రాయం. ప్రతి అయ్యప్ప భక్తుడు అలౌకిక ఆధ్యాత్మిక అనుభూతిని పొందుతూ ముందుకు సాగుతాడు. అదే శబరిమల యాత్ర విశిష్టత.

అయ్యప్ప భక్తజన వత్సలుడు. ఆయన అనుగ్రహం ఉంటే మనం సాధించలేనిదంటూ ఏమీ లేదు. ఆయనకు ఒకసారి దర్శించుకున్న భక్తులు మళ్ళీ మళ్ళీ ఆయన దర్శనం కోసం మరొక సంవత్సరం ఎప్పుడు వస్తుందా అని ఎదురు చూస్తుంటారు. అదీ ఆయన మహిమ!

ఓం స్వామియే శరణం అయ్యప్ప!

**జ్యోతి దర్శనం 14 జనవరి 2018**

## ఆచార్య దేవోభవ

(39 వ పేజీ తరువాయి)

సంవత్సరాలపాటు ఇచ్ఛాపూర్వకంగా స్వేచ్ఛ పేరిట శరీరాన్నప్పగించి, అవతలివాడు మొండిచెయ్యి చూపించిన తర్వాత బలాత్కారం చేసాడంటూ పోలీసు స్టేషన్లలో ఫిర్యాదులు చేసే మనస్తత్వం బలాత్కారం నిర్వచనాన్నే మార్చేస్తోంది. వివాహవ్యవస్థని దారుణమైన దెబ్బ తీస్తోంది. ఇది అమ్మాయిలు గ్రహించవలసిన విషయం. మాదకద్రవ్యాల మత్తుకు బానిసల్ని చేస్తూ, అశ్లీలదృశ్యాలలో ఇరికించి ఫోటోలు తీసి బెదిరించడం సామాన్యమైపోయింది. ఇలా ఆలోచిస్తూ, బాధపడ్తూ కూర్చుంటే జరిగేదేమీ లేదు. ముందస్తుగా శాంతి సంగతి ఆలోచించాలి."

సులోచన కంప్యూటర్ లో శాంతి వివరాలు బయటకి లాగింది. ఏలూరు మండల ఆఫీసులో మధ్యస్థాయిలో పనిచేస్తున్న మాధవరావు కూతురు. తల్లి పేరు వసంతమ్మ. ఎంసెట్ ప్రవేశ పరీక్షల్లో మంచి ర్యాంకే వచ్చింది. కెమికల్ లో చేరినప్పట్నుంచీ ఇంతవరకూ జరిగిన అయిదు సెమిస్టర్లలోనూ మంచి మార్కులే వచ్చాయి. మనిషి మధ్యస్థంగా, మామూలుగా ఉంది. అందంగా లేకపోయినా వికార రూపం మట్టుకు కాదు. శాంతి ఇందిరా బ్లాక్ 101 లో ఉంటుంది. ఆమె రూమ్మేట్ నందిని. ఆమె కూడా కెమికలే."

సివిల్ ఇంజనీరింగ్ చదివే ప్రణవకుమార్ జోగిరాజు చెప్పినట్టుగా రాజమండ్రిలోని ఓ యిసుక వ్యాపారి ధనంజయ కొడుకు. తల్లి అనసూయ. ఎంసెట్ ర్యాంక్ ఎనభైవేలకు పైగానే. యాజమాన్యం కోటాలో రెండు లక్షలు కట్టి చేరాడు. ఇది అతని ఆఖరి సెమిస్టర్. మొదటి సంవత్సరంలో ఒకసారి, మూడో సంవత్సరంలో ఒకసారి సెమిస్టర్ పరీక్షల్లో నాలుగు సబ్జెక్టలో తప్పాడు. తిరిగి సప్లిమెంటరీలలో గట్టెక్కాడు. మనిషి చూడ్డానికి బాగానే ఉన్నాడు. డిజైనర్ గెడ్డం. ఎవరో టీవి యాంకర్లా కనబడ్తున్నాడు. ఇద్దరి ఫోటోల్నీ జోగిరాజు చూశాడు. "ఈ గెడ్డం విద్యార్థి కనిపిస్తోనే ఉంటాడు. చుట్టూ నలుగురైదుగురు స్నేహితులు వెంబడిస్తోనే ఉంటారు. ఈ అమ్మాయిని చూసినట్లే ఉన్నా ఇంతమందిలో ఫలానా అని గుర్తించడం కష్టం. మొన్నటి రోజున జరిగిన వాదులాటలో 'ఈమెను గర్భవతిగా చేసినట్లు' ప్రణవ కుమార్ గొప్పలు చెప్పాడని నా సమాచారం. ముందస్తుగా ఈమె నుంచి మనం నిజం బయిటకు లాగాలి."

" ఆమె రూమ్మేటు నందినిని ప్రశ్నించి లాభం లేదు. అనవసరంగా స్పర్థలు రేగుతాయి. మీరు ఈ విషయమై ఎవరితోనూ ప్రస్తావించవద్దు. నా అంతటా నేనుగా స్వతంత్రించి ఏ విధమైన ప్రణాళికా రచించలేను. ఇప్పుడే పోయి కోదండం గారితో మాట్లాడతాను. ఆయన దృష్టిలోకి తీసుకువెళ్లి, ఏం చెయ్యాలీ అన్నది ఆలోచిస్తాను."

ఆ సాయంత్రం విద్యార్థిని వసతి గృహాల వార్డెన్ సుశీలా రాఘవన్ ఆఫీసు గదిలో ఇద్దరు లేడీ డాక్టర్లు, నలుగురు నర్సులు మొత్తం నూట ఏభై విద్యార్థినుల కందరికీ జనరల్ చెకప్ పేరిట రక్తపు పోటు కొలిచి, రక్త, మూత్రాలు సేకరించారు. కళ్లూ, నాలికా పరిశీలించి చూశారు. పరీక్షల ఒత్తిళ్ళకి గురికావొద్దని ఓ నలభై మందికి సలహాలిచ్చారు. కొంతమందికి బహిష్టు సమస్యలున్నట్టు గుర్తించి మాత్రలు రాసిచ్చారు. విద్యార్థినులకెవ్వరికీ అనుమానం కలగలేదు.

మర్నాడు ఉదయం తొమ్మిదింటికల్లా పరీక్షలు గావించిన ఇద్దరు డాక్టర్లలోనూ ఒకామె వచ్చి సులోచనకు రిపోర్టులు అందజేసింది. ఆ సమయానికి కోదండం కూడా సులోచన గదికి వచ్చి డాక్టరుకోసం ఎదురు చూస్తూ కూర్చున్నాడు. డాక్టరు ఇద్దరితోటీ ఓ అరగంట మాట్లాడి, కోదండం అందించిన 25 వేల చెక్ అందుకొని వెళ్లిపోయింది.

(మిగిలినది వచ్చే సంచికలో)

# జనార్దన ఠాకూర్

## జనవరి 2018 లో మీ రాశి ఫలాలు



9963933371, 9490189713

జనవరి లో : రవి 13 వరకు ధనుస్సులో తదుపరి మకరంలో; బుధుడు 5 వరకు వృశ్చికంలో, 6 నుండి 27 వరకు ధనస్సులో తదుపరి మకరంలో; శుక్రుడు 12 వరకు ధనుస్సులో తదుపరి మకరంలో; కుజుడు 15 వరకు వృశ్చి కంలో, తదుపరి ధనుస్సులో; గురువు తులలో; శని ధనస్సులో; రాహువు కర్కాటకంలో; కేతువు మకరం లో సంచారం

**మేష రాశి:**

అధిక ఖర్చులవలన ఆర్థిక స్థితి బాగుండదు. కుటుంబంలో చికాకులు. శరీర రుగ్మత వలన వైద్య సహాయం అవసరం. ముఖ్యంగా కుటుంబంలో పెద్దవారి ఆరోగ్యం పట్ల శ్రద్ధ అవసరం. ఉద్యోగ స్థలంలో సాటి ఉద్యోగులవలన చికాకులు ఎదురుకొందురు. మాసం ద్వితీయార్థంలో కోర్ట్ లావాదేవీలలో విజయం పొందుతారు. రాజకీయ రంగంలో ఉన్నవారికి శుభసమయం. సంఘంలో గౌరవ మర్యాదలు పొందుతారు. వ్యాపారులకు సామాన్యంగా ఉండును. పై చదువులకై ఎదురుచూచువారు శుభఫలితాలు పొందుతారు.

వైదిక సూచన:

1) దశరథ కృత శని స్తోత్రం నిత్యం చదువుట,
2) అమ్మవారికి శుక్రవారం నేతిదీపం పెట్టుట,
3) కాశిలో గంగాస్నానం చేయుట ద్వారా ప్రతికూల గ్రహస్థితి నుండి ఉపశమనం కలుగును.

**వృషభరాశి:**

ఆర్థిక ప్రణాళిక ప్రకారం నడచుకోనిచో అధిక ఖర్చులవలన ఇబ్బంది కలుగును. సమయంలో కంటి పరీక్షలు నిర్వహించవలెను. బంధువులతో జాగ్రత్తగా మెలగవలెను, లేనిచో కుటుంబ సౌఖ్యం కోలుపోవుదురు. స్నేహితులతో ఆచితూచి మాట్లాడుట మంచిది. ఉద్యోగస్తులకు తమ ఆశయాలు నెరవేరును. పదోన్నతి పొందగలరు. వ్యాపారస్తులకు అనుకూల సమయం. ప్రత్యేకంగా ముద్రణా రంగంలో ఉన్నవారికి మరియు రచయితలకు అనుకూల సమయం. విద్యార్థులకు అనుకూలం. ముఖ్యంగా ఉద్యోగం కోసం ప్రయత్నం చేసేవారికి మరియు ఉన్నత చదువులకు ప్రయత్నం చేసేవారికి శుభవార్తలు వినే అవకాశం.

వైదిక సూచన:

1) సోమవారంనాడు శివాలయ సందర్శనం,
2) చతుర్దశి నాడు గణపతి దేవాలయ సందర్శనం,
3)బిల్వాష్టకం నిత్య పారాయణం చేయుట ద్వారా ప్రతికూల ఫలితాల నుండి ఉపశమనం లభించును.

**మిథున రాశి:**

ఆర్థిక పరిస్థితి బాగుండును. నూతన వస్తువులు కొనుగోలు చేయుదురు. చిన్న చిన్న ప్రమాదాలకు గురికావచ్చు. గృహంలో శుభకార్యాలు జరగవచ్చును. గృహవాతావరణం అనుకూలం. ఉద్యోగస్తులకు అనుకూలసమయం. పై అధికారులసహాయంలభిస్తుంది. కోర్ట్ వ్యవహారాలు మరియు వ్యాపారం సాఫీగా సాగుతుంది. స్థిరాస్తి కొనుగోలు చేసే అవకాశం.

వైదిక సూచన:

1) సంకటహర చతుర్థి నాడు ఉపవాసనియమము పాటించుట,
2) నవగ్రహ స్తోత్రం చదువుట,
3) తులసిదళములతో విష్ణుమూర్తి అర్చన ద్వారా శుభ ఫలితాలు పొందుతారు.

**కర్కాటక రాశి :**

ప్రతి విషయములో జాగ్రత్త వహించవలెను.

అనారోగ్యముతో బాధపడువారికి కొంత ఉపశమనం లభించును. స్పెకులేషన్ కు కొంతకాలం దూరంగా ఉండవలెను. మీ విపరీత ప్రవర్తన వల్ల గృహములో సౌఖ్యం కోల్పోతారు. ఉద్యోగస్తులు సహచరులతో జాగ్రత్తగా మెలగవలెను. మాసామ్ అంతములో మేలు జరుగును. కోర్ట్ వ్యవహారం అనుకూలంగా వుండదు. వాయిదా వేయుట మంచిది. వ్యాపార వ్యవహారాలు ప్రణాలికా బద్ధంగా జరుపవలెను, లేనిచో నిరాశ కలుగును.

వైదిక సూచన:

1) శ్రీ లలితాసహస్రనామం పఠనం,

2) ఆదివారంనాడు గోధుమల దానం,

3) మంగళవారం నాడు శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయ దర్శనం ద్వారా ప్రతికూల ఫలితాలు తగ్గును.

**సింహ రాశి:**

ఆర్థిక స్థితి అనుకూలంగా వున్నా అధిక ఖర్చుల వలన మరియు స్పెక్యులేషన్ ద్వారా చికాకులుకల్గును.ఉదర సంబంధిత వ్యాధి వలన బాధపడుదురు. జీవిత భాగస్వామితో మాట పట్టింపులు ఉండును. స్నేహితుల మరియు బంధువుల సహాయంతో సమస్యలనుండి బయటపడుడురు. ఉద్యోగస్తులు పైవారి వలన లాభం పొందుతారు. వ్యాపారస్తులు ఆచితూచి వ్యవహరించవలెను. విద్యార్థులు జ్ఞాపకశక్తి లోపం వలన బాధపడుదురు. స్థిరాస్తి వ్యవహారం చిక్కుల్లో పడును.

వైదిక సూచన:

1) రుద్ర చమక పఠనం

2) శనివారం నాడు హనుమాన్ ఆలయ సందర్శన

3) మంగళవారం కార్తికేయుని ఆలయ సందర్శనం ద్వారా ప్రతికూల ఫలితాలు తగ్గును.

**కన్యారాశి:**

ఆర్థిక స్థితి అనుకూలంగా ఉండును. స్పెక్యులేషన్ జోలికి వెళ్ళరాదు. దీర్ఘకాలంగా వ్యాధులతో బాధపడువారికి కొంత ఉపశమనం లభించును. గృహంలో శుభకార్యం లేదా సంతానం కలుగుటద్వారా ఆనందం పొందెదరు. బంధువులతో అభిప్రాయ భేదాలు వచ్చే అవకాశం కలదు. ఉద్యోగస్తులకు పదోన్నతి కలుగును. దూరప్రయాణాలకు దూరంగా ఉండవలెను. వ్యాపారస్తులకు అనుకూలకాలం. కోర్ట్ వ్యవహారాలకు, స్థిరాస్తి కొనుగోలుకు అనుకూల సమయం. ఉన్నతవిద్య అభ్యసించువారికి అనుకూల సమయం.

వైదిక సూచన:

1) ప్రతి శనివారం నవగ్రహ ప్రదక్షిణ చేయుట

2) నిత్యం సూర్యనారాయణ స్వామికి అర్ఘ్యం ఇచ్చుట

3) శుక్రవారం అమ్మవారి ఆలయ సందర్శనం ద్వారా మంచి ఫలితాలు లభించును

**తులా రాశి:**

ఆర్థికస్థితి అనుకూలంగా ఉండును. గృహంలోని పెద్దలకు అవసరమైన వైద్య పరీక్షలు చేయించండి. గృహంలో శుభకార్యం జరుగుతుంది. ఉద్యోగస్తులకు పదోన్నతి అవకాశం. వ్యాపారస్తులకు అనుకూలసమయం. విద్యార్థులు బద్ధకం విడిచిపెట్టి చదువుయందు శ్రద్ధ వహించవలెను.

వైదిక సూచన:

1) శ్రీ నరసింహస్వామి ఆలయ సందర్శన

2) కార్తికేయునికి పాలతో అభిషేకం

3) పంచాక్షరీ మంత్రం మననం చేయుట ద్వారా అశుభ ఫలితాలు తొలగిపోవును.

**వృశ్చిక రాశి :**

ఆర్థిక స్థితి అనుకూలంగా ఉండును. సహచరులను నమ్ముటద్వారా ఆర్థికంగా నష్టపడుడురు. స్నేహితులద్వారా కోర్ట్ విషయాలు పరిష్కారం అగును. తీర్థయాత్రలు చేయు అవకాశం కలదు. ఉద్యోగస్తులకు తమ సహచారులద్వారా హాని కలుగు అవకాశం కలదు. జాగ్రత్త వహించవలెను. వ్యాపారస్తులు తమ అనుచరులను అతిగా నమ్మవద్దు.

వైదిక సూచన:

1) లలితా త్రిశతి పారాయణ

2) కాళీ అమ్మవారి ఆలయ దర్శన మరియు
3) ప్రదోషకాలంలో శివాలయ సందర్శన ద్వారా శుభ ఫలితాలు పొందుతారు.

**ధను రాశి :**

ఆర్ధికస్థితి సామాన్యంగా ఉండును. స్నేహితుల సహకారంతో సమస్యలనుండి బయటపడుడురు. మానసిక ప్రశాంతత కోలుపోవుదురు. అపరిచితుల వలన నష్టపోయే ప్రమాదము కలదు. జాగ్రత్త వహించవలెను. ఉద్యోగ స్థలంలో పరిస్థితులు అనుకూలంగా వుండవు. వ్యాపారస్తులకు అనుకూల సమయం కాదు. శాంతి మరియు సహనం పాటించవలసిన సమయం.

వైదిక సూచన:

1) దశరథ కృత శనిస్తోత్ర పారాయణ
2) అమ్మవారిని నేతిదీపంతో ఆరాధన మరియు
3) పవిత్ర నదిలో స్నానం ఆచరించుట ద్వారా ప్రతికూల ఫలితాలు తగ్గుతాయి.

**మకర రాశి:**

ఆర్ధిక విషయంలో చక్కటి ప్రణాళిక రచించవలెను. లాభనష్టములు సమానముగా ఉండును. ఆరోగ్యవిషయములో ముందు జాగ్రత్తలు తీసుకొనవలెను. వ్యసనములకు బానిస అయ్యే అవకాశము కలదు. గృహములో కలతలు వచ్చు సూచనలు కలవు. మౌనం వహించుట శ్రేయస్కరం. ఉద్యోగస్తులు అధిక శ్రమతో మెప్పు పొందుతారు మరియు అతి జాగ్రత్తగా ఉండవలెను. వ్యాపారులు వ్యాపార విస్తరణకు పూనుకోకూడదు. నష్టాలు చవిచూచే అవకాశము కలదు. విద్యార్ధులు చెడు స్నేహితుల వలన నష్టపోవుదురు. చదువుపై శ్రద్ధ వహించుట మంచిది.

వైదిక సూచన:

1) ప్రతి నిత్యం 'ఓం గం గణపతయే నమః' అను మంత్రం 108 సార్లు పఠించవలెను.
2) పక్షులకు ఆహారం పెట్టవలెను.
3) ఆదిత్య హృదయం పారాయణ చేయుట ద్వారా అనుకొన్న పనులు నెరవేరును. ప్రతిబంధకాలు తొలిగి శుభఫలితాలు లభించును.

**కుంభ రాశి:**

ఈ మాసంలో ఆర్ధిక స్థితి అనుకూలంగా ఉండును. రిస్క్ తీసుకుని చేసే పనుల ద్వారా నష్టపోయే ప్రమాదం కలదు. ఆరోగ్య విషయంలో ఉపశమనం పొందుదురు. మీకున్న వ్యసనముల వలన గృహములో అశాంతి కల్గును. హామీలు ఇచ్చుటద్వారా నష్టపోవుదురు. ఉద్యోగస్తులకు మంచి అనుకూల సమయం. వ్యాపారస్తులు మంచి లాభాలు పొందుతారు. విద్యార్ధులు పోటీ పరీక్షల్లో విజయం పొందుతారు. చదువులో పురోగతి ఉంటుంది.

వైదిక సూచన:

1) అష్టాక్షరీ మంత్ర జపం,
2) కార్తికేయుని ఆలయ దర్శనం,
3) ఆదివారం నాడు గోధుమలు దానం చేయుట ద్వారా శుభఫలితాలు పొందుతారు.

**మీన రాశి :**

ఆర్ధిక పరిస్థితి కొంతమేర ఆశాజనకంగా ఉండును. ఆరోగ్య విషయంలో శ్రద్ధ వహించవలెను. గృహములో శాంతి దొరుకును. అన్నదమ్ములతో కలహము జరిగే అవకాశము కలదు. కోర్ట్ వ్యవహారములో జాగ్రత్త వహించవలెను. ఉద్యోగస్తులు కొన్ని అవాంతరాలు ఎదుర్కొన్నా విజయం సాధించగలరు. వ్యాపారస్తులకు అనుకూలసమయం. పెద్ద హోదాలో ఉన్నవారు పదవి కోల్పోయే ప్రమాదం కలదు. విద్యార్ధులు చదువులో శ్రద్ధ చూపినచో మంచి విజయాలు సాధిస్తారు.

వైదిక సూచన:

1) మేధా దక్షిణామూర్తి ఆలయ సందర్శనం,
2) శనివారం నాడు గోవుకు ఆహారం తినిపించుట మరియు
3) శ్రీ గణేశ ఆలయం బుధవారం నాడు సందర్శించుట ద్వారా ప్రతికూల ఫలితాలనుండి విముక్తి పొందుతారు.

(సర్వే జనాస్సుఖినో భవంతు)

Published by T.Shanti, Edited and Printed by T.Shanti at Flat No. 45058, Janapriya Utopia, Hyderguda, Attapur, Hyderabad - 500048. Phone: 9490571297 / 94401 47993 ; email: teega51@gmail.com (www.chaitanyam.net)
Printed at Planographers, 5-8-300, Chirag Ali Lane, Abids, Hyderabad - 500001


నా తెలంగాణ కోటి రత్నాల వీణ.
2017
ప్రపంచ తెలుగు మహాసభలు 2017
विश्व तेलुगु सम्मेलन
WORLD TELUGU CONFERENCE



RNI No. APTEL/2011/39497 JANUARY 2018 Postal No. HSE/1043/2017-19

Date of Publishing: 1st January Date of Posting: 8th January

